PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 221 | విజయవాడ, శుక్రవారం 14 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 14 March 2025 | Rs

దేవనాగరి రూపాయి గుర్తుకు బదులుగా తమిళ అక్షరం

- బడ్జెట్ లోగోను మార్చిన తమిళనాడు
- 'ఎల్లోర్‌కుమ్ ఎల్లమ్' పేరుతో కొత్త ముద్ర ఆవిష్కరించిన స్టాలిన్

7



ఫైనల్‌కు ముంబయి

ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై 47 పరుగుల తేడాతో గెలుపు

6

సంతకాలు పెట్టాం... వెనక్కి తీసుకోం


సెకీ ఒప్పందంపై అసెంబ్లీలో చంద్రబాబు

రాబోయే నాలుగేళ్లు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'సెకి ఒప్పందంపై సంతకాలు పెట్టాం. ఒకసారి సంతకాలు చేసిన తరువాత వెనక్కి తీసుకుంటే పెనాల్టీలు కట్టాలి. దాంతోపాటు విశ్వసనీయత పోతుంది. అందుకే వెనక్కి తీసుకోలేం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం నాడు విద్యుత్‌రంగంపై స్వల్ప కాలిక వ్యవధి చర్చ జరిగింది. చర్చలో భాగంగా మాట్లాడిన చంద్రబాబు నాయుడు సెకి ఒప్పందంతోపాటు, పవర్ సప్లయ్ అగ్రిమెంటు కూడా రాష్ట్రానికి భారంగా మారిందని చెప్పారు. అయినా, దానిని సాకుగా చూపి వెనక్కిరావడానికి తాను సిద్ధంగా లేనని చెప్పారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చామని, ఆ మాటకు కట్టుబడి రానున్న నాలుగేళ్లు ఛార్జీలు పెంచబోమని చెప్పారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019-24 సంవత్సరాల మధ్య కాలాన్ని విద్యుత్ రంగానికి చీకటి రోజులుగా ఆయన అభివర్ణించారు. మొత్తం వ్యవస్థను గత ప్రభుత్వం ధ్వంసం చేసిందని చెప్పారు. దానిని తొమ్మిది నెలల్లో గాడిలో పెట్టామని అన్నారు.

క్లీన్ ఎనర్జీ పాలసీ పూర్తయ్యాక రూ.5.19 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎంఓయులు కుదుర్చుకున్నామని చెప్పారు. దీనిద్వారా రాష్ట్రంలో రూ.3.66 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని, రాబోయే ఐదేళ్లలో రూ.10 లక్షలకోట్ల పెట్టుబడులు సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గతంలో రైతుల ఇబ్బందులు చూసి పగటిపూటే తొమ్మిది గంటల విద్యుత్ ఇచ్చామని చెప్పారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చిన ఘనత తనదేనని ఆ తరువాత కరెంటు కొరతను అధిగమించామని చెప్పారు. 2004లో విద్యుత్ యూనిట్ రూ.2.55 పైసలు ఉంటే 2014 నాటికి రూ.5.25 పైసలకు పెంచారని సిఎం చెప్పారు. దీంతో వినియోగదారులపై మోయలేని భారం పడిందని పేర్కొన్నారు. గంటలకొద్దీ కోతలు విధించే పరిస్థితికి తీసుకొచ్చారని అన్నారు 2019లో అధికారంలోకి వచ్చిన ఓ వ్యక్తి అహం వల్ల రాష్ట్రం దెబ్బతినిపోయిందని తెలిపారు. గత ఐదేళ్లలో తొమ్మిదిసార్లు ధరలు పెంచి రూ.32 వేల కోట్ల భారం ప్రజలపై వేశారని అన్నారు. పోలవరం హైడ్రోపవర్ ఆలస్యం వల్ల రూ.1,044 కోట్లు భారం పడుతుందని చెప్పారు. రూ.62,826 కోట్లు ఉన్న అప్పు రూ.1.12 కోట్లకు పెరిగిందని చెప్పారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయిన తనకే విద్యుత్ బాదుడుకు పెట్టిన పేర్లు అర్థం కావడం లేదని మిగతా 7లో



అసెంబ్లీలో విద్యుత్ రంగంపై మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

స్టార్‌లింక్ ఒప్పందాన్ని ఆపండి

- చట్టాలను ఉల్లంఘించి ప్రైవేటు సంస్థలకు ఎలా ఇస్తారు ?
- సిపిఎం పొలిట్‌బ్యూరో ప్రశ్న

న్యూఢిల్లీ : బహిరంగ, పారదర్శక వేలం ద్వారా కాకుండా ఒక విదేశీ సంస్థకు, దానితో జత కట్టిన ఇతర ప్రైవేటు సంస్థలకు స్పెక్ట్రమ్‌ను ఏకపక్షంగా కట్టబెట్టడం మన దేశ చట్టాలకు తీవ్ర విరుద్ధమని సిపిఎం పేర్కొంది. తక్షణమే స్టార్ లింక్ ఒప్పందాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన జారీ చేసింది. దేశంలో అధిక వేగంతో ఉపగ్రహ ఆధారిత ఇంటర్‌నెట్ సేవలు ఇచ్చేందుకు జియో, ఎయిర్‌టెల్ ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పొత్తు కుదుర్చుకున్నట్లు ఇటీవల వచ్చిన వార్తలతో స్పెక్ట్రమ్ కేటాయింపులు, జాతీయ భద్రతా ఆందోళనలకు సంబంధించి తీవ్ర ప్రశ్నలు తలెత్తాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. స్పెక్ట్రమ్ అనేది అత్యంత కొరతగా వున్న వనరు అయినందున పారదర్శక, బహిరంగ వేలం ద్వారా మాత్రమే ప్రైవేటు వ్యక్తులకు కేటాయించవచ్చని 2జి కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. అలాకాకుండా సెక్ట్రమ్ కేటాయింపునకు జరిగిన ఏ ప్రైవేటు ఒప్పందమైనా అది దేశ చట్టాలను ఉల్లంఘించినట్లే అవుతుందని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. భారతదేశంలోని కోట్లాది మంది టెలికం వినియోగదారులను పణంగా పెట్టి ఉపగ్రహ స్పెక్ట్రమ్ వినియోగంలో ఆధిపత్యం చెలాయించేందుకు జియో, ఎయిర్‌టెల్, స్టార్‌లింక్‌లు ఒక కూటమిగా ఏర్పడుతున్నాయి.

పైగా, ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను ప్రత్యేకంగా వ్యూహాత్మక వినియోగాలకే అంటే రక్షణ, ఇస్రో కార్యకలాపాలకు కేటాయించాల్సి వుంది. ఇది కేవలం స్పెక్ట్రమ్ కేటాయింపునకు సంబంధించిన సమస్యే కాదు, ఒక దేశానికి వుండే ఆర్బిటల్ స్లాట్‌ల సంఖ్యకు సంబంధించిన సమస్య కూడా. కీలకమైన ఆర్బిటల్ స్లాట్‌లను స్వాధీనం చేసుకోవడానికి ఎస్‌యు1.హెచ్ ఉపగ్రహాలను అనుమతించడమే కాదు, మన జాతీయ వనరులను మ్యాపింగ్ చేసుకోవడానికి, వాణిజ్యపరంగా విలువైన డేటాను సేకరించుకునేందుకు కూడా వీటిని ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు, వాతావరణం, పంటల పరిస్థితి, అలాగే వ్యూహాత్మకమైన లేదా రక్షణ డేటా వంటి వాటిని సేకరించడమనేది మన జాతీయ, భద్రతా ప్రయోజనాలకు వ్యతిరేకం కాగలదు. ముఖ్యంగా ఇస్రో, ఇతర భారతీయ సంస్థలకు ఇలా చేయగల సత్తా వుంది.

ఇటువంటి టెలికం సర్వీసులు దేశ రక్షణకు చాలా కీలకమైనవి. అమెరికా ఆధ్వర్యంలో రష్యాతో చర్చలు జరిపేలా ఉక్రెయిన్ అధ్యక్షుడిపై ఒత్తిడి తెచ్చేందుకు, అలాగే ఉక్రెయిన్ ఖనిజ వనరులను తమకు అప్పగించాలన్న అమెరికా డిమాండ్లను అంగీకరించేలా చేసేందుకు ఉక్రెయిన్ మిలటరీకి స్టార్‌లింక్ సేవలను నిలిపివేస్తామని అమెరికా బెదిరించిన విషయం మనకు తెలిసిందేనని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఒక అమెరికా కంపెనీ అధికంగా వ్యూహాత్మకంగా ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను, ఆర్బిటల్ స్లాట్‌లను స్వాధీనం చేసుకోవడానికి అనుమతించడం, రోదసీ గుత్తాధిపత్యాన్ని సృష్టించడమంటే మన జాతీయ సార్వభౌమాధికారం, భద్రతపై రాజీపడడమేనని సిపిఎం విమర్శించింది.

ఇంటర్ విద్యలో మార్పులు

- ఏప్రిల్‌లోనే అడ్మిషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఇంటర్మీడియట్ విద్యలో పలు కీలక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో బోర్డు సమావేశం అసెంబ్లీలోని మంత్రి కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఏప్రిల్ నుంచే అడ్మిషన్లు ప్రారంభించాలని నిర్ణయించారు. దీంతో 2025-26 విద్యాసంవత్సరం నుంచి జూన్ 1వ తేదికి బదులుగా ఏప్రిల్ 1వ తేదీ నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. 2026లో పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరిలో, ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ఏప్రిల్ 7వ తేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. వచ్చే సంవత్సరం నుంచి ఎలక్టివ్ సబ్జెక్టులను 2వ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టులు అంతర్భాగాలుగా 6 సబ్జెక్టులతో ఎంబైపిసి కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఎంపిసిలో రెండు సబ్జెక్టులుగా ఉన్న మ్యాథ్స్‌ను, బైపిసిలో రెండుగా ఉన్న బొటానీ, జువాలజీలను ఒకే సబ్జెక్టుగా విలీనం చేయనున్నారు. పోటీ పరీక్షల కోసం ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు మెటీరియల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు తయారు చేయనుంది. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్, కళాశాల, ఇంటర్మీడియట్, పాఠశాల విద్యల డైరెక్టర్లు నారాయణ భరత్ గుప్తా, కృతికా శుక్లా, విజయరామరాజు, సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, స్కిల్‌డెవలప్‌మెంట్ డైరెక్టర్ జి గణేష్‌కుమార్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, సెకండరీ విద్య కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, ఓపెన్ స్కూల్స్ కార్యదర్శి నరసింహారావు, ఆంధ్రా, పద్మావతి, ఎన్‌జి రంగా, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీల విసిలు జివి రాజశేఖర్, ఉమ, శారద రాజ్యలక్ష్మీదేవి, డిఎస్‌విఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

మండలిలో వైసిపి వాకౌట్

- అవినీతిపై వాగ్వాదం
- 2019-24 మధ్య కుంభకోణాలపై చర్చ
- టిడిపి పాలనను ప్రస్తావించిన వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ వైసిపి సభ్యులు శాసనమండలి నుండి గురువారం వాకౌట్ చేశారు. అంతకుముందు సభలో 2019-2024 మధ్య కాలంలో జరిగిన కుంభకోణాలపై లఘు చర్చ ప్రారంభించారు. టిడిపి సభ్యులు 2019-2024 మధ్య జరిగిన అవినీతిని ప్రస్తావించగా, 2014-19 మధ్య అవినీతిపై కూడా చర్చ జరపాలని వైసిపి సభ్యులు పట్టుబట్టారు. 2019-24 మధ్య జరిగిన అవినీతిపై చర్చ ప్రారంభం అయింది. ఈ చర్చలో 2014 నుంచి 2019 మధ్య జరిగిన అవినీతిని వైసిపి సభ్యులు కుంభా రవిబాబు, తూమాటి మాధవరావు ప్రస్తావించారు. పోలవరం నిర్మాణం చంద్రబాబుకు ఎటిఎంగా మారిందని ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ఆరోపణలను వారు గుర్తుచేశారు. మంత్రులు కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, బిసి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీలు బి.రాంగోపాలరెడ్డి, పంచుమర్తి అనురాధ తదితరులు మాట్లాడుతూ వైసిపి హయాంలో అవినీతి అంశాలను ప్రస్తావించారు. వైసిపి హయాంలో మద్యం, ఇసుక, విద్యుత్ తదితర రంగాల్లో చోటుచేసుకున్న అవినీతిపై వారు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇరు పక్షాల సభ్యుల ప్రసంగాలు ముగిసిన తరువాత చర్చకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానం చెప్పాలని చైర్మన్ కొయ్యే మోషన్ రాజు రూలింగ్ ఇచ్చారు. మంత్రి అనగాని గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అంశాలను ప్రస్తావిస్తుండటంతో ప్రతిపక్ష నాయకుడు బొత్సా సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో అవినీతి జరిగిందని, గత పది నెలలుగా ఆరోపిస్తున్నారని ఒక్క ఆరోపణనూ నిరూపించలేకపోయారని బొత్స అన్నారు. ఆధారాలు లేకుండా అవినీతి జరిగిందని పదేపదే ఆరోపించి వైసిపిపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. చేతనైతే విశాఖ భూములపై టిడిపి హయాంలో ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు నివేదికను బయటపెట్టాలని కోరారు. జగన్ పేరును ప్రస్తావించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ టిడిపి ప్రభుత్వం తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించారు. తరువవాత వైసిపి సభ్యులంతా బయటకు వెళ్లిపోయారు. దీనికి మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు మాపై ఆరోపణలు చేసి, జవాబులు చెప్పేసరికి సభ నుంచి వెళ్లిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత మంత్రి అనగాని సత్యప్రసాద్ వైసిపి హయాంలో కుంభకోణాలపై జరిగిన చర్చకు సమాధానం ఇస్తుండగా సమాధానాన్ని కూడా వాయిదా వేద్దామని చెప్పి సభను చైర్మన్ మోషేన్‌రాజు సోమవారానికి వాయిదావేశారు.

స్విమ్స్‌లో ఇంటర్వ్యూలు వాయిదా

- 'మత ప్రాతిపదికన' వద్దని విద్యార్థి సంఘాల వినతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

స్విమ్స్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల ఒత్తిడి మేరకు ఈ నెల 14న జరగాల్సిన ఇంటర్వ్యూలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వి కుమార్ తెలిపారు. మార్చి 8న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో 34 పోస్టులకు కేవలం హిందువులు మాత్రమే అర్హులని పేర్కొనడం రాజ్యాంగ విరుద్ధమని విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. ఈ మేరకు స్విమ్స్ డైరెక్టర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్య, వైద్య సంస్థలు రాజ్యాంగబద్దంగా నడుస్తాయని, లౌకిక సంస్థల్లో ఇలాంటి మత ప్రాతిపదికన నియామకాల నోటిఫికేషన్ ఇవ్వడం టిటిడి ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని తెలిపారు. మత వివక్ష వీడి, రాజ్యాంగ బద్దంగా అర్హులందరికీ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విసితో చర్చలు జరిపి ఇంటర్వ్యూలను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు డైరెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రవి, చలపతి, ఉదయ్‌కుమార్, ప్రవీణ కుమార్, భార్గవ్, బాలాజీ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

కాంటూరుతో సంబంధం లేకుండా ఒకే దశలో పరిహారం

- ఆ తర్వాతే 'పోలవరం' చేపట్టాలి
- మరో పోరాటానికి నిర్వాసితులు సిద్ధం కావాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- నిర్వాసిత గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - ఎటపాక/కూనవరం/చింతూరు విలేకరులు (అల్లూరి జిల్లా)

కాంటూరుతో సంబంధం లేకుండా పోలవరం నిర్వాసితులందరికీ ఒకే దశలో పరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆయన గురువారం ఎటపాక, కూనవరం, చింతూరు మండలాల్లోని పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించారు. తొలుత ఎటపాక మండలంలోని వీరాయిగూడెం, మురుమూరు గ్రామాల్లో యాత్ర సాగింది. అనంతరం ముంపు గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. 'ప్రతి సంవత్సరం గోదావరి వరదలకు మొదటగా మా గ్రామం ముంపునకు గురవుతోంది. 40 అడుగుల వరదకే గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంటోంది. అయినా మా గ్రామాన్ని ముంపు లెక్కల్లోకి తీసుకోలేదు' అని వీరాయిగూడెంకు చెందిన మహిళ కొరసా లక్ష్మి తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాత లెక్కల ప్రకారం నిర్వాసిత గ్రామాల జాబితాను ప్రభుత్వం తయారు చేసిందని, వాస్తవ లెక్కల్లో మిగతా 7లో



వీరాయిగూడెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

త్రిబుల్ ఎక్స్ సోప్ అధినేత మృతి

- పలువురు సంతాపం
- నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి-గుంటూరు



ప్రముఖ వ్యాపారవేత్త, త్రిబుల్ ఎక్స్ సోప్ కంపెనీ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ (77) గురువారం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని స్థానిక అరండల్‌పేటలోని ఆయన స్వగృహంలో సందర్శనార్థం ఉంచారు. భార్య పరిమళ, కుమారుడు పర్వీన్‌రాజ్, కుమార్తె భారతి ఉన్నారు. తమిళనాడుకు చెందిన అరుణాచలం మాణిక్యవేల్ గుంటూరులో స్థిరపడ్డారు. ఇక్కడి నుంచే సబ్బుల వ్యాపారం ప్రారంభించారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, నగర ప్రముఖులు సంతాపం తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

'ఉపాధి' వేతనాలు పెంచండి

- కేంద్రానికి పార్లమెంటరీ కమిటీ హితవు
- నిధుల విడుదలలో జాప్యంపై ఆగ్రహం
- అదనపు పని దినాలు పెంచాలని, ఆధార్ ఐచ్ఛికంగా ఉండాలని సూచన



న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) కింద రాష్ట్రాల్లో అమల్జేస్తున్న 'ఉపాధి' పథకాలకు కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తుండడంపై పార్లమెంటరీ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. గ్రామీణ వేతనాలపై ద్రవ్యోల్బణ వాస్తవ ప్రభావానికి అనుగుణంగా వేతన రేట్లను సవరించాలని కేంద్రానికి సూచించింది. దేశ వ్యాప్తంగా ఒకే రకమైన వేతన రేటును వర్తింపజేయాలని సిఫార్సు చేసింది. ఉపాధి హామీ పథకం కింద పని దినాలను 100 నుండి 150కి పెంచాలని, ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని ఐచ్ఛికం చేయాలని, పశ్చిమ బెంగాల్‌కు ఇవ్వాల్సిన నిధులను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని కూడా సూచించింది. కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకా నేతృత్వంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ (2024-25)పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం తన నివేదికలను లోక్‌సభకు సమర్పించింది.

వేతన రేట్లపై...

వేతన రేట్లను పెంచకపోవడంపై తాము చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నామని కమిటీ తన నివేదికలో మరోమారు గుర్తు చేసింది. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలులో ఉన్న వేతన రేట్లలో వ్యత్యాసాలు ఉన్నాయని తెలిపింది. వ్యవసాయ కార్మికుల వినియోగ ధరల సూచీతో ముడిపడిన ఉపాధి పథకం వేతనాలు ద్రవ్యోల్బణ ధోరణులను ప్రతిబింబించడం లేదని చెప్పింది. ఈ సూచీ ద్రవ్యోల్బణ వాస్తవ ప్రభావానికి అనుగుణంగా లేదని అభిప్రాయపడింది. కాబట్టి క్షేత్ర స్థాయిలో వాస్తవ ఆర్థిక పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ప్రాధాన్యతా ప్రాతిపదికన వేతన లెక్కలను సమీక్షించి తాజా పరచాలని సూచించింది. ఈ పథకానికి కేంద్రం నిధులు అందిస్తున్నందున అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒకే విధమైన వేతన రేటు ఉండేలా గ్రామీణాభివృద్ధి శాఖ పరిశీలన జరపాలని కోరింది.

వాటా చెల్లింపుపై...

ఉపాధి పథకానికి కేంద్రం తన వంతు వాటాను సకాలంలో చెల్లించకపోవడంపై మిగతా 7లో

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వనితారాణి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు చివరికి ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్రంలో వివిధ పార్టీలకు చెందిన ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. అభ్యర్థులంతా ఏకగ్రీవమైనటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వనితారాణి ప్రకటించారు. కూటమి పొత్తులో భాగంగా టిడిపి తరపున బి.తిరుమలనాయుడు (బిటి నాయుడు), బీద రవిచంద్ర, కావలి గ్రీష్మ నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జనసేన తరపున కొణిదల నాగేంద్రబాబు, బిజెపి తరపున సోము వీర్రాజు నామినేషన్ వేశారు. కాగా, వీరంతా ఏకగ్రీవమయ్యారని వనితా రాణి ప్రకటించారు. అలాగే ఎన్నికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



బిటి.నాయుడు



బీద రవిచంద్ర



కావలి గ్రీష్మ



కె.నాగేంద్రబాబు



సోము వీర్రాజు

సక్రమంగా అమలు కాని ఇహెచ్‌ఎస్ : పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎంప్లాయిస్ హెల్త్ స్కీం(ఇహెచ్‌ఎస్) సక్రమంగా అమలు కావడం లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, బి గోపిమూర్తి అన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఆలస్యం కావడంతో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద ఉద్యోగులకు చికిత్సలు చేస్తున్నాయని చెప్పారు. ఇహెచ్‌ఎస్‌కు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు బిల్లుల విషయంలో చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఇహెచ్‌ఎస్‌లో రూ.2లక్షలు చికిత్సకు ఖర్చయితే, రీయింబర్స్‌మెంట్ కింద రూ.6లక్షలు ఖర్చు అవుతోందన్నారు. హెల్త్ కార్డు ఉన్నా తమకు నష్టం జరుగుతోందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇహెచ్‌ఎస్ బకాయిలను సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎయిడెడ్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ అమలు చేయాలని కోరారు. బకాయిలు ఉండటం వల్ల ఉద్యోగులు చికిత్సకు వెళ్లిన సమయంలో ప్రైవేట్ ఆస్పత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఇహెచ్‌ఎస్ అమలు కోసం గతంలో కోఆర్డినేషన్ కమిటీ ఉందని, వీటిని మరలా పునరుద్ధరించాలని కోరారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇహెచ్‌ఎస్ వైద్యాన్ని నిరంతరాయంగా అందించే ప్రయత్నాలు చేస్తున్నామని సమాధానం చెప్పారు. ఉద్యోగుల నుంచి మినహాయించిన సొమ్మును గత ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్టుకు అందించలేదన్నారు. ఎయిడెడ్ ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ అమలు చేసేందుకు వారి వాటాను, సంబంధిత యాజమాన్యాలు చెల్లిస్తే మిగిలిన వాటాను ప్రభుత్వం భరించి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దస్తగిరికి భద్రత పెంపు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి భద్రత పెంచుతూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న 1+1 గన్‌మెన్లను 2+2కు పెంచినట్లు వైఎస్‌ఆర్ జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ తెలిపారు. వివేకా హత్యకేసులో సాక్షులు అనుమానాస్పదంగా మృతి చెందుతున్న నేపథ్యంలో తనకు భద్రత పెంచాలని కోరుతూ బుధవారం ఎస్‌పిని కలిసి దస్తగిరి వినతిపత్రం అందజేశారు. వినతిని పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు దస్తగిరికి భద్రత పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. గురువారం రాత్రి ఇద్దరు గన్‌మెన్లు దస్తగిరి ఇంటి వద్ద విధుల్లో చేరారు.

19నుంచి 22వరకు చిన్నారులకు ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 19 నుంచి 22 వరకు, 25 నుంచి 28 వరకు 0-6 సంవత్సరాల వయసు గల చిన్నారుల ఎన్‌రోల్‌మెంట్ కోసం ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖ వెల్లడించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతానికి అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఎల్‌డిఓ, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారులు కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ఉక్కు నేతలపై నిర్బంధం

- నేటి నిరసనల నేపథ్యంలో ముందస్తు అరెస్టులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి నిర్బంధానికి దిగింది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్త నిరసనలు జరుగనున్న నేపథ్యంలో గురువారం రాత్రి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి స్టీల్‌ప్లాంట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులను సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటనలో ఖండించారు. ఇలాంటి నిర్బంధకాండ ప్రయోగిస్తే టిడిపి కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పశువుల కంటే హీనమా?

- వలస కార్మికుల వివరాల నమోదుపై ప్రశ్నించిన ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వలస కార్మికుల వివరాల సేకరణ అంశంపై శాసన సభలో పలువురు సభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలు, దేశాలకు అనేక మంది కార్మికులు వలస వెళుతున్నారని, వీరి వివరాలు కార్మిక శాఖ వద్ద ఉన్నాయా? అని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ప్రశ్నించారు. పశువులను తరలించేటప్పుడు గ్రామ పంచాయతీలో వివరాలు నమోదు చేసి రశీదు ఇస్తారని, వలస కార్మికుల పరిస్థితి పశువుల కంటే హీనంగా ఉందని, ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. శాసన సభ గురువారం ప్రారంభమైన అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రశ్నోత్తరాలకు అవకాశం ఇచ్చారు. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... కర్నూలు జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు వలసలు వెళుతున్నారని, వీరికి వెళ్లినచోట సరైన సౌకర్యాలు ఉండటం లేదన్నారు. అక్కడ ఏవైనా ప్రమాదాలు జరిగితే ఎవరిని సంప్రదించాలని, కార్మిక శాఖ ఎవరినైనా నియమించిందా, ఈ విషయంలో ప్రభుత్వం బాధ్యత ఏమిటని ప్రశ్నించారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల వివరాల నమోదుపై అవగాహన లేదన్నారు. 70 శాతంలోపే కార్మికుల నమోదు జరిగిందని తెలిపారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... ఆదోని నియోజకవర్గంలోని గ్రామాల్లో సగానికిపైగా ఇళ్లకు తాళాలు వేసి ఉంటాయని, 2.60 లక్షల మంది ఓటర్లలో లక్ష మందికిపైగా వలస వెళ్లారని చెప్పారు. కార్మిక శాఖ మంత్రి చదివిన సమాధానం వాస్తవం కాదన్నారు. తాను 24 శాఖల మంత్రులకు ఇప్పటి వరకూ 160 లేఖలు రాశానని, ఏ శాఖ నుంచి వివరాలివ్వ లేదని అన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమాధానమిస్తూ... వలస కార్మికుల అంశం కార్మిక శాఖ పరిధిలోనే లేదని గ్రామీణాభివృద్ధి, ఎంఎస్‌ఎంఇ, తదితర శాఖలకు సంబంధించిందని చెప్పారు. 16 నుంచి 59 ఏళ్లలోపు అసంఘటిత కార్మికులు తమ వివరాలను ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ 61.55 లక్షల మంది నమోదయ్యారని, కోటి మంది నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ స్పందిస్తూ... ఇతర శాఖలను సమన్వయం చేసుకుని వివరాలు సభ్యులకు తరువాత పంపించాలని మంత్రికి సూచించారు.

లబ్ధిదారులకు తెలియకుండానే ఇళ్ల రుణాలు

గత ప్రభుత్వ హయాంలో 40,570 మంది లబ్ధిదారులకు ఎటువంటి సమాచారం లేకుండానే వారి పేరుతో టిడ్కో ఇళ్లకు రుణాలు తీసుకున్నారని సభ్యుల ప్రశ్నకు సమాధానంగా పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. బ్యాంక్‌లు ఇఎంఐ వసూళ్లకు నోటీసులివ్వడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. వీరికి న్యాయం చేసేందుకు త్వరలో రూ.140 కోట్లు బ్యాంక్‌లకు వడ్డీ, ఇఎంఐ కింద చెల్లించనున్నట్లు తెలిపారు. వీరికి త్వరలో ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. 77,606 మందికి రూ.2,275 కోట్లు రుణం గత ప్రభుత్వం తీసుకుందన్నారు. టిడిపి ప్రభుత్వం కేటాయించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల నుంచి 2.38 లక్షల మందిని గత ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. అనర్హులు ఎవరైనా ఉంటే వారి పేరు తొలగించి అర్హులైన వారికి ఇళ్లు కేటాయించేందుకు అనుమతి ఇచ్చామన్నారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ... విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టుకు ఫేజ్ 1లో 46.23 కిలోమీటర్లకు, రూ.11,498 కోట్లతో డిపిఆర్ రూపొందించామని తెలిపారు. పీక్ అవర్ పీక్ డైరెక్షన్ ట్రాఫిక్ (పిహెచ్‌పిడిటి) పది వేల కంటే తక్కువ ఉన్న రూట్‌లలో ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇవ్వలేదన్నారు.

వైకుంఠపురం బ్యారేజి నిర్మాణానికి చర్యలు

కృష్ణానదిపై వైకుంఠపురంలో బ్యారేజి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు రూ.4,530 కోట్లతో అంచనాలు రూపొందించారని, ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చిన అనంతరం దశల వారీగా నిర్మాణం చేపడతామన్నారు. కర్నూలు జిల్లాలో శిల్పా వెంచర్స్ కాల్వలను ఆక్రమించి ప్లాట్లు వేసిన సంఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎయు అక్రమాలపై రెండు నెలల్లో విచారణ

ఆంధ్ర యూనివర్సిటీ మాజీ విసి ప్రసాదరెడ్డి హయాంలో వర్సిటీలో జరిగిన అవినీతి, అక్రమాలపై రెండు నెలల్లో విచారణ పూర్తి చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అందిన సమాచారం ప్రకారం రూ.20 కోట్ల మేర గ్రాంట్ దుర్వినియోగం జరిగిందని, నిధుల వ్యయంలో నిబంధనల ఉల్లంఘన వంటి ఫిర్యాదులందాయని తెలిపారు.

నా ఫిర్యాదునూ పట్టించుకోలేదు : మండలి చైర్మన్ మోషేనురాజు

జగనన్న ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని లబ్ధిదారుల నుంచి కొంతమంది వ్యక్తులు నగదు వసూలు చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ కె మోషేనురాజు అన్నారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో జగనన్న కాలనీల నిర్వహణలో నిధుల దుర్వినియోగంపై శాసనమండలిలో టిడిపి సభ్యులు రామారావు, తిరుమల నాయుడు, రామగోపాల్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భీమవరంలో లేఅవుట్‌లో 9వేల ఇళ్లు మంజూరు చేశారని చెప్పారు. ఇక్కడ ప్రైవేట్ కాంట్రాక్టర్ వచ్చి లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై విచారణ చేసి నివేదిక అందించాలని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశానని, ఇప్పటి వరకు ఈ అంశంపై చర్య తీసుకోలేదని, పట్టించుకున్నా పాపాన పోలేదన్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వీటిపై విచారణ జరుగుతోందని చెప్పేందుకు ప్రయత్నించారు. లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని తాను రెండు సార్లు శాసనమండలి చైర్మన్ హోదాలో లేఖ రాస్తే కలెక్టర్ పట్టించుకోకుండా కొత్తగా విచారణ ఎలా వేస్తారని మోషేనురాజు మంత్రిని ప్రశ్నించారు.



ఎస్‌ఐపిబి సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

రూ.1.21 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

- 26 ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటు
- ఐదు చోట్ల రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్లు
- ఎస్‌ఐపిబి సమావేశంలో అధికారులకు చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పరిశ్రమలు, విద్యుత్, పర్యాటక రంగాలకు సంబంధించి రూ.1,21,659 కోట్ల పెట్టుబడులకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఆమోదం తెలిపింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఎస్‌ఐపిబి సమావేశం జరిగింది. కొత్తగా వచ్చే పెట్టుబడుల వల్ల 80,104 మందికి ఉపాధి లభిస్తుందని సమావేశం అంచనా వేసింది. గత మూడు సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. ప్రాజెక్టుల పురోగతిపై నిత్యం పరిశీలించాలని, ట్రాకర్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్‌ఎంఇ పార్కు ఉండాలని, ఇందులో భాగంగా తొలుత 26 జిల్లాల్లో 26 పార్కులు ఏర్పాటు చేయాలని అన్నారు.

ఐదు చోట్ల రతన్‌టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేవరకూ నిరంతరం ఫాలోఅప్ చేయాలని తెలిపారు. ఈ విషయంలో మంత్రులు కూడా వేగంగా పనిచేయాలని తెలిపారు. గురువారం నాటి సమావేశంలో ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ రూ.1742 కోట్లు, దాల్మియా సిమెంట్ కడప జిల్లాలో రూ.2883 కోట్లు, విశాఖపట్నంలో లులూ ఇంటర్నేషనల్ రూ.1500 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు అనుమతిచ్చారు. సత్యవేడు రిజర్వు ఇన్‌ఫ్రాసిటీ ప్రైవేటు లిమిటెడ్ శ్రీసిటీలో రూ.25 వేల కోట్లు, ఇండోసోల్ సోలార్ ప్రైవేటు లిమిటెడ్‌లో రూ.58,469 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురాగా, అనుమతిచ్చారు. ఎన్‌జిఇఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్ రూ.22 వేల కోట్లు, ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ రూ.8240 కోట్లు, మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్ రూ.400 కోట్లు, ఒబెరాయ్ గ్రూపు రూ.250 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి.

తెలుగు సాహిత్యంలో మొల్లది అపూర్వ అధ్యాయం
సిఎం, మంత్రుల నివాళి

తెలుగు సాహిత్యరంగంలో కవయిత్రి మొల్లది ఒక అపూర్వ అధ్యాయమని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. మొల్ల జయంతి సందర్భంగా గురువారం అసెంబ్లీలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమశాఖమంత్రి సవిత మాట్లాడుతూ సామాన్య కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్ల వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన మహనీయురాలు అని కొనియాడారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 13న మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా నిర్ణయించడం సంతోషకరమన్నారు. తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభను చాటుకుని, కవిత్వంలో అపారమైన ఖ్యాతిని సొంతం చేసుకున్న కవయిత్రి మొల్ల జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

అన్నదాన సత్రం కూల్చడంపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్సార్ జిల్లా బద్వేల్ నియోజకవర్గ పరిధిలో కాశీనాయన క్షేత్రానికి చెందిన స్నానపు గదులు, కుమ్మరుల, రజకుల అన్నదాన సత్రాన్ని, గోశాల, గెస్ట్ హౌస్‌లను అటవీ శాఖ అధికారులు కూల్చివేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈమేరకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు.

సామాన్యులు, పేదలు, యాత్రికుల ఆకలిని తీరుస్తున్న అన్నదాన సత్రం, ఇతర వసతులపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించడం గర్హనీయమని తెలిపారు. 200 ఏళ్ల చరిత్ర గలిగిన అన్నదాన సత్రాలను కాపాడి, అభివృద్ధికి ప్రోత్సాహం ఇవ్వాల్సింది పోయి, సనాతనధర్మం కాపాడతానని కంకణం కట్టుకున్న అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ తన శాఖ ఆధ్వర్యంలోనే కూల్చివేతలకు పాల్పడడం దారుణమని విమర్శించారు. అటవీ శాఖ పరిధి నుండి ఆ ప్రాంతాన్ని మినహాయించి ప్రభుత్వం తన నిధులతో అన్నదాన సత్రాలను, ఇతర వసతులను పునర్నిర్మించాలని కోరారు. అక్రమ కూల్చివేతలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డీలిమిటేషన్‌పై సిఎం వైఖరేంటి?

- పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా అఖిలపక్షం ఏర్పాటు చేయాలని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోవడం తగదని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపితో పొత్తులో ఉన్నారని మౌనం వహించడం వల్ల నష్టం తప్పదని గ్రహించాలని, సిఎం తన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జనాభా లెక్కల ప్రకారం యుపిలో 80 నుంచి 143 స్థానాలు, బీహార్‌లో 40 నుంచి 79 స్థానాలు పెరిగితే... ఆ రెండు రాష్ట్రాల నుంచే 222 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహించే పరిస్థితి ఉంటుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కేవలం 12 స్థానాలు పెరిగి 54 మందికే అవకాశం లభిస్తుందన్నారు. దక్షిణాదిలో పెరిగే సీట్లు పదుల్లో ఉంటే ఉత్తరాదిలో ఆ సంఖ్య వందల్లో ఉందని తెలిపారు.

పోలీస్‌శాఖలో ఎస్‌సి, ఎస్‌టి సెల్ పునరుద్ధరించాలి

- మంత్రి బాలవీరాంజనేయస్వామికి కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఎపి పోలీస్ శాఖలో ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక సెల్‌ను పునరుద్ధరించాలని, 98 మంది డిఎస్‌పిలను తిరిగి నియమించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ఎంఎం నాయక్‌లకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి గురువారం లేఖ రాశారు. గత ప్రభుత్వం పోలీస్‌శాఖలోని ఎస్‌సి, ఎస్‌టి సెల్‌కు చెందిన ప్రత్యేక డిఎస్‌పిలను 2024లో రద్దు చేసిందని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు, సాధారణ కేసులు ఒకే డివిజన్‌లోకి తీసుకురావడంతో రాష్ట్రవ్యాప్తంగా చాలాకేసులు పెండింగ్‌లో పడ్డాయని వివరించారు. దీంతో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ బాధితులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

- మంత్రికి కాటికాపరుల సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

స్మశానంలో గుంతలు తీసి పూడ్చే, కాల్చే కాటికాపరుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటికాపరుల సంఘం కోరింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఆ శాఖ కమిషనర్ ఎంఎం నాయక్‌లను వారి కార్యాలయంలో కలిసి సంఘ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, కాటికాపరుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్‌జి కృష్ణ, జయమణి, యోగానంద్, ఎమ్‌డి ఆనంద్‌బాబు తదితరులు వినతిపత్రం అందజేశారు.

ఎక్కడ చూసినా సమస్యలే

- పరిష్కారానికి పోరాడతాం : సిపిఎం
- కొనసాగిన ప్రజా చైతన్య యాత్రలు

ప్రజాశక్తి-యంత్రాంగం

'ఎక్కడ చూసినా సమస్యలే. డ్రెయినేజీలు లేక రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. దోమల వల్ల రోగాల బారిన పడుతున్నాం. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. శ్మశాన వాటికలో ముళ్ల చెట్లను తొలగించడంలేదు. టిడ్కో ఇళ్లు మంజూరు చేసి ఏనిమిదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ కేటాయించలేదు. పెరిగిన విద్యుత్ ఛార్జీలతో కరెంటు బిల్లులు చెల్లించలేకపోతున్నాం.' అంటూ ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. నేతలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి పోరాడతామని తెలిపారు.

నంద్యాల జిల్లా కేంద్రంతోపాటు నంద్యాల మండలంలోని బిళ్లాలపురంలో 'డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. రోగాల బారిన పడుతున్నాం. శ్మశాన వాటికలో ముళ్ల పొదలు పెరిగిపోయి అంత్యక్రియలకు ఇబ్బంది పడుతున్నాం' అని గ్రామస్తులు, దళితులు సిపిఎం నాయకులకు తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పోరాడుతామని తెలిపారు. విశాఖ నగరంలోని అరుణోదయ కాలనీ, సుందరయ్యకాలనీల్లో జిఒ 296 పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యలపై స్థానికులు నాయకులకు విన్నవించారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని చిన్న కలవలపల్లి, కొత్తపేట గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికుల సమస్యలను నాయకులు తెలుసుకున్నారు. కె.కోటపాడు మండలంలోని రొంగలినాయుడుపాలెం గ్రామంలో చెరుకు రైతులతో సిపిఎం నేతలు మాట్లాడారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా కొయ్యూరు, పెదబయలు, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో ప్రజా చైతన్య యాత్రలు సాగాయి. వంతెనలు సహా పలు దీర్ఘకాలిక సమస్యలను ఆదివాసీలు నాయకుల దృష్టికి తెచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం, పాలకోడేరు మండలాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ.. ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను తొలగిస్తున్నారని తెలిపారు. పేదల ఇళ్లను అక్రమంగా తొలగించాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.



నెల్లూరులోని ఇందుకూరుపేటలో పర్యటిస్తున్న సిపిఎం నేతలు

విజయనగరంలోని పూల్‌బాగ్‌లో సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు ఆధ్వర్యంలో సిపిఎం నేతలు పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ 30 ప్రకారం పూల్‌బాగ్ పిజి కాలేజీ ఎదురుగా 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లకు రెండు సెంట్లు ఉచితంగా రెగ్యులర్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేపాడ మండలంలో ప్రజా చైతన్య యాత్ర సాగింది. జిడికి మద్దతు ధర ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. పార్వతీపురం మండలం పాచిపెంటలో సిపిఎం నేతలు పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. నెల్లూరు నగరం, రూరల్ డివిజన్లలో ప్రజా చైతన్య యాత్రలు జరిగాయి. ఇందుకూరుపేటలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ప్రజలు పలు సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. టిడ్కో ఇళ్లు మంజూరు చేసి ఏనిమిదేళ్లు కావస్తున్నప్పటికీ ఇప్పటికీ తమకు కేటాయించలేదని, పెరిగిన విద్యుత్ ఛార్జీలు భారంగా మారాయని, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ బృందానికి స్థానికులు పలు సమస్యలు వెల్లడించారు. ఇరిగేషన్, ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలి ఇప్పించాలని కోరారు. పెదనందిపాడులో మురుగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థతో రోగాలపాలవుతున్నారని తెలిపారు. అర్హులకు రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు పెన్షన్లు ఇవ్వడం తెలిపారు. మంచినీటి సమస్యను తొలగించాలని కోరారు .

15న అమరావతిలో శ్రీనివాస కళ్యాణం

- టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, తుళ్లూరు

అమరావతి రాజధాని ప్రాంతం వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 వరకు శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. గురువారం వెంకటపాలెంలోని శ్రీవారి ఆలయ ప్రాంగణంలో టిటిడి ఇఓ శ్యామలరావు, టిటిడి బోర్డు మెంబర్లతో కలిసి కల్యాణోత్సవం ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. సిఎం ఆదేశాల మేరకు శ్రీనివాస కళ్యాణోత్సవం అనంతరం అమరావతి పనుల పునర్నిర్మాణానికి అంకురార్పణ చేస్తారన్నారు. మొదటి విడతగా సుమారు రూ.37 వేల కోట్లతో పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో శ్రీనివాస కళ్యాణోత్సవం జరగనుండటం ఆనందంగా ఉందని బిఆర్ నాయుడు తెలిపారు. అమరావతి రైతులు, రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించామన్నారు. కల్యాణోత్సవం కార్యక్రమంలో సిఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ప్రజాప్రతినిధులు , రాజధాని రైతులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. టిటిడి ఇఓ శ్యామలరావు మాట్లాడుతూ శ్రీనివాస కళ్యాణోత్సవానికి హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కళ్యాణ వేదిక నిర్మాణంతో పాటు 27వేలమంది తిలకించేందుకు సదుపాయాలు కల్పిస్తున్నామని, గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీ బోర్డులు హోర్డింగులు ఏర్పాటు చేశామని చెప్పారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రుల బృందం

ఈనెల 15న టిటిడి ఆధ్వర్యాన జరగనున్న శ్రీనివాస కళ్యాణోత్సవం ఏర్పాట్లను గురువారం మంత్రుల బృందం పరిశీలించింది. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, ఎం.శాంతారామ్, ఎంఎస్ రాజు, ఇఓ శ్యామలరావు, డిఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, అదనపు ఇఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, దేవాదాయ శాఖ కార్యదర్శి వినయ్‌చంద్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, టిటిడి జెఇఓ వి.వీరబ్రహ్మం, ఎస్‌పి సతీష్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు.

వనరులను దేశ, విదేశీ కార్పొరేట్లకు అమ్మేసే కుట్ర

'ఎపి విజన్ - 2047 ఎవరి కోసం' సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఎపి విజన్-2047'లో రాష్ట్ర వనరులను, ప్రజల సొమ్మును దేశ, విదేశీ కార్పొరేట్‌లకు కట్టబెట్టే కుట్ర తప్ప అందులో ప్రజా ప్రయోజనాలకు ఎంత మాత్రమూ అవకాశం లేదని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యాన గురువారం సాయంత్రం ఎయు పూర్వ అర్థశాస్త్ర విభాగాధిపతి నళిని అధ్యక్షతన జరిగిన 'ఎపి విజన్-2047 ఎవరి కోసం ?' అన్న సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ - 2047 పేరుతో విడుదల చేసిన ఈ డాక్యుమెంట్‌పై చాలా విస్తృతంగా రాష్ట్రంలో చర్చ జరిపినట్లు చెప్పినా ఆ ఆనవాళ్లు ఎక్కడా లేవని తెలిపారు. పైగా ఈ డాక్యుమెంట్ చదివితే గతంలో అమరావతి విషయంలో బాహుబలి బొమ్మ ఎలాగైతే చూపారో రాష్ట్రం మొత్తానికి అదే చూపించబోతున్నారన్నది అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. 2000లో విజన్ 2021 అని చెప్పిన చంద్రబాబు దాని గతేమిటో చెప్పలేదని, 2014లో రాష్ట్రం విడిపోయిన సందర్భంలో ఏడు గ్రిడ్‌లు, ఐదు మిషన్‌లు అని చెప్పారని, ఇందులో ఏం జరిగిందో ఎక్కడా వివరించలేదని అన్నారు. తాజాగా 2047 విజన్‌కు సంబంధించి మోడీ చెప్పిన వికసిత్ భారత్‌కు రాష్ట్ర స్వర్ణాంధ్రను ముడిపెట్టడం సబబేనా అని శర్మ ప్రశ్నించారు. రాబోయే ఐదేళ్లకు ఆయన్ను ప్రజలు ఎన్నుకుంటే 2047 నాటికి ఏం చేస్తామనేది చెప్పడమనేది చాలా అప్రస్తుతమైన విషయమన్నారు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నప్పుడు దీర్ఘకాల లక్ష్యాలను నిర్దేశించడానికి ఎలాంటి ప్రాతిపదిక లేకపోగా, తర్వాత ప్రభుత్వం మారితే ఈ డాక్యుమెంట్ ఏమౌతుంది ? అన్న సందేశం అందరిలో నెలకొందన్నారు. మోడీ విజన్‌లో చంద్రబాబు దూరారని, పైగా ఈ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎండార్స్ చేయడం లేదని పేర్కొనడం మోసమే అవుతుందని అన్నారు.

దీన్నే ఛార్జిషీటుగా చూపించి చంద్రబాబు ప్రైవేట్ స్వదేశీ, విదేశీ సంస్థలకు రాష్ట్ర వనరులను ఎలా అమ్మేస్తున్నారో కేసు పెట్టొచ్చని తెలిపారు. ల్యాండ్ పూలింగ్ పేరుతో చిన్న పరిశ్రమల వాళ్లను, చేతి వృత్తిదారులను, చిన్నకారు రైతులను బలవంతంగా వారి భూముల నుంచి వెళ్లగొట్టనున్నారన్నారు. ప్రభుత్వమే దీనికి ఫెసిలిటేటర్‌గా మారుతుందని తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

ఆర్‌ఎస్‌ఎస్ కోరిక మేరకే జమిలీ

ఈ ఏడాది సంఘ్ పరివార్ సంస్థకు వందేళ్లు

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కార్ వన్ నేషన్-వన్ ఎలక్షన్(ఒఎన్ఒఇ)పై తీవ్రంగానే శ్రమిస్తోంది. దీనిని ఎలాగైనా తీసుకురావాలని ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే ఆటువైపుగా చర్యలు ప్రారంభించింది. ఇందుకు కావాల్సిన గ్రౌండ్‌వర్క్‌ను సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగానే భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)లను వేసింది. ఈ కమిటీలు చర్చలు జరిపాయి. నివేదికలను అందించాయి. అయితే, బీజేపీ తాపత్రయమంతా దాని మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ కోరికను తీర్చడం కోసమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అనేది సదరు హిందుత్వ సంస్థ వాంఛ అనీ, దానిని ఏ విధంగానైనా నెరవేర్చాలని మోడీ భావిస్తున్నారని అంటున్నారు.

ప్రస్తుతం దేశంలో వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రతిపాదన, దక్షిణాది మెడపై కత్తిని పెట్టే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ, ఈ-ఓటింగ్ ప్రతిపాదన పునరుద్ధరణ, నకిలీ ఓట్ల స్కాం గురించి తీవ్ర చర్చ నడుస్తున్నది. మోడీ సర్కారు జమిలీ ఎన్నికలపై ప్రధానంగా దృష్టిని సారించింది. ఏకకాల ఎన్నికలనేవి బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ చిరకాల వాంఛ. దానికి అనుగుణంగానే మోడీ సర్కారు పని చేస్తున్నది. అంతేకాదు, ఈ ఏడాదితో ఆర్‌ఎస్‌ఎస్‌కు వందేండ్లు పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో వన్ నేషన్-వన్ ఎలక్షన్‌ను తీసుకొచ్చి ఆర్‌ఎస్‌ఎస్‌కు బహుమతిగా ఇవ్వాలని మోడీ ప్రభుత్వం యోచిస్తున్నది.

ధీరేంద్ర కె.ఝా కొత్త పుస్తకం " గోల్వాల్కర్ : ది మిత్ బిహైండ్ ది మ్యాన్, ది మ్యాన్ బిహైండ్ ది మెషిన్" ఇదే విషయాన్ని తెలియజేస్తున్నది. " శాసనసభ నుంచి వారి దైనందిన జీవితాల వరకు, ముస్లింల పౌర హక్కులను నిరాకరిస్తామనే గోల్వాల్కర్ వాగ్దానం నెరవేర్చే ప్రయత్నం సాగడం రాజకీయంగా, ముస్లిములను కనుమరుగు చేసేస్తున్నారు. గోల్వాల్కర్ ఆలోచనలకు, భారత్‌ను హిందూ రాష్ట్రంగా మార్చటం అనే ఆయన ఆర్‌ఎస్‌ఎస్ కోసం నిర్దేశించిన చారిత్రక విధికి అనుగుణంగా ఉండటం వల్లే ఇదంతా సంఘ్ పరివార్‌లో విస్తృత ఆమోదం పొందింది" అని వివరించారు.

జమిలి ఎన్నికలు ఆర్‌ఎస్‌ఎస్ రెండో చీఫ్ భావనలకు దగ్గరగా ఉంటుందని పేర్కొన్నారు. ఏకీకృత ప్రభుత్వ విధానానికి ఆయన బలమైన మద్దతుదారు అని వివరించారు.

జమిలీ ఎన్నికలపై 2023, సెప్టెంబర్ 2న భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పడింది. గతేడాది మార్చి 14న 18 వేల పేజీలతో కూడిన తన తుది నివేదికను ప్రస్తుత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రామ్‌నాథ్ కోవింద్ సమర్పించారు. అయితే, మోడీ సర్కారు జమిలీ ఎన్నికల ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కాంగ్రెస్, సీపీఐ(ఎం)తో పాటు అనేక ప్రతిపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఇది భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతాన్ని ఉల్లంఘించటంతో పాటు న్యాయపరమైన చిక్కులు తీసుకొస్తాయనీ, పరోక్షంగా అధ్యక్ష తరహా పాలనకు దారి తీస్తుందని పలు ప్రశ్నలను, అనుమానాలను లేవనెత్తాయి.



ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్‌ను ఏకపక్షంగా నియమించటం కూడా ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నది. ఈయనకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంచి సంబంధాలు కూడా ఉండటం గమనార్హం. ఆర్‌ఎస్‌ఎస్ చిరకాల వాంఛ అయిన 'హిందూ రాష్ట్ర'ను దేశంలో తీసుకురావటానికి మోడీ సర్కారు ప్రయత్నాలు తీవ్రం చేస్తున్నది. ఈ ప్రక్రియ సాఫీగా సాగాలంటే సీఈసీగా తాము చెప్పినట్టు వినే వ్యక్తి ఉండాలని కేంద్రం భావించింది. ఇందులో భాగంగానే సీఈసీగా పదవి నుంచి దిగిపోయిన రాజీవ్ కుమార్ స్థానంలో జ్ఞానేశ్ కుమార్‌ను మోడీ తీసుకొచ్చారని విశ్లేషకులు అంటున్నారు. స్వతంత్ర రాజకీయ సంస్థగా ఉండాల్సిన ఎన్నికల సంస్థను కేంద్రంలోని మోడీ సర్కారు పలు సందర్భాల్లో స్వేచ్ఛగా పని చేయనివ్వలేదని, పలు ఎన్నికల్లో ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా పని చేసిందని ప్రతిపక్ష పార్టీలు పలు సందర్భాల్లో ఆరోపణలు చేసిన విషయం విదితమే. ఓటర్ల జాబితాలో చేరికలు, తొలగింపులపై కూడా ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇది అసలైన ప్రజాతీర్పుపై ప్రభావాన్ని చూపుతుందని అంటున్నాయి.

జమిలీ ఎన్నికలు జరపాలంటే రాజ్యాంగ సవరణలు అవసరం. ఇందుకు పార్లమెంటులోని ఉభయ సభల్లో కనీసం మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. దీనిని సూపర్‌మెజారిటీ అంటారు. అంటే.. లోక్‌సభలో 362 మంది, రాజ్యసభలో 167 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. అయితే, కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి అంత బలం లేదు. లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యులే ఉన్నారు. అంతేకాదు, గతేడాది సెప్టెంబర్‌లో జమిలీ ఎన్నికల బిల్లును కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. అదే ఏడాది డిసెంబర్‌లో పార్లమెంటు ముందుకు బిల్లును తీసుకొచ్చింది. లోక్‌సభలో 269 మంది అనుకూలంగా, 198 మంది వ్యతిరేకంగా ఈ బిల్లుకు ఓటు వేశారు. దీంతో జమిలీ అసాధ్యమనీ, కావాల్సిన మెజారిటీని మోడీ సర్కారు సాధించలేకపోయిందని ప్రతిపక్ష పార్టీలు అంటున్నాయి.

18న ధర్నాను జయప్రదం చేయండి

- పోస్టర్ ఆవిష్కరించిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18వ తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. ఈ ధర్నా పోస్టర్‌ను సిఐటియు రాష్ట్రప్రధాన కార్యదర్శి సి హెచ్ నర్సింగరావు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వరలక్ష్మి, దయా రమాదేవిలు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం బడ్జెట్ పెంచాలని, జోనల్ వారీగా మెనూను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఒకే మెనూ అమలు చేయాలని, ధరలు పెరుగుదలకు అనుగుణంగా మెనూ చార్జీలను కనీసం రూ. 20లు పెంచాలనే తదితర మరో ఆరు డిమాండ్ల పరిష్కారానికి ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వంశీ పిటిషన్ల విచారణ వాయిదా

ప్రజాశక్తి - అమరావతి

అక్రమ మైనింగ్‌పై గన్నవరం పోలీసులు పెట్టిన కేసుల్లో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద తనకు నోటీసులిచ్చి వివరణ తీసుకునేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ వైసిపి నాయకుడు వల్లభనేని వంశీ దాఖలు చేసిన రెండు పిటిషన్ల విచారణ ఈ నెల 17కి హైకోర్టు వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఎన్. హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మైనింగ్ యాక్ట్ కింద పిటిషనర్‌పై పోలీసులు పెట్టిన సెక్షన్లు ఏడు ఏళ్లలోపు శిక్ష పడేవే కాబట్టి సెక్షన్ 35(3) నోటీసు ఇచ్చేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ లాయర్ వాదించారు. నోటీసులిచ్చి వివరణ తీసుకొనేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, వంశీ పై నమోదు చేసిన కేసుల్లో పోలీసులు అదనపు సెక్షన్లు చేర్చారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మరిన్ని వివరాల నిమిత్తం విచారణను వాయిదా వేసింది.

మాజీ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిల పెన్షన్ పెంపునకు చంద్రబాబు సానుకూలం

- సిపిఐ రామకృష్ణ, జల్లి విల్సన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా మాజీ శాసనసభ్యులు, మాజీ శాసన మండలి సభ్యులు ఏళ్ల తరబడి ప్రజా జీవితంలో మమేకమై సేవలు చేశారని, వీరికి పెన్షన్ పెంచాలని సిఎం చంద్రబాబును సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్ కోరారు. సచివాలయంలో గురువారం సిఎంను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో పెన్షన్‌ను పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సిఎం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన చంద్రబాబు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన గజిట్‌ను పరిశీలించి సానుకూల చర్యలు తీసుకుంటానని హామీనిచ్చినట్లు వారు వెల్లడించారు. అధిక ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ రూ.30 వేలు సరిపోవడం లేదన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో పెన్షన్ పెరుగుదల లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత ఐదేళ్ల నుంచి మాజీ ప్రజాప్రతినిధులకు పెన్షన్ కనిష్టంగా రూ.50 వేలు, గరిష్టంగా రూ.70 వేలుగా పరిగణలోకి తీసుకున్నారన్నారు. అదే తరహాలో మన రాష్ట్రంలో మాజీ ప్రజాప్రతినిధులకి ఇచ్చే పెన్షన్‌ను రూ. రూ.50 వేలకు పెంచే విషయాన్ని పరిశీలించాలని కోరినట్లు తెలిపారు. మాజీ ప్రజాప్రతినిధుల్లో కొంతమంది వృద్ధులయ్యారని, మరికొంత మంది దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారు ఉన్నారన్నారని చెప్పారు.

ఇయు మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను

- ఆంక్షల పరంపర కొనసాగిస్తున్న ట్రంప్

వాషింగ్టన్ : షాంపైన్, వైన్ సహా అన్ని రకాల మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలను హెచ్చరించారు. అమెరికా విస్కీపై యూరోపియన్ యూనియన్ 50 శాతం సుంకాన్ని విధిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరికలు చేశారు. 'యూరోపియన్ యూనియన్ అధికారులు ప్రపంచంలోనే అత్యంత శతృవులుగా వ్యవహరిస్తూ అవమానకరంగా పన్నులు వేస్తున్నారు. అమెరికాను దెబ్బతీయడమే వారి ఏకైక లక్ష్యం. విస్కీపై యాభై శాతం సుంకాన్ని వసూలు చేస్తున్నారు. దీనిని తక్షణమే తొలగించకపోతే మేము కూడా ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాల నుండి వస్తున్న అన్ని రకాల వైన్స్, షాంపైన్లు, ఆల్కహాల్ ఉత్పత్తులపై త్వరలోనే 200 శాతం సుంకం వేస్తాం. ఇది అమెరికా వైన్-షాంపైన్ వ్యాపారానికి ఎంతో మంచిది' అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు.

కాగా అమెరికా నుండి దొంగిలించిన సంపదను తిరిగి స్వాధీనం చేసుకుంటామంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై యూరప్, కెనడా తీవ్ర స్థాయిలో స్పందించాయి. ఒకవేళ అమెరికా 28 బిలియన్ డాలర్ల విలువ కలిగిన సుంకాలు విధిస్తే మేము కూడా అదే స్థాయిలో వసూలు చేస్తామని యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు వాన్ డర్ లేయాన్ స్పష్టం చేశారు. కేవలం స్టీల్, అల్యూమినియం ఉత్పత్తుల పైనే కాకుండా వస్త్రాలు, గృహోపకరణాలు, వ్యవసాయ వస్తువులపై కూడా ఏప్రిల్ 1 నుండి పన్నులు ఉంటాయని అసోసియేట్ ప్రెస్ తెలిపింది.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన

- శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై గవర్నర్‌కు ఫిర్యాదు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై వైసిపి బృందం తరుపున గవర్నర్‌కు అబ్దుల్ నజీర్‌కు గురువారం ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం సమాజంలో విద్వక్షను పెంచేవిగా ఉన్నాయని, వాటిపై గరవ్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించామని ఆయన తెలిపారు. సిఎం వ్యాఖ్యలపై తక్షణం జోక్యం చేసుకోవాలనీ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇటీవల గంగాధర నెల్లూరులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ అన్ని పనులూ తెలుగుదేశం వారికే చేయాలని, వైసిపి వారికి ఏ పనీ ఏయకూడదని అలా చేస్తే పాముకు పాలుపోసినట్లేఅని చేసిన తీవ్ర వ్యాఖ్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే సమయం లో అందరికీ న్యాయం చేస్తానని చెబుతారని, దానికి విరుద్ధంగా చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరామని బొత్స వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందుకునే లబ్దిదారులకు పార్టీలు ఉండవని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వాటిని అందించాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ రాజకీయ నాయకుడూ చంద్రబాబులా మాట్లాడలేదని అన్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ మేలు చేయాలనేదే ప్రతి రాజకీయ పార్టీ సిద్ధాంతంగా ఉండాలని అన్నారు. సామాన్యుల అవసరాలకు రాజకీయ రంగు పులమడం మంచిది కాదని అన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరుపున పోరాడుతామని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, జర్నలిస్టులపైనా తప్పుడు కేసులు పెడుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేరుగు నాగార్జున, విడదల రజనీ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఉన్నారు.

సిమెంటు కంపెనీల్లో ఆర్‌డిఎఫ్ శాతం పెంచాలి



- స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభిరామ్ సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచన ప్రకారం సిమెంటు కంపెనీల్లో ఆర్‌డిఎఫ్(రిఫ్యూజ్ డిరైవ్డ్ ఫ్యూయల్)ని ఉపయోగించడంతోపాటు క్రమంగా పెంచాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ కృష్ణయ్య అన్నారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 23 సిమెంటు కంపెనీ యజమానులతో గురువారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టాభి మాట్లాడారు. 2018లో కేంద్రం విడుదల చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం సిమెంటు కిల్న్లలో వాడే బొగ్గుశాతాన్ని తగ్గించి 15 శాతానికి తగ్గకుండా మున్సిపల్ ఘన వ్యర్థాల నుండి వచ్చిన ఆర్‌డిఎఫ్‌ను వాడాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 123 అర్బన్ లోకల్ బాడీల నుండి దాదాపు ప్రతిరోజూ ఏడు వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, గ్రామీణ ప్రాంతాలను కూడా కలిపి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. వాటిని ప్రతిరోజూ ప్రాసెస్ చేసి సిమెంట్ కంపెనీలకు పంపుతామని అన్నారు. డంపింగ్‌యార్డు అనేది లేకుండా చేయాలంటే ఈ ప్రక్రియను మరింత పెంచాల్సి ఉందని చెప్పారు. శ్రీపతి మున్సిపాలిటీ కార్పొరేషన్‌కు 400 కిలోమీటర్ల పరిధిలో ఉన్న సిమెంటు కంపెనీ నిర్వాహకులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రపంచంలో పలు దేశాల్లో సిమెంటు కంపెనీలు ఆర్‌డిఎఫ్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఆర్‌డిఎఫ్ వినియోగానికి సంబంధించి జాయింట్ టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిఓఓ దశరథ రామిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిఇ డాక్టర్ పి.ప్రసాదరావు, జెసి ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోసానికి నోటీసులిచ్చి వివరణ తీసుకోండి

- హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి -అమరావతి

టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడిని అసభ్యపదజాలంతో దూషించారనే కేసులో సిని నటుడు పోసాని కృష్ణ మురళిపై బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకోవాలని బాపట్ల పట్టణ పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో పిటి వారెంట్ అమలుకానందున పోసానికి నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలన్ని జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టిటిడి ఛైర్మన్‌తోపాటు టిటిడి ప్రతిష్ఠను దిగజార్చేలా మాట్లాడిన పోసానిపై చర్యలు తీసుకోవాలంటూ బాపట్లకు చెందిన వేమవరపు విజయ్ కుమార్ చేసిన కేసును కొట్టేయాలని పోసాని దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్ పరిష్కారమైనట్లుగా న్యాయమూర్తి వెల్లడించారు.

14,967 పింఛన్లు తొలగించాం

- 1,58, 589 మంది మరణించారు
- మండలిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గత 9 నెలల్లో 1,58,589 మంది పింఛన్‌దారులు మరణించారని సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. పింఛన్ లబ్ధిదారుల సంఖ్యపై వైసిపి సభ్యులు ఎం అరుణ్‌కుమార్, రమేష్ యాదవ్, తోట త్రిమూర్తులు శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ తేడాది జూన్ నాటికి 65,18,496 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, ఫిబ్రవరి 2025 నాటికి ఈ సంఖ్య 63,59,907 మందిగా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 14,967 సామాజిక పింఛన్లను తొలగించామని వెల్లడించారు. ఈ సందర్భంగా వైసిపి సభ్యులు మాట్లాడుతూ 14,967 మాత్రమే తగ్గించామని చెప్పారని, కానీ మంత్రి చెప్పిన సమాచారం ప్రకారమే 1,58,589 తగ్గాయని తెలిపారు. అనర్హత పేరుతో దివ్యాంగులు, తదితర వారిని పింఛన్లు తొలగించారని చెప్పారు. మంత్రి మాట్లాడుతూ వైసిపి సభ్యులు అసత్యాలు చెబుతున్నారని, గత 9 నెలల్లో 1,58,589 మరణించడం వల్ల పింఛన్ల సంఖ్య తగ్గిందన్నారు.తాము కేవలం 14,967 పింఛన్లు మాత్రమే తొలగించామన్నారు. వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకొని వారిని శాశ్వత వలసదారులుగా పరిగణించి 10,791 మందిని, 4,176 మంది అనర్హులుగా గుర్తించి తొలగించామన్నారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన మార్గదర్శకాలనే పరిగణలోకి తీసుకుంటున్నామని తెలిపారు.

పరిశీలనలో ఆడబిడ్డ నిధి

ఎన్నికల్లో హామీఇచ్చిన ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తున్నారని వైసిపి సభ్యులు వరుదు కళ్యాణి, ఎస్ మంగమ్మ, టి కల్పలత అడిగారు. ఈ పథకం కింద 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500ల కింద ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని సభ్యులు గుర్తుచేశారు.

'పాస్‌పుస్తకాల' సవరణ బిల్లుకు సభ ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయ భూములకు సంబంధించి పాస్ పుస్తకాలు జారీచేసే అధికారాన్ని జిల్లా రెవెన్యూ అధికారుల నుంచి తొలగించి సబ్ కలెక్టర్/రెవెన్యూ డివిజనల్ అధికారులకు ఇస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం (1971) సవరణ బిల్లుకు శాసన సభ గురువారం ఆమోదించింది. ఈ బిల్లు ఉద్దేశాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరిస్తూ గతంలో ఆర్‌డిఓలకే ఈ అధికారం చట్టంలో కల్పించారని, 2022లో అప్పటి ప్రభుత్వం చట్టాన్ని సవరించి డిఆర్‌ఓలకు అప్పగించిందన్నారు. దీంతో గతకొంతకాలంగా నాలుగువేలకు పైగా పాస్‌పుస్తకాల కోసం దాఖలైన అర్జీలు రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. డిఆర్‌ఓ జిల్లాకు ఒక్కరే ఉంటారని వీరికి పని ఒత్తిడి అధికంగా ఉండటంతో ఈ అధికారాన్ని సబ్ కలెక్టర్/ఆర్‌డిఓలకు ఇచ్చి పాస్‌పుస్తకాలను జారీ చేసే గడువును ఆరు నుంచి మూడు నెలలకు కుదించామని చెప్పారు. దీంతో రైతుల అర్జీలు త్వరితగతిన పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు.

సంపాదకీయం

విపత్తు నేర్పే పాఠం!


ఇటీవల కాలపు ప్రపంచ అతి పెద్ద ఆరోగ్య విపత్తు కోవిడ్ 19ని ఎదుర్కొని అప్పుడే ఐదేళ్లు గడిచిపోయాయి. 2020 మార్చి 11వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) కోవిడ్‌ని పెను విపత్తుగా ప్రకటించటంతో అన్ని దేశాలూ అప్రమత్తమయ్యాయి. దేశాల మధ్య, పట్టణాలు నగరాల మధ్య, గ్రామాల మధ్య, ఆఖరికి మనిషికీ మనిషికి మధ్య భౌతిక దూరం అనివార్యమై, కనీవినీ ఎరగని పరిస్థితి నెలకొంది. ఎల్లెడలా భయాందోళనలు అలముకున్నాయి. రోజువారీ జీవనం అస్తవ్యస్తమైపోయింది. మన దేశంలో మోడీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు ఏర్పాట్లూ చేయకుండానే లాక్‌డౌన్ ప్రకటించటంతో కోట్లాదిమంది వలస కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. లక్షలాది మంది రోజుల తరబడి వందల కిలోమీటర్ల దూరం నడిచి, నానా ఇక్కట్లూ ఎదుర్కొన్నారు. అలాంటి సమయంలో దాహార్తికి నీరై, పగుళ్లు దేరిన కాళ్లకు చెప్పులై, నెత్తిన గొడుగులై, ఆకలికి ఇంత అన్నమై వలస జీవులను ఆదుకోవటానికి తోటి మనుషులు తోడై నిలిచిన తీరు గొప్ప మానవతా దృక్పథానికి అద్దం పట్టింది.

కోవిడ్ రెండో దశలో వ్యాధి ప్రభావం ఎక్కువై, మరణాలు సంభవించినప్పుడు కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల ధనదాహం కంపరం పుట్టించింది. ఆధునిక వైద్య విజ్ఞానంతో ఆదుకోవాల్సిన ప్రభుత్వ పెద్దలు కంచాలు వాయించమని, చప్పట్లు కొట్టమని, దీపాలు వెలిగించమని చేసిన ప్రహసనం ప్రపంచం ముందు నవ్వుల పాలైంది. విపత్తు తీవ్రతను తక్కువగా అంచనా వేసి, ప్రజల ప్రాణాలను పరిహాసం చేసిన దేశాధినేతల్లో అప్పటి, ఇప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఉన్నాడు. ఘోర విపత్తు సమయంలోనూ ఆరోపణలూ అత్యోక్తులతో కాలహరణం చేయడం మన పాలకుల దగ్గరా కనపడింది. ప్రమాద తీవ్రతను, మరణాలను దాచిపెట్టటానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. దేశంలో దాదాపు 4 లక్షల 74 వేల మంది మరణించారని మోడీ ప్రభుత్వం ప్రకటిస్తే- భారతదేశంలో మరణాల సంఖ్య 47 లక్షల వరకూ ఉందని డబ్ల్యుహెచ్ఒ వెల్లడించింది. విపత్తు వేళ దాపరికమూ, గొప్పల వ్యాఖ్యానమూ కొనసాగిస్తే- అవసరమైన చర్యలు చేపట్టడం సాధ్యం కాకుండాపోతుందని కోవిడ్ అనుభవం తేటతెల్లం చేసింది. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ తయారీ, పంపిణీ విషయాల్లో సామ్రాజ్యవాద దేశాలు లాభాల దృష్టితో వ్యవహరించాయి. చిన్న దేశమైన సోషలిస్టు క్యూబా అందుకు భిన్నంగా వ్యాక్సిన్‌ను, తమ వైద్య బృందాల సేవలనూ పలు దేశాలకు నేరుగా అందించింది.

శాస్త్రవేత్తలు, వైద్యులు, నర్సులు, పారిశుధ్య కార్మికులు తదితరుల నిరంతర కృషితోనూ, సేవలతోనూ ప్రపంచం విజయవంతంగా కోవిడ్ మహమ్మారిని తిప్పికొట్టింది. వైద్య వైజ్ఞానిక రంగం ఇలాంటి విపత్తులను ఎదుర్కొని, పైచేయి సాధిస్తుందని మరోసారి రుజువైంది. వ్యవస్థలను, కుటుంబాలను కోవిడ్ అనేక విధాల నష్టపరిచినా చిట్టచివరకు దానినుంచి బయటపడి ముందుకు సాగటం మానవ సమాజ సమిష్టి విజయం.

అయితే, ఇలాంటి ఘోర ఆరోగ్య విపత్తు నుంచి దేశాలూ ప్రభుత్వాలూ ఎన్నో గుణపాఠాలు నేర్చుకోవాలి. వ్యవస్థలు కార్పొరేటు శక్తుల చేతుల్లో ఉండడం, స్వార్థం, బాధ్యతారాహిత్యం, పర్యావరణ హననం వంటివి విపత్తుల వేళ కష్టాలను మరింత పెంచుతాయని గ్రహించాలి. ప్రతి వైపరీత్యంలోనూ కాసులు గడించుకునే కార్పొరేట్ వ్యాపార నమూనా సర్వజన హితానికి ఏమాత్రమూ పనికి రాదని అర్థం చేసుకోవాలి. ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ఆదుకునేది, అస్త్రశస్త్రాలను అందించేది వైజ్ఞానిక శాస్త్రం, శాస్త్రీయమైన సమిష్టి ఆచరణ తప్ప- గతాలూ, వాటి గొప్పతనాలూ కానేకాదని ఒప్పుకోవాలి. కానీ, పాలకులకు అలాంటి పాఠాలు తలకెక్కినట్టు లేదు. ఆరోగ్య ఆపత్కాలంలో కీలకంగా వ్యవహరించాల్సిన ప్రపంచ ఆరోగ్య సంస్థను బలోపేతం చేసే బదులు దానిని నిర్వీర్యపర్చటానికే అమెరికా పూనుకుంటోంది. మనదేశంలోనూ విద్యా వైద్య వైజ్ఞానిక రంగాల్లో పరిశోధనలు పెంచి, ఆయా వ్యవస్థలను మెరుగుపర్చటానికి తగిన నిధుల కేటాయింపు జరగటం లేదు. విపత్తులు విరుచుకుపడ్డప్పుడు హడావిడి పడడం కాదు; అవి తలెత్తకుండా చూడడం, తారసపడితే తగు రీతిలో ఎదుర్కోవటం మన కర్తవ్యంగా ఉండాలి. ఇదే విపత్తుల నుంచి విజ్ఞులు నేర్వాల్సిన పాఠం!

మహనీయుల మాట



ప్రకృతి సూత్రాలకు అనుగుణంగా ప్రతిదీ జరుగుతుందన్న భావన మీద శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్నాయి. అందువల్ల ప్రార్థనతోనో, అతీంద్రియ శక్తులతోనో, ఆరాధనతోనో సహజ పరిణామాల్ని ప్రభావితం చేయవచ్చని ఏ పరిశోధకుడూ నమ్మడు.


- ఐన్‌స్టీన్,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.
జననం : 14.3.1879
మరణం : 18.4.1955

విప్లవ తాత్వికుడు, విముక్తి మార్గ దార్శనికుడు

నివాళి

పీపీ

నేడు కారల్ మార్క్స్ 142వ వర్ధంతి



ఆయన 1883లో మరణిస్తే 1917లో అంటే తను పుట్టిన వందేళ్లకు ఆ విప్లవ సిద్ధాంతాన్ని లెనిన్ జయప్రదంగా అమలు చేశాడు. వర్గాలనే కూలగొట్టే ఇంత సమూలమైన మార్పు ఇంత త్వరితంగా వచ్చిన దాఖలా చరిత్రలో మరొకటి లేదు. అది మార్క్స్ బోధనల, లెనిన్ వ్యూహాల ఔన్నత్యం. సోవియట్ యూనియన్‌ను స్థాపించాక మార్క్సిజంతో లెనినిజం కూడా చేరినా పునాది మార్క్సిజమే. ఈ విప్లవానికి ముందు వందేళ్లు, తర్వాతి వందేళ్లలో ప్రపంచం ఎలా మారిందీ మారుతున్నదీ పరిశీలించకుండా మార్క్స్ సూత్రాలు బట్టీ వేస్తే ముందుకు పోగలిగింది వుండదు. మార్క్స్ చెప్పిందే అది. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయండి అని. కాలం మారింది కాబట్టి విప్లవం, కార్మికవర్గం, శ్రమ దోపిడీ వంటి పదాలకు అర్థం లేదని ఎవరైనా అంటే అంతకన్నా తప్పు వుండదు.

వర్ధంతి అంటే మరణానంతరం కూడా వర్ధిల్లే వారసత్వాన్ని సంస్మరించుకోవడం. ఆ మాట పూర్తిగా వర్తించే వ్యక్తి మార్క్స్. 19వ శతాబ్ది ప్రథమ పాదంలో పుట్టిన ఆ మహామనీషి సిద్ధాంతాలు 20 శతాబ్దాన్ని అనన్య సామాన్యంగా మలచి, ఆ శతాబ్ది చివరలో చిందరవందరలు అధిగమించి 21వ శతాబ్దంలో పునరుజ్జీవం పొందడానికి కారణమైనాయి. అంతకు ముందు నడిచింది పాలక వర్గాధిపత్య చరిత్ర. ఆయన భావధారతో మొదలైంది పాలకవర్గ ధిక్కార చరిత్ర. మార్క్స్ తత్వాలకూ సూక్తులకూ పరిమితమైన తాత్వికుల స్థానాన్ని చరిత్ర నిర్మాతల సరసన చేర్చిన అఖండ మేధావి. ప్రపంచాన్ని పరిపరి విధాల నిర్వచించడం కాదు మార్చాలంటూ విప్లవ శంఖం పూరించిన సాహస సైద్ధాంతికుడు. వాల్టేర్, రూసో, హెగెల్, లెస్సింగ్, హైనే వంటి మహా తాత్వికులందరూ ఒక్కటిగా రూపుదాలిస్తే మార్క్స్ అవుతాడని మోజెస్ హెస్ ప్రశంస చేసేనాటికి ఆయన వయస్సు కేవలం 23. ఆయన మరణించి ఇప్పటికి 142 ఏళ్లు గడిచిపోయినా మార్క్స్‌నూ మార్క్సిజాన్ని తలుచుకోకుండా ఒక్క రోజు కూడా గడవదు. అంతెందుకు? ఇప్పుడు అమెరికాలో ట్రంప్ రెండవ సారి అధికారంలోకి వచ్చి వికృత విధ్వంస విధానాలు అమలు చేస్తుంటే విశ్లేషకులు మార్క్స్ రచన '18 బ్రూమియర్ ఆఫ్ లూయీ బోనపార్టీ'ని తలుచుకుంటున్నారు. చరిత్ర ఒకసారి విషాదాంతంగా మరోసారి పరిహాస ప్రాయంగా పునరావృతం అవుతుందన్న ఆయన వ్యాఖ్యలను అమెరికా అధినేతకు అన్వయిస్తున్నారు.

చరిత్ర తర్కం

దేశ దేశాలలో ప్రాచీన కాలపు వేదాంతులు మనుషుల గురించి చాలా తత్వాలు పాడారు. మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి గాని ప్రతిచోటా సంకెళ్లతో బంధితుడై వున్నాడని ఫ్రెంచి తత్వవేత్త రూసో వాపోయాడు. ఆ మెట్ట వేదాంతాన్ని బద్దలు కొట్టడానికి ఈ తత్వవేత్త వేదన పారదోలడానికి ఏకకాలంలో మార్గదర్శనం చేశాడు మార్క్స్. ఆయన పుట్టక ముందు శ్రమ దోపిడీ విలువ వర్గం, విముక్తి వంటి పదాలకు వున్న అర్థం వేరు. కష్టపడేవారిపై జాలి పేదలపై సానుభూతి చాలామంది చూపించినా పరిష్కారం చేయడం అటుంచి చెప్పడం కూడా సాధ్యం కాలేదు. అనేక మంది శ్రమను అతి కొద్ది మంది చట్టరీత్యా దోచుకోవడం వల్లనే శత సహస్ర కోటీశ్వరులు కాగలుగుతున్నారనే పరమ సత్యం చాటి చెప్పి సిద్ధాంత రూపం ఇచ్చాడాయన. ఇప్పటి వరకూ నడిచిన (లిఖిత) చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే నని తేల్చిచెప్పేశాడు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి. పోయేదేమీ లేదు సంకెళ్లు తప్ప అని అభయమిచ్చాడు. ఈ క్రమంలోనే వలస దేశాల స్వతంత్ర కాంక్ష కూడా చూడగలిగాడు. భారత స్వాతంత్ర్య పోరాటం గురించి ఏ విదేశీ మేధావి కన్నా ముందు సమగ్రంగా చర్చించిన వ్యక్తి ఆయనే! సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థల పరిణామ క్రమాన్ని జమిలిగా చూడాలని గ్రహించాడు గనకనే తర్కాన్ని చరిత్రనూ మేళవించగలిగాడు. అది అతి తర్కం కాదు, అనునిత్యం అధ్యయనంతో ప్రతి పరిణామాన్ని పరిశీలిస్తూ పరిపూర్ణం చేసుకోవాల్సిన గతి తర్కం. ఆయన చెప్పిన చరిత్ర క్రమం రాజ వంశాల అనుక్రమణిక కాదు, మానవాళి మజిలీలను మథనం చేసిన మహాధ్యయనం. ప్రకృతిలో లాగే మానవ సమాజంలోనూ మార్పుల వస్తాయని అందుకు శ్రమ జీవులు చోదక శక్తులుగా వుంటారని చెప్పిన సారాంశం మార్క్సిజం. అయితే శ్రమ దోపిడీ పాఠాలు వల్లె వేస్తేనో లేక బానిస సమాజం భూస్వామ్య సమాజం పెట్టుబడిదారీ సమాజం సోషలిజం అని ఒక పరంపరను జపిస్తేనో మార్క్సిజమై పోదు. మార్పు రానూ రాదు. ఆ మూల సూత్రాల ప్రాతిపదికన ఆయా దశల్లో శ్రమ దోపిడీ రూపాలు గాని పీడక వర్గ వ్యూహాలు గాని అర్థం చేసుకుని రాజకీయ బలంతో సంఘటిత శక్తితో ఎదిరించాలి. ఒక్క ముక్కలో దీన్నే నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం అన్నారు. ఆచరణలో దాన్ని ఆచరణలో పెట్టి అనుకున్న విజయాలు సాధించడం, వచ్చిన విజయాలు నిలబెట్టుకోవడం నిరంతర సంఘర్షణ.

మన కాలపు దీపధారి

అంతులేని దారిద్ర్యాన్ని, అష్టకష్టాలనూ భరిస్తూనే మేధావిగా రచనలు చేయడమే గాక విప్లవ కారుడుగా నిరంతరం పోరాడాడు గనకే మార్క్స్ చరిత్ర గమనంలో ప్రజల పాత్రను పసిగట్టగలిగాడు. ఆయన 1883లో మరణిస్తే 1917లో అంటే తను పుట్టిన వందేళ్లకు ఆ విప్లవ సిద్ధాంతాన్ని లెనిన్ జయప్రదంగా అమలు చేశాడు. వర్గాలనే కూలగొట్టే ఇంత సమూలమైన మార్పు ఇంత త్వరితంగా వచ్చిన దాఖలా చరిత్రలో మరొకటి లేదు. అది మార్క్స్ బోధనల, లెనిన్ వ్యూహాల ఔన్నత్యం. సోవియట్ యూనియన్‌ను స్థాపించాక మార్క్సిజంతో లెనినిజం కూడా చేరినా పునాది మార్క్సిజమే. ఈ విప్లవానికి ముందు వందేళ్లు , తర్వాతి వందేళ్లలో ప్రపంచం ఎలా మారిందీ మారుతున్నదీ పరిశీలించకుండా మార్క్స్ సూత్రాలు బట్టీ వేస్తే ముందుకు పోగలిగింది వుండదు. మార్క్స్ చెప్పిందే అది. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయండి అని. కాలం మారింది కాబట్టి విప్లవం, కార్మికవర్గం, శ్రమ దోపిడీ వంటి పదాలకు అర్థం లేదని ఎవరైనా అంటే అంతకన్నా తప్పు వుండదు. 'మార్క్స్ ప్రతీకారం: ప్రపంచాన్ని మలుస్తున్న వర్గపోరాటం' అని అమెరికన్ పత్రిక టైమ్ 2013లో ముఖపత్ర కథనం ఇచ్చింది. ప్రపంచ దేశాలలో అన్నిచోట్ల కన్నా ఎక్కువగా అమెరికాలో ఆర్థిక కేంద్రీకరణ పెరుగుతున్న తీరుపై తీవ్ర హెచ్చరికలు చేస్తూ వీటిపై మార్క్స్ చెప్పిన వర్గ పోరాటాలు ప్రజ్వరిల్లడం తథ్యమని హెచ్చరించింది. పచ్చి మితవాద భావజాల ప్రతీఘాత దాడి, జాతీయ దురభిమానం, భావ ప్రకటనా స్వేచ్ఛపై అణచివేత ఇవన్ని మార్క్స్ బోధనలను మరింత ముందుకు తెస్తున్నాయి. దేశ దేశాలలో కమ్యూనిస్టులు, కార్మిక నాయకులు, ప్రజాస్వామిక వాదులు, మానవతా మూర్తులు పోరాడుతున్నారు. ఉద్యమాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్రజాస్వామిక శక్తులు వీటిపై పోరాడుతూనే ప్రభుత్వాలు నిర్వహిస్తున్నారు. సైద్ధాంతిక ఘర్షణలు సాగిస్తున్నారు. కొత్త గుణపాఠాలు నేర్చుకుంటున్నారు. ఇందులో తప్పొప్పులు వుంటాయి. చిన్న పెద్ద విజయాలూ వుంటాయి. ఎదురుదెబ్బలుంటాయి. కాని మహత్తర త్యాగాలూ వున్నాయి. చెక్కుచెదరని నిబద్ధతలు వున్నాయి. ఈ సంక్లిష్ట క్రమాన్ని అవగాహన చేసుకోకుండా శత్రుశక్తులూ మిత్రులనుకునేవాళ్లు కూడా పోరాడే శక్తులను అవహేళన చేయవచ్చు గాని వాటితోనే చరిత్ర ఆగిపోదు.

నిజానికి మార్క్సిజం సైద్ధాంతిక జైత్రయాత్ర కొనసాగుతూనే వుంది. ఈ ముప్పైల్లో పుట్టుకొచ్చిన చరిత్రాంతం, కాలానికి అంతం, దూరానికి అంతం, మహా సిద్ధాంతాల అంతం, ఆధునికత అంతం, సత్యం అంతం అంటూ అంతుపట్టని అంతం సిద్ధాంతాలే సోదిలోకి లేకుండా పోతున్నాయి. మార్క్స్ బోధలు మార్గదదర్శకంగానే వున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుష్ఫలితాలు ప్రతివారూ అనుభవిస్తున్నారు. అరగంటకో రైతు ఆత్మహత్య, నయా కంపెనీలు నరాలు తెగిపోయేలా సరికొత్త వెట్టిచాకిరి చేయించుకోవడం కనిపిస్తున్నది. ఉద్యోగాలు రాకపోగా వున్న వాటికే భద్రత లేకుండా పోతున్న తీరు మేధావులనే కలవర పెడుతున్నది. మొదట చెప్పినట్టు ట్రంప్ మలిపాలనలో దేశ దేశాలు ఈ మథనానికి గురవుతున్నాయి. ఇప్పుడు ఎలన్ మస్క్ బుల్లి కుమారుడు అమెరికా అధ్యక్షుని పక్కన కూర్చుని మీడియాకు ఫోజులు ఇస్తున్నాడంటే విదేశాంగ మంత్రి రిబిరే, మస్క్ ట్రంప్ ముందే కీచులాడుకుంటున్నారంటే అంతకన్నా ఉదాహరణ ఏం కావాలి? వరప్రసాదంగా గోచరించిన నూతన సాంకేతిక నిపుణులు కూడా ఎ.ఐ దెబ్బకు విలవిలలాడక తప్పడం లేదు. వీటిపై మరింత అధ్యయనం చేయడం మార్క్స్ అనుయాయుల కర్తవ్యం. ఉదాహరణకు సిపిఎం మహాసభ ముసాయిదా నయా ఫాసిజంగా పరిస్థితిని వర్ణిస్తే వెంటనే దాడి చేసిన మిత్రులూ శత్రువులూ కూడా నిర్దిష్ట అధ్యయనం అనే సూత్రాన్ని విస్మరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాలం చెల్లిన మాటలే చెబుతున్నారని ఎగతాళి చేసేవారు వందేళ్ల కిందటి పదాలను, భావాన్ని నేటి సందర్భానికి తగినట్టు అర్థం చేసుకోకుండా అలాగే వాడాలనడం మార్క్స్ శైలికే విరుద్ధం. ఆవిరి యంత్రం నుంచి కృత్రిమ మేధా కాలం వరకూ ఒకే మంత్రం వల్లెవేసే వారు ఈ అంశాన్ని గ్రహించలేరు.

అదే బాటలో...

గత ముప్పయేళ్లలో ప్రతికూల పరిణామాలు ఎవరూ కాదనరు. సోవియట్, తూర్పు యూరప్ దేశాలలో పతనం గాని, దేశంలో బెంగాల్ త్రిపుర వంటి చోట్ల ఓటమి గాని వాస్తవాలే. ఆ ప్రభుత్వాలు వున్నప్పుడు సవాళ్లు లేవని, ఇప్పుడు సర్వం పోయిందని అనుకుంటే అవాస్తవికత అవుతుంది. మార్క్స్ జీవిత కాలంలోనే తొలి కార్మిక వర్గ పాలనా వ్యవస్థగా పారిస్ కమ్యూన్ అవతరించి కూలిపోయింది. అయినా సోవియట్ విప్లవం ఆగలేదు. ఇప్పుడు సోవియట్ లేకున్నా జరిగే పరిణామాలు ఆగడం లేదు. చరిత్ర గమనశీలమైందన్నదే ఆయన ప్రధాన బోధన. వివిధ రూపాల్లో పెట్టుబడిదారీ సంక్షోభాలు కల్లోలాలూ విరుచుకు పడుతూనే వుంటాయని మార్క్స్ ఎప్పుడో చెప్పింది అడుగడుగునా చూస్తున్నాం. ఇప్పుడు కంపు ట్రంపు దుందుడుకు వ్యూహాలను టారిఫ్ యుద్ధాలనూ మతతత్వ మోడీల కార్పొరేట్ లొంగుబాట్లనూ అర్థం చేసుకోగలం. నయా ఫాసిస్టు తరహా శక్తులు ప్రజా వ్యతిరేకులు పంజా విసురుతున్నా ప్రపంచంలో ప్రగతి స్ఫూర్తి గొడ్డుపోలేదు. మార్క్స్ అంటేనే ఒక ఆగని మార్చ్. మేము అమరులను తలుచుకోవడంతో ఆగిపోక వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడం కోసం పోరడతామని ఆయన అస్తమించిన సమయంలో ఆప్తమిత్రుడైన ఎంగెల్సు అన్న మాట ఇప్పటికీ పరమ సత్యమై నడిపిస్తుంది. మార్క్స్ అంటేనే మార్చ్. అహరహం అధ్యయనంతో అవిశ్రాంత కార్యాచరణతో త్యాగ నిరతితో ఆ మహాప్రస్థానం కొనసాగించాల్సి వుంటుంది. ★

అన్నదాన సత్రాలు కూల్చడం ఏ సనాతన ధర్మం?

వ్యాసం



కందారపు మురళి



ఈ కూల్చివేతలను అడ్డుకోవాల్సిన...తనను తాను సనాతనవాదిగా ప్రకటించుకున్న... ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇంతవరకు నోరు మెదపక పోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రికి తెలిసే ఈ కూల్చివేతలు జరిగాయని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానాలు చేశారు. హిందూ ధర్మ రక్షకులమంటూ లక్షల మందితో విజయవాడలో కోట్లాది రూపాయల ఖర్చులతో భారీ సభలు నిర్వహించిన ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, వీటితో అంటకాగుతున్న బిజెపి నోరు తెరవకపోవడం విచిత్రం. తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో తీవ్రంగా స్పందించి దీక్ష చేపట్టిన పవన్ కల్యాణ్ నేరుగా ప్రాతినిధ్యం వహిస్తున్న అటవీ శాఖలో ఈ స్థాయిలో కూల్చివేతలు జరుగుతుంటే మౌనంగా ఎందుకు ఉన్నట్టో అర్థం కాదు.

దాదాపు నలభై అయిదేళ్లుగా కుల, మతాలకు అతీతంగా అందరికీ అన్నం పెడుతున్న ఓ అన్నదాన సత్రాన్ని, ఆశ్రమాన్ని కడప జిల్లాలో కూల్చివేశారు. సనాతన ధర్మాన్ని కాపాడతానని పదే, పదే ప్రకటనలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలోని అటవీ శాఖ అధికారులు కడప జిల్లాలో ఈ ఆశ్రమాన్ని కూల్చివేశారు. 'కాశినాయన జ్యోతి క్షేత్రం'గా ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం నల్లమల అడవిలో ఉంది. కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం, కాశినాయన మండలం పరిధిలో ఈ క్షేత్రం నెలకొల్పబడింది. ఒక మండలమే ఆయన పేరుతో ప్రసిద్ధి చెందిందంటే ఈ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యత ఏమిటో అర్థమవుతుంది.

అవధూత కాశినాయన 1995లో ఇక్కడ సమాధి కావించబడ్డారు. ఆయన హయాంలోనే ఈ ప్రాంతంలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా అన్నదానం చేసేవారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానమే ప్రాశస్త్యమైందని, దీన్ని అందరూ పాటించాలని ఉపదేశాలు ఇచ్చేవారాయన. కాశీ అన్నపూర్ణేశ్వరి ఆలయాన్ని ఈ ప్రాంతంలో నిర్మించి ఆకలితో జీవులు ఉండకూడదన్న సంకల్పంతో కడుపు నిండా అన్నం పెట్టడమే తన లక్ష్యంగా ఈ ఆశ్రమాన్ని నడిపారు. గత 45 ఏళ్లుగా ఈ అన్నదాన సత్రం లక్షల మంది ఆకలిని తీర్చింది. రోజురోజుకు వృద్ధి చెందుతూ అక్కడ భోజనం చేసే అన్నార్తుల సంఖ్య వేల నుంచి లక్షలకు చేరింది. కాశినాయన జ్యోతి క్షేత్రంలో తొమ్మిది ఆలయాలు ఉన్నాయి. కాశీ అన్నపూర్ణా దేవి ఆలయాన్ని కాశినాయన ప్రతిష్ఠ చేయగా అనంతర కాలంలో మిగతా వాటిని భక్తులు నిర్మించారు. కాశినాయనకు గోవులంటే అమితమైన ప్రేమ. ఆయన సంస్మరణార్థం గోవులను సంరక్షించడానికి పెద్ద గోశాలను నడుపుతున్నారు.

కాశినాయన జ్యోతి క్షేత్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమం అన్నదానం. ప్రతిరోజు ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. ఇక్కడి ఆశ్రమ నిర్వాహకులు ఉదయం 3:30 గంటల నుంచి ఈ పనుల్లో తలమునకలై ఉంటారు. ఇక్కడ భోజనం చేయడానికి కుల, మతాలను పట్టించుకోరు. ఏ ప్రాంతం వారన్నది చూడరు. ఎన్ని రోజులు ఉంటారని అడగరు. ఎవరైనా ఎప్పుడైనా రాత్రయినా, పగలైనా ఎప్పుడూ భోజనం అందుబాటులో ఉండేలా ఆశ్రమ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటారు. ఆయన వర్ధంతి రోజున మూడు లక్షల మందికి పైగా ఇక్కడ భోజనాలు చేస్తుంటారు. ఈ క్షేత్రం సేవకు తోడ్పడేందుకు ఆర్యవైశ్యులు ఓ సత్రాన్ని, రెడ్డి సంఘం వారు ఓ సత్రాన్ని, రజకులు, కుమ్మరులు రెండు సత్రాలను నిర్మించారు. రజకులు, కుమ్మరులు నిర్మించుకున్న సత్రాలను అటవీ అధికారులు కూల్చివేశారు. 500 ఆవులున్న గోశాలను ఇక్కడి నుంచి కూటమి ప్రభుత్వం బలవంతంగా తరలించింది. ఇక్కడి శిల్ప సంపద కూడా అద్భుతంగా ఉంటుంది. ప్రజలు తండోప తండాలుగా ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటిన్లలో అందించే భోజనం కంటే 100 రెట్లు ఎక్కువ నాణ్యతతో ఇక్కడ ప్రజలకు ఉచితంగా అందిస్తుంటారు. అలాంటి ఉచిత అన్నదాన సత్రాన్ని, ఆశ్రమాన్ని ఏకపక్షంగా కూటమి ప్రభుత్వం కూల్చివేసింది.

సనాతన ధర్మానికి దన్ను తానేనని అదేపనిగా చెప్పుకునే పవన్ కల్యాణ్ నేతృత్వంలోని అటవీ విభాగం వారు ఈ ఆశ్రమంపై దాడికి పాల్పడి బుల్డోజర్లతో కూల్చివేయడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కాశినాయన క్షేత్రాన్ని ఎంతో పవిత్రంగా భావించి అభివృద్ధి పరచుకున్నామని కూటమి ప్రభుత్వం కూలగొట్టడాన్ని తమ మనోభావాలపై దాడిగా ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. దీంతో అన్ని రాజకీయ పక్షాలు, వివిధ ధార్మిక సంఘాలు ఈ సమస్యపై గళమెత్తాయి. అన్నమాచార్య పీఠాధిపతి విజయ శంకర స్వామి, అచలానంద ఆశ్రమ పెద్దలు ఈ ప్రాంతాన్ని సందర్శించి తమ ఆవేదనను వెల్లడించారు. అన్నదాన సత్రంపై, హిందూ ధార్మిక క్షేత్రంపై జరిగిన దాడికి వ్యతిరేకంగా 17వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వేలాది మందితో నిరసన తెలియజేస్తున్నట్టు విజయ శంకర స్వామి ఓ ప్రకటన చేశారు. ప్రకటన వెలువడిన తరువాత మంత్రి లోకేష్ జరిగిన ఘటనకు క్షమాపణ చెబుతున్నానని, సొంత నిధులతో కూలిన నిర్మాణాలను తిరిగి నిర్మిస్తామని, జరిగిన పొరపాటుకు చింతిస్తున్నామని నష్ట నివారణ ప్రకటన చేశారు. ఇదే అంశంపై దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ కాశినాయన జ్యోతి క్షేత్రం టైగర్ జోన్ పరిధిలో ఉన్న కారణంగా అటవీ శాఖ అధికారులు తమకు తెలియకుండానే కూల్చివేతలకు సిద్ధమయ్యారని, దీనిని నివారించడానికి తమ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని వెల్లడించారు. ఇదే అంశంపై పలువురు ప్రజాప్రతినిధులు శాసనసభలో తమ గళాన్ని వినిపించారు.

ఈ కూల్చివేతలను అడ్డుకోవాల్సిన...తనను తాను సనాతనవాదిగా ప్రకటించుకున్న...ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇంతవరకు నోరు మెదపక పోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రికి తెలిసే ఈ కూల్చివేతలు జరిగాయని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానాలు చేశారు. హిందూ ధర్మ రక్షకులమంటూ లక్షల మందితో విజయవాడలో కోట్లాది రూపాయల ఖర్చులతో భారీ సభలు నిర్వహించిన ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, వీటితో అంటకాగుతున్న బిజెపి నోరు తెరవకపోవడం విచిత్రం. తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో తీవ్రంగా స్పందించి దీక్ష చేపట్టిన పవన్ కల్యాణ్ నేరుగా ప్రాతినిధ్యం వహిస్తున్న అటవీ శాఖలో ఈ స్థాయిలో కూల్చివేతలు జరుగుతుంటే మౌనంగా ఎందుకు ఉన్నట్టో అర్థం కాదు.

పాలకులు అరణ్యాలను అదానీలకు కట్టబెడుతున్న కాలంలో, గిరి పుత్రులను అటవీ ప్రాంతాల నుంచి తరిమివేసి భూగర్భ ఖనిజాలకై తాపత్రయ పడుతున్న నేపథ్యంలో...కాశినాయన క్షేత్రంలో జరుగుతున్న కూల్చివేతల వెనుక టైగర్ జోన్ల సమస్య కంటే కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు జరుగుతున్న కుట్రగా పలువురు భావిస్తున్నారు. హిందుత్వ-కార్పొరేట్ బంధం ఇలాంటి సమయంలో మరింత స్పష్టంగా అవగతమవుతుంది.

(వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సెల్: 9490098840)

అభిప్రాయం



ఆ పిల్లల పోషణ ఎవరిది!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మధ్య ఎక్కువ మంది పిల్లలను కనమని చెప్తున్నారు. ఒకరిద్దరు పిల్లల వల్ల వచ్చే లాభనష్టాలు మనకు తెలుసు. ప్రజలకు ఎక్కువ మందిని కనమని చెప్పటంలో పరమార్థమేమిటో అర్థం కావడంలేదు! అయినా ఒకరు కావాలా ఇద్దరు కావాలా, ఇంకా ఎక్కువమంది కావాలా అనేది నిర్ణయించవలసింది మహిళలు. 1952లో కుటుంబ నియంత్రణ పాటించండి. అనగా ఒకరు లేక ఇద్దరు చాలు అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎక్కువ మందిని కంటే పోషణ కూడా ఒక సమస్య. కనుక, ముఖ్యంగా దక్షిణ భారతంలో కుటుంబ నియంత్రణ బాగా జరిగింది. ఎక్కువ మందిని కని, వారి భారం పైవాడి మీద వెయ్యకుండా మనమే భరించాలి కనుక ఒకరిద్దరితోనే సరిపుచ్చుకుంటున్నారు. అయితే-దేశంలో ముస్లిం జనాభా పెరిగిపోతుంది. వారిని మించి పోవాలంటే హిందువులు కూడా ఎక్కువ మందిని కనండి-అని బిజెపి వారు ప్రచారం చేస్తున్నారు. ఈ మధ్య ఎంపి సీట్ల విషయంలో ఉత్తర భారతం కంటే దక్షిణ భారతంలో జనాభా తక్కువగా ఉన్నందున, ఇక్కడ ఎంపీల సంఖ్య తగ్గుతుంది కనుక మనం కూడా ఎక్కువ మందిని కనాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటిస్తున్నారు. చిన్న సందేహం? చంద్రబాబు పైన పేర్కొన్న రెండిటిలో దేన్ని ఉద్దేశించి అన్నారో చెప్తే బాగుంటుంది. ఎక్కువమందిని కని, వారిని సుఖంగా పోషించే స్థితిలో నేడు సమాజం లేదు. మరి ఎక్కువమందిని ఎందుకు కనాలి? అన్న నందమూరి తారక రామారావు 12 మందిని, గోరా తొమ్మిది మందిని కన్నారు. వారి పిల్లలు బాగా మంచి పొజిషన్‌లో ఉన్నారంటే, అదొక ప్రత్యేక పరిస్థితి. అందరికీ అలాంటి అవకాశాలు రావు కదా! అందరికీ అలాంటి అవకాశాలు కల్పిస్తామంటే మంచిదే. ఈ రోజు ఒకరిద్దరితోనే వారిని మంచి చదువులు చదివించలేక, అమ్మాయికి లక్షలు లక్షలు ఇచ్చి పెళ్ళి చెయ్యలేక, అబ్బాయికి ఉద్యోగం లేక, పెద్దల ఆరోగ్యానికి మందులు లేక నానా ఇబ్బందులు పడుతుంటే ఒకరిద్దరు చాలనాలిగాని, ఎక్కువ మందిని కనమని చెప్పటం ఎమిటి? ఉత్తర భారతంలో కూడా కుటుంబ నియంత్రణ సరిగా అమలు జరిగేటట్లు చూస్తే దేశం బాగుపడుతుంది.

- నార్నె వెంకట సుబ్బయ్య

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

తొక్కిసలాట ఘటనలో ఉన్నతాధికారులకు సమన్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల వైకుంఠ ద్వార దర్శనం కోసం జనవరి ఎనిమిదిన తిరుపతి బైరాగిపట్టెడ, శ్రీనివాసం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై మూడో దశ విచారణను చేపట్టారు. ఇందులో భాగంగా ఉన్నతాధికారులకు గురువారం సమన్లు జారీ చేశారు. ఈ నెల 17న విచారణకు కలెక్టర్ వెంకటేశ్వర్, టిటిడి ఇఒ శ్యామలరావు, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు హాజరు కావాలని పేర్కొన్నారు.

తొక్కిసలాట ఘటనలో ఆరుగురు యాత్రికులు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అప్పట్లోనే న్యాయ విచారణ జరిపిస్తామని సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ మేరకు జస్టిస్ సత్యనారాయణమూర్తిని కమిషన్ ఛైర్మన్‌గా నియమించారు. మొదటి విడత విచారణలో విష్ణునివాసం, బైరాగిపట్టెడ వద్ద విచారణ చేపట్టారు. ఘటనా స్థలి వద్ద ఉన్న బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండో విడతలో కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బాధితులను విచారించారు. ఈ రెండు సందర్భాల్లోనూ ఒక్కసారిగా గేటు తీయడం వల్లనే ఈ తొక్కిసలాట చోటు చేసుకుందని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. మూడో విడత విచారణలో భాగంగా ఉన్నతాధికారులకు సమన్లు జారీ చేశారు.

రాష్ట్ర యూనిట్‌గా ఎస్‌సి వర్గీకరణ

- ఎంఆర్‌పిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఎస్‌సి వర్గీకరణను అమలు చేసి చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జిల్లా యూనిట్‌గా వర్గీకరణ అనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకొని దేశంలో ఆయా రాష్ట్రాల వలే రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని వర్గీకరణ అమలు చేయాలని కోరారు. జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేస్తే మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వర్గీకరణ చేసినా కూడా ఉపయోగం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.

సామాజిక న్యాయం అందించే విధంగా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని వర్గీకరణ చట్టం అమలు చేయుటకు నిర్దిష్ట చర్యలు వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కన్వీనర్ ఏటుకూరు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న వెంకటేశ్వర యూనివర్శిటీ విద్యార్థులు

గౌరవ వేతనం రూ. 25 వేలకు పెంచాలి

శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయ విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

'చదివేది ఐదేళ్లు. మిగిలేది కన్నీళ్లు. గౌరవ వేతనం (స్టైఫండ్) పది వేలు వద్దు. రూ. 25వేలు కావాలి. మా స్టైఫండ్ మా హక్కు.' అనే నినాదాలతో విజయవాడ ధర్నా చౌక్ దద్దరిల్లింది. వెటర్నరీ విద్యార్థులకు గౌరవ వేతనం (స్టైఫండ్) రూ. 25 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయ విద్యార్థులు గురువారం ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎపి వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విక్రాంత్ ధర్మతేజ, సంయుక్త కార్యదర్శి వై.పునీత్ మాట్లాడుతూ ఇతర ఆరోగ్య సంబంధిత విద్యారంగాల్లో ఇంటర్న్‌లు, పిజిలు, పిహెచ్‌డి విద్యార్థులకు రూ.25 వేల నుంచి రూ.65 వేల వరకు స్టైఫండ్ చెల్లిస్తోన్న ప్రభుత్వం పశు వైద్య విద్యార్థుల స్టైఫండ్ పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెటర్నరీ విద్యార్థులకు ఇస్తున్న రూ.7,000 స్టైఫండ్‌ను మరో రూ.3,500 మాత్రమే పెంచి రూ.10, 500 మాత్రమే ఇస్తామనడం సరికాదన్నారు. వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్‌ను రూ.25 వేలకు పెంచే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

విద్యార్థులకు పలువురి సంఘీభావం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బండెల బి. నాసర్జి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కెవివి ప్రసాద్ తదితరులు విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వివేకా పిఎ కేసులో ఫైనల్ ఛార్జిషీట్

2,600 పేజీలతో జమ్మలమడుగు కోర్టుకు నివేదిక

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని వివేకా కూతురు వైఎస్.సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, అప్పటి సిబిఐ విచారణ అధికారి రామ్‌సింగ్‌లు బెదిరించారని వివేకా పిఎ వెంకట కృష్ణారెడ్డి పెట్టిన కేసులో ఫైనల్ ఛార్జిషీట్‌ను పోలీసులు కోర్టుకు నివేదించారు. పులివెందుల మెజిస్ట్రేట్ సెలవులో ఉన్నందున జమ్మలమడుగు కోర్టులో గురువారం ఫైనల్ ఛార్జిషీట్ దాఖలు చేసినట్టు పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ తెలిపారు.

వివేకా కూతురు వైఎస్.సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, అప్పటి సిబిఐ విచారణ అధికారి రామ్‌సింగ్‌లు బెదిరించారని 2023లో వెంకట కృష్ణారెడ్డి కోర్టులో ప్రయివేటు కేసు వేశారు. కేసు నమోదు చేసి పూర్తిస్థాయి విచారణ చేయాలని పులివెందుల పోలీసులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ ముగ్గురిపై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని రామ్‌సింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును కొట్టివేయడం సాధ్యం కాదని హైకోర్టు చెప్పడంతో వారు సుప్రీం కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ కేసును రీవెరిఫికేషన్ చేశారు. పలుమార్లు కృష్ణారెడ్డిని, సాక్షులను పోలీసులు విచారించి వారి నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు.

గత నెల 20న పులివెందుల కోర్టులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. సాంకేతిక కారణాల వల్ల కోర్టు వెనక్కి పంపింది. ప్రస్తుతం జమ్మలమడుగు కోర్టుకు 2600 పేజీల ఫైనల్ ఛార్జిషీట్‌ను పోలీసులు సమర్పించారు. ఛార్జిషీట్‌లో 23 మంది సాక్షులను విచారించి వారు ఇచ్చిన వాంగ్మూలాన్ని రికార్డ్ చేశారు. వైసిపి నాయకుల బెదిరింపులతో సునీతా, రాజశేఖర్‌రెడ్డి, రామ్‌సింగ్‌పై కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారని ఛార్జిషీట్‌లో పొందుపరిచినట్లు తెలుస్తోంది. పోలీసులు వేసిన ఛార్జిషీట్‌ను కోర్టు అంగీకరిస్తుందా? లేదా? అన్న విషయం వేచి చూడాల్సిందే.



నేడు పిఠాపురంలో 'జయకేతనం' సభ

- ఆవిర్భావ సభకు హాజరు కానున్న పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - పిఠాపురం

జనసేన పార్టీ ఆవిర్భావ సభను 'జయకేతనం' పేరుతో కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను ఇప్పటికే నిర్వాహకులు పూర్తి చేశారు. సభ ప్రాంగణం, వేదికను జనసేన జెండాలతో తీర్చిదిద్దారు. ఎండ తీవ్రత దృష్ట్యా మంచినీరు, మజ్జిగ, ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం ఏడు మెడికల్ క్యాంపులు, 14 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. జయకేతనం సభకు పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలతోపాటు రాష్ట్ర నలుమూల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు. 1,600 మంది పోలీసులతో బందోబస్తు చేపడుతున్నారు. 75 సిసి కెమెరాలను, ఎల్‌ఇడి స్క్రీన్స్‌ను ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ సభ జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయ రహదారిపై ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకూ ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

మహిళల రక్షణకు 'ఉమెన్ ప్రొటెక్షన్' సెల్

- వ్యవస్థీకృత నేరంగా డిజిటల్ అరెస్టు, ఆన్‌లైన్ మోసాలు
- 26 జిల్లాల్లో సైబర్ క్రైం పోలీసుస్టేషన్లు, 164 శక్తి టీమ్‌లు
- నేరాల నియంత్రణకు డ్రోన్ ఎన్‌ఫోర్స్‌మెంట్
- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో మహిళా రక్షణ అంశాన్ని కీలకంగా తీసుకున్నామని, 'ఉమెన్ ప్రొటెక్షన్ సెల్'తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 164 శక్తి బృందాలను ఏర్పాటు చేస్తున్నామని డిజిపి హరీష్ కుమార్‌గుప్తా తెలిపారు. డిజిటల్ అరెస్టు, ఆన్‌లైన్ మోసాలను వ్యవస్థీకృత నేరంగా పరిగణించి కేసులు నమోదు చేస్తున్నామని, అవసరమైతే నిందితులపై పిడి యాక్టు కింద కేసు నమోదు చేస్తామని చెప్పారు. గురువారం డిజిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐజి ఆధ్వర్యాన పనిచేసే ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌లో డిఐజి, ఎస్‌పి, ఇతర సిబ్బంది ఉంటారని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లోనూ శక్తి పోలీస్ స్టేషన్లు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రెండు స్టేషన్లు, కమిషనరేట్ పరిధిలో నాలుగు స్టేషన్లు, డిఎస్‌పి పరిధిలో ఒక స్టేషన్ ఉంటుందని వివరించారు. ప్రతి స్టేషన్లోనూ ఎస్‌ఐతో కలిపి ఆరుగురు సభ్యులు ఉంటారని పేర్కొన్నారు. కొత్తగా తీసుకొచ్చే శక్తి యాప్‌లో నేరుగా ఫిర్యాదు చేయొచ్చని, ఫ్యామిలీ కౌన్సిలింగ్, ప్రయాణ సమయంలో ఎక్కడ నుండి ఎక్కడకు వెళుతున్నారనే వివరాలనూ నమోదు చేయడం ద్వారా రక్షణ పొందొచ్చని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలోనూ ఒక సైబర్‌క్రైమ్ పోలీసుస్టేషన్ పెడుతున్నామని చెప్పారు. ఇప్పటి వరకూ సిఐడి ఆధ్వర్యాన పనిచేస్తోందని, ఇక ముందు జిల్లా కేంద్రం నుండి నేరుగా విచారణలు జరుపుతామని పేర్కొన్నారు. దీనికోసం సైబర్ ఇన్వెస్టిగేషన్, సైబర్ స్కిల్, సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ ఫోరెన్సిక్ ట్రైనింగ్, కెపాసిటీ బిల్డింగ్‌పై శిక్షణ ఇస్తామని చెప్పారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు 24/7 హెల్ప్‌లైన్ ఉంటుందని తెలిపారు. డిజిటల్ మోసాలు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే బ్యాంకు లావాదేవీలు నిలిపివేయిస్తామని, దీనిద్వారా డబ్బు పోకుండా ఉంటుందని పేర్కొన్నారు. దీనికోసం ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఏజెన్సీలతోనూ కలిసి పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి 1100 ఎకరాల నుండి 93 ఎకరాలకు తగ్గిపోయిందని పేర్కొన్నారు. ఒరిస్సా నుండి గంజాయి దిగుమతి అవుతోందని, దీని రవాణాపై రోజుకు ఆరు నుంచి ఎనిమిది కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. మొత్తంగా ఏడు జిల్లాల్లో గంజాయిసాగు అవుతుందని పేర్కొన్నారు. డ్రగ్స్ అమ్మేవారి ఆస్తులపై విచారణ చేయడంతోపాటు ఎటాచ్ చేస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వినియోగానికి సంబంధించి జిల్లాల్లో హాట్‌స్పాట్లు గుర్తించామని తెలిపారు. డిజిటల్ అరెస్టు పేరుతోనూ, స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరుతోనూ లింకులు పంపించి వాటి ద్వారా డబ్బు కాజేస్తున్నారని, ఇలాంటి అంశాలపై 331 ఫిర్యాదులు వచ్చాయని, వీటిని వ్యవస్థీకృత నేరాలుగా పరిగణించి ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నామని, నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తామని పేర్కొన్నారు. విజయనగరంలో జిల్లాలో బాలికలపై అకృత్యాలకు పాల్పడిన వ్యక్తులకు శిక్షలు పడ్డాయని అన్నారు. సిసి కెమెరాల పర్యవేక్షణ ద్వారా నేరస్తుల కదలికలను పరిశీలిస్తున్నామని, డ్రోన్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్‌ను అత్యంత అధునాతన పద్ధతుల్లో నియంత్రించొచ్చని వివరించారు. లిక్కర్, పిడిఎస్ బియ్యాలకు సంబంధించిన కేసులపై విచారణ జరుగుతోందని, అప్పుడే వివరాలు వెల్లడించలేమని డిజిపి తెలిపారు. జలంధర్‌లో జరిగిన జాతీయస్థాయి పోలీసుమీట్లో విజయం సాధించిన పోలీసు సిబ్బందిని డిజిపి అభినందించారు. విలేకరుల సమావేశంలో ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విద్యార్థుల మానవహారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద విద్యార్థులు మానవహారం చేపట్టారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ చేయొద్దని, వెటర్నరీ విద్యార్థులకు స్టయిఫండ్ ఇవ్వాలని, పిజి కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేసి యూనివర్సిటీ పరిధిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న విజయవాడలో నిరసన దీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. గతంలో నిర్వహించిన 'చలో విజయవాడ' సందర్భంగా ప్రభుత్వం చర్చలకు పిలిచి నెల రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ స్పందన లేదన్నారు. ఆ సందర్భంగా రూ.5 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తామని, జిఒ నెంబర్ 77 రద్దు చేస్తామని, అనేక హామీలు ఇచ్చి ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయని, అప్పు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే నిరసన దీక్షకు మద్దతుగా నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు.



ఆర్‌టిసి కాంపెక్స్ కూడలిలో మానవహారం చేస్తున్న విద్యార్థులు

ఐదో రోజూ మార్కెట్ల డీలా

- సెన్సెక్స్ 200 పాయింట్ల పతనం
- నేడు హోలీ సెలవు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల అంశాలు కానరావడం లేదు. వరుసగా ఐదో సెషన్‌లోనూ నష్టాలు చవి చూశాయి. అంతర్జాతీయ ప్రతికూల పరిణామాలకు తోడు దేశీయంగా ఆర్థిక వ్యవస్థలో ఎలాంటి మద్దతు కానరాకపోవడంతో గురువారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 201 పాయింట్లు లేదా 0.27 శాతం పతనమై 73,828.91కి పడిపోయింది. ఎన్‌ఎస్ఇ నిఫ్టీ 73 పాయింట్లు లేదా 0.33 శాతం కోల్పోయి 22,397 వద్ద ముగిసింది.

హోలి సందర్భంగా శుక్రవారం స్టాక్ మార్కెట్లకు సెలవు కావడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల ఎప్పుడేం జరుగుతోందోనన్న భయాలు ప్రపంచ మార్కెట్లను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా కొనుగోళ్లకు మదుపర్లు ఆసక్తి చూపడం లేదని బ్రోకర్లు పేర్కొంటున్నారు. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు.. ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి.



బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.77 శాతం, 0.62 శాతం చొప్పున నష్టపోయాయి. ఈ ఒక్క సెషన్‌లోనే మదుపర్లు దాదాపు రూ.2 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బిఎస్‌ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.393 లక్షల కోట్ల నుంచి రూ.391 లక్షల కోట్లకు పడిపోయింది. డాలరుతో రూపాయి మారకం విలువ 22 పైసలు బలపడి 87 వద్ద ముగిసింది. సెన్సెక్స్- 30 సూచీలో జొమాటో, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, ఎన్‌టిపిసి, సన్‌ఫార్మా, టాటా స్టీల్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. దాదాపు 300 స్టాక్స్ 52 వారాల కనిష్ట స్థాయిని తాకాయి.

వివేకా వాచ్‌మెన్ రంగన్న మృతిపై సిట్ విచారణ

- కాల్‌డేటా, అనుమానితులపై నిఘా

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న అనుమానాస్పద మృతిపై ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు ప్రారంభించింది. పోస్టుమార్టం నివేదిక వచ్చేలోగా ఆయన మరణంపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు సిట్ సాంకేతిక పరమైన దర్యాప్తు చేపట్టింది. రంగన్న సెల్‌ఫోన్ కాల్‌డేటా వివరాలతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల నివాసం ఉన్న వారి కాల్ డేటా, రంగన్నకు బందోబస్తుగా ఉన్న పోలీసు సిబ్బంది కాల్ డేటాను సిట్ సేకరించింది. రంగన్న చనిపోవడానికి నెల రోజుల ముందు ఆయన ఎవరితో మాట్లాడారు? ఎక్కడకు వెళ్లారు? అనే దానిపై దర్యాప్తు చేస్తోంది. ఇంటి పరిసరాల్లో సిసి కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న వారి నుంచి రంగన్న కుటుంబ సభ్యులకు ఫోన్‌లు వెళ్లాయా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. వివేకా కేసులో బెయిల్‌పై విడుదలై పులివెందులలో తిరుగుతున్న నిందితుల కదలికల పైన నిఘా పెట్టారు. రంగన్న చనిపోయే రోజు ఆయన భార్య సుశీలమ్మ ఓ హోటల్ నుంచి టిఫెన్ తెచ్చిపెట్టారు. టిఫెన్ తిన్న తర్వాతనే రంగన్న అస్వస్థతకు గురయ్యారు. హోటల్‌కు వెళ్లి వివరాలను సిట్ అధికారులు తెలుసుకున్నట్లు సమాచారం. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా ఈ కేసుపై సిబిఐ అధికారులు కూడా విచారణ చేపట్టినట్టు సమాచారం.

ఎసిబికి శ్రీవారి లడ్డూ నెయ్యి కేసు

ప్రజాశక్తి -తిరుమల



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసును నెల్లూరులోని ఎసిబి ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ సిట్ బృందం పిటిషన్ దాఖలు చేసింది. సిట్ బృందం అభ్యర్థన మేరకు తిరుపతి 2వ ఎడిఎం జడ్జి కోటీశ్వరరావు ఈ కేసును నెల్లూరు ఎసిబి కోర్టుకు బదిలీ చేశారు. టిటిడిలో కొంతమంది అధికారులు ఇందులో భాగస్వామ్యం కావడంతో ఈ కేసును ఎసిబికి బదిలీ చేశారు. అవినీతి అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఇకపై ఈ కేసును నెల్లూరు ఎసిబి అధికారులు విచారించనున్నారు.



డబ్బు కోసమే దోపిడీ..

పరారైన దొంగలు పట్టుబడ్డారు : ఎస్‌పి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు నగరంలో బుధవారం చోటు చేసుకున్న దోపిడీ కేసులో నిందితులు పుష్ప కిడ్స్ షాపింగ్ మాల్ యజమాని చంద్రశేఖర్ ఇంటిలో డబ్బు కోసమే దోపిడీకి పాల్పడారని, ఈ దోపిడీలో డ్రైవర్‌తో కలిపి మొత్తం ఏడుగురు నిందితులు పాల్గొన్నారని చిత్తూరు జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు తెలిపారు. ఘటనా స్థలంలో నలుగురిని అదుపులోకి తీసుకోగా.. మిగిలిన ముగ్గురు నిందితులను గురువారం సాంకేతిక సమాచారంతో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ.. దోపిడీ ఘటనలో ప్రధాన ముద్దాయి సుబ్రహ్మణ్యం పదిహేను సంవత్సరాల క్రితం చిత్తూరు నగరంలోని రెడ్డిగుంట ప్రాంతంలో ఎస్‌ఎల్‌వి ఫర్నీచర్ షాపును నిర్వహించేవాడని, ఆయనపై నంద్యాల, అనంతపురం జిల్లాలో రెండు హత్య కేసులు, నంద్యాలలో ఆరు కేసులు ఉన్నాయని, పది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడని తెలిపారు. చిత్తూరులో ఫర్నీచర్ షాపు పెట్టి అప్పులపాలవ్వడంతో డబ్బు కోసం పుష్ప కిడ్స్ షాపింగ్ మాల్ యజమాని చంద్రశేఖర్‌ను ఎంచుకుని బెదిరించి డబ్బులు తీసుకొనేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు. సుబ్రమణ్యం, చంద్రశేఖర్‌కు మధ్య పరిచయం కూడా ఉందన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఏడుగురిలో సుబ్రహ్మణ్యం తప్పించుకొనే ప్రయత్నంలో తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ఆరుగురు ఇబ్రహిం, నవీన్ కుమార్, రామాజనేయులు, నెట్టి కంఠయ్య, రాజశేఖర్, సంపత్ కుమార్‌లను మీడియా ఎదుట ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దోపిడీ ఘటనలో సుబ్రహ్మణ్యం స్థానికుడు కాగా, మిగిలిన ఆరుగురు కర్నూలు, అనంతపురం, నంద్యాల జిల్లాలకు చెందినవారని తెలిపారు. ఈ దోపిడీకి సూత్రధారి సుబ్రహ్మణ్యంగా గుర్తించారు.

పక్కా ప్రణాళికతోనే...

పక్కా ప్రణాళికతోనే బుధవారం ఉదయం 5.30 గంటకు తమిళనాడు రిజిస్ట్రేషన్ వాహనంలో డ్రైవర్‌తో సహా ఏడుగురు ముసుగులు ధరించి చంద్రశేఖర్ ఇంట్లో రెండో అంతస్తులోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న చంద్రశేఖర్‌ను వెంట తెచ్చుకున్న నకిలీ తుపాకులు, కత్తులను చూపించి డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించారు. ప్రతిఘటించిన చంద్రశేఖర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో చంద్రశేఖర్ ముఖం, చేతికి గాయాలయ్యాయి. పోలీసులు స్థానికుల సాయంతో సుబ్రహ్మణ్యంను, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. తప్పించుకున్న రాజశేఖర్, సంపత్, నెట్టి కంఠయ్యను గురువారం కాణిపాకం వద్ద అదుపులోకి తీసుకున్నారు.

1.75 లక్షల షేర్ల బహుమతి

- ప్రూడెంట్ ప్రమోటర్ సంజయ్ షా నిర్ణయం

అహ్మదాబాద్ : మ్యూచువల్ ఫండ్ ఉత్పత్తులు, బీమా పరిష్కారాలు, స్టాక్ బ్రోకింగ్ సేవలను అందించేబ ప్రూడెంట్ కార్పొరేట్ అడ్వైజరీ సర్వీసెస్ లిమిటెడ్ (ప్రూడెంట్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ షా తన వ్యక్తిగత హోల్డింగ్‌ల నుండి దాదాపు 650 మందికి సుమారు రూ.34 కోట్లు విలువైన 1,75,000 ఈక్విటీ షేర్లను బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించారు. లబ్ధిదారులలో కంపెనీ ఉద్యోగులు, అతని యాజమాన్యంలోని అనుబంధ సంస్థలు, అలాగే ఇంటి పనివారు, డ్రైవర్లు, వ్యక్తిగత సిబ్బంది ఉన్నారు. వ్యాపారంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు కృతజ్ఞతగా తన సహచరులకు ఈ షేర్లను అందిస్తున్నట్లు సంజయ్ షా తెలిపారు. సహచరులుగా తనతో పాటు నిలిచిన వారికి చెప్పే హృదయపూర్వక కృతజ్ఞత అని సంజయ్ షా పేర్కొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ హోలీ ధమాకా ఆఫర్

న్యూఢిల్లీ : ప్రభుత్వ టెలికం కంపెనీ బిఎస్‌ఎన్‌ఎల్ తన వినియోగదారులకు మరో బంఫర్ ఆఫర్‌ను ప్రకటించింది. హోలి ధమాకా ఆఫర్‌లో భాగంగా రూ.2399 ప్రీపెయిడ్ ప్లాన్‌కు 30 రోజుల అదనంగా వ్యాలిడిటీని పెంచింది. గతంలో ఈ ప్లాన్ చెల్లుబాటు 395 రోజులుగా ఉంది. తాజా ఆఫర్‌తో 425 రోజులకు పెరగనుంది. ఈ ప్లాన్‌లో భారత్ అంతటా అపరిమిత కాలింగ్ సౌకర్యం పొందవచ్చని బిఎస్‌ఎన్‌ఎల్ వెల్లడించింది. ఈ ప్లాన్‌లో వినియోగదారులు ప్రతిరోజూ 2జిబి హై స్పీడ్ డేటా, 100 ఉచిత ఎస్‌ఎంఎస్‌లను పొందవచ్చు. మొత్తం ప్లాన్ వ్యవధిలో మొత్తం 850జిబి డేటా అందించనుంది.

ఉచితాలతో నిరుపయోగం

- ఇన్ఫోసిస్ కో ఫౌండర్ నారాయణ మూర్తి

ముంబయి : ఇన్ఫోసిస్ కో ఫౌండర్ ఎన్ఆర్ నారాయణమూర్తి మరోసారి నోరు పారేసుకున్నారు. వారానికి 90 గంటలు పని చేయాలని ఇటీవల వ్యాఖ్యలు చేసి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకొని అబాసు పాలైన ఆయన.. తాజాగా ఉచితాలు నిరుపయోగమని అన్నారు. ముంబయిలో జరిగిన 'టైకాన్ ముంబయి 2025'లో నారాయణ మూర్తి మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సృష్టించే ఉద్యోగాలతో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. కానీ ప్రజలకు పంచే ఉచితాలతో ఉపయోగం ఉండదన్నారు. ఔత్సాహికవేత్తలు మరిన్ని వ్యాపారాల సృష్టిపై దృష్టి సారించాలన్నారు. వినూత్న కంపెనీలు ఏర్పాటు చేస్తే ఏదో ఒక రోజు పేదరికం మాయమవుతుందన్నారు. ఏ దేశమూ పేదలకు ఉచితాలు ఇవ్వడం వల్ల విజయవంతం కాలేదన్నారు. ఉద్యోగాల వల్లే పేదరిక సమస్య పరిష్కారమవుతుందన్నారు.

షావోమి 15 సిరీస్ విడుదల



న్యూఢిల్లీ : షావోమి అధికారికంగా తన షావోమి 15 సిరీస్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇటీవల మొబైల్ వాల్డ్ కాంగ్రెస్‌లో ఆవిష్కరించిన ఈ సిరీస్‌ను తాజాగా ఇక్కడి మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. షావోమి 15, షావోమి 15 అల్ట్రా రెండు వేరియంట్లను స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్‌సెట్, లైకా కెమెరాలు, ఏఐ సామర్థ్యాలు, ప్రీమియం హార్డ్‌వేర్ ఫీచర్లతో అందిస్తున్నట్లు తెలిపింది. షావోమి 15 ధరను రూ.64,999గా, అల్ట్రా ధరను రూ.1,09,999గా నిర్ణయించింది. అల్ట్రా వేరియంట్‌లో 200 ఎంపి లైకా పెరిస్కోప్ లెన్స్ కెమెరా, 50 ఎంపి ప్రధాన కెమెరా, 32 ఎంపి సెల్ఫీ కెమెరాతో తీసుకొచ్చింది.

శంషాబాద్ క్లస్టర్‌లో గిడ్డంగులకు భలే గిరాకీ

- నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్

గడిచిన ఏడాదిలో హైదరాబాద్‌లో గిడ్డంగుల డిమాండ్ 35 లక్షల చదరపు అడుగులుగా నమోదయ్యిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ చేసింది. మొత్తం లావాదేవీల్లో తయారీ రంగం అత్యధికంగా 34 శాతం వాటాను.. రిటైల్ రంగం 33 శాతం వాటాను కలిగి ఉన్నాయి. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి శంషాబాద్ క్లస్టర్‌లో గిడ్డంగులకు ఎక్కువ డిమాండ్ చోటు చేసుకుంది. గతేడాది మొత్తం లావాదేవీల్లో శంషాబాద్ క్లస్టర్ ఏకంగా 47 శాతం వాటాను కలిగి ఉండటం విశేషం. ఈ క్లస్టర్‌లో శంషాబాద్, ఎరోట్రోపోలిస్, శ్రీశైలం హైవేస్, బొంగ్లూరూర్, కొత్తూర్, షాద్‌నగర్ ప్రాంతాలు ఈ క్లస్టర్‌లో వస్తాయి. 2024లో హైదరాబాద్ గిడ్డంగుల మార్కెట్‌లో సగటున చదరపు అడుగుకు రూ.20.7 అద్దె చెల్లింపులు జరిగాయి. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే అద్దెలో 1 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. మెడ్చల్ క్లస్టర్ 46 శాతం, పటాన్‌చెరు క్లస్టర్ 7 శాతం చొప్పున వాటాను కలిగి ఉన్నాయి.



మీకోసం

ఈగలు ఎక్కువగా వస్తున్న ప్రదేశంలో పుదీనా ఆకులను కత్తిరించి పెడితే ఈగల బెడద తగ్గుతుంది.

జీవన సౌరభం

గమ్యం ఎంత దూరంలో ఉన్నప్పటికీ దానిని చేరుకునే మార్గం మాత్రం మొదటి అడుగు నుంచే మొదలవుతుంది.

రంగుల పండుగ

రంగు రంగుల పండుగ హోళి
రంగుల హోళి జీవన కేళి
ప్రాచీనమైన పండుగ హోళి
పాటల పండుగ హోళి
ఆనందాల పండుగ హోళి!


మోదుగు పూలచే రంగులతో ఆటపాట
పిల్లల పాటల హోళి
పొద్దంతా పాటల పండుగ
రంగుల హరివిల్లు హోళి!

తెలంగాణ యాసలో పాటల హోళి
వసంత రుతువు రాకతో వచ్చే పండుగ
పాటలతో మొదలయ్యే పండుగ
పది రోజుల పాటల పండుగ



మగవారు కోలలతో ఆట ఆడే పండుగ
స్త్రీల చప్పట్లతో పాటల పండుగ
ప్రకృతితో ముడిపడిన పండుగ హోళి
పల్లె పల్లె నా పాటల పండుగ!

- దేవులపల్లి రమేశ్,
నంగునూర్, సిద్దిపేట,
99637 01294.




లెక్క తేల్చండి

పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 78

నేను గీసిన బొమ్మ



- బల్ల భార్గవ్,
3వ తరగతి,
పెడన, కృష్ణా జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఊబకాయాన్ని ముందుగానే పసిగట్టండి...



ఊబకాయం.. ప్రపంచాన్ని కుదిపేస్తున్న సమస్యల్లో ఒకటి. దీనిపై ప్రఖ్యాత హెల్త్ మ్యాగజైన్ 'సైన్స్ డైరెక్ట్'లో తాజాగా ఓ పత్రం ప్రచురించారు. దీని ప్రకారం, ఊబకాయం కారణాలు జీవసంబంధమైనవి, సామాజికమైనవి. జెండర్ ఆధారంగా వీటిల్లో గణనీయ మార్పులు ఉండొచ్చు. మహిళల్లో సహజంగా పురుషుల కంటే శరీర కొవ్వు శాతం అధికంగా ఉంటుంది. ఇది పునరుత్పత్తి సామర్థ్యానికి సంబంధించినంత వరకు మేలు చేస్తుంది. అదే బరువు సమస్య వచ్చేసరికి సవాలుగా మారుతోంది.

మహిళల్లో యుక్త వయసు, గర్భం దాల్చడం, మోనోపాజ్ దశల్లో హార్మోన్ల హెచ్చుతగ్గులు విపరీతంగా ఉంటాయి. ఈ కారణంగా పొట్ట, నడుం కిందిభాగాన అధిక కొవ్వు పేరుకుపోతుంది. ఈ అంశాలపై అధ్యయనం చేస్తున్న డాక్టర్ విశాఖ శివదాసాని ఇలా చెబుతున్నారు : 'ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తీసుకోవడంతో బాల్య దశ నుండే హార్మోన్లలో అసమతుల్యత ప్రారంభమౌతోంది. ఈ రోజుల్లో చాలామంది పిల్లలు ఫ్రక్టోజ్‌తో నిండిపోయిన చిప్స్, కూల్‌డ్రింక్స్, క్యాన్డ్ జ్యూస్‌లను ప్రతిరోజూ తీసుకుంటున్నారు. ఇది ఇన్సులిన్ రెసిస్టెన్సీ, ఇతర హార్మోన్ల అసమతుల్యతకి దారితీస్తుంది. దీంతో 11 - 12 ఏళ్ల మధ్యలో యుక్తవయసుకు ముందే పిల్లలకు మొటిమలు, బరువు పెరగడం, బొడ్డు చుట్టూ కొవ్వు చేరడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ లక్షణాలు కనిపించినప్పుడు ఎండోక్రినాలజిస్ట్ లేదా ఫంక్షనల్ మెడిసిన్ స్పెషలిస్ట్‌ని సంప్రదించి మూల కారణాన్ని పరిష్కరించాలి' అని ఆమె నొక్కిచెప్పారు. ఇన్సులిన్ (హార్మోన్) స్థాయిల్లో మార్పులు, థైరాయిడ్ పనిచేయకపోవడం, రాత్రిపూట కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తీసుకోవాలని కోరిక పుట్టడం వంటివి హార్మోన్ల అసమతుల్యతకు సంకేతాలని ఆమె చెప్పారు. 'ఇన్సులిన్ నిరంతరం అనేక జీవచర్యల్లో పాల్గొంటుంది. థైరాయిడ్, కార్టిసాల్ సమస్యలు ఉంటే అవి ఇన్సులిన్‌ని ప్రభావితం చేస్తాయి. అది క్రమేణా హార్మోన్ల అసమతుల్యతకు దారితీస్తుంది.' అని శివదాసాని చెబుతున్నారు.

వయసు సంబంధిత హార్మోన్ల మార్పులు

పోషకాహార నిపుణులు, క్రానిక్ డిజార్డర్స్ స్పెషలిస్ట్ దీప్తా నాగ్‌పాల్ హార్మోన్ల మార్పుల గురించి ఇలా చెబుతున్నారు :

"సాధారణంగా 30 ఏళ్లు దాటిన మహిళల్లో అనేక కీలక జీవక్రియ మార్పులు బరువు పెరగడానికి దోహదం చేస్తాయి. ఈ వయసు మహిళల్లో కండర ద్రవ్యరాశి క్షీణించడం ప్రాథమిక అంశం. ఇది సహజంగానే జీవక్రియని నెమ్మదింపజేస్తుంది. ఈస్ట్రోజెన్ సాధారణంగా కొవ్వును సమానంగా పంపిణీ చేయడంలో సహాయపడుతుంది. దాని స్థాయి పడిపోతున్నప్పుడు పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది."

"రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి పాంక్రియాస్ ఎక్కువ ఇన్సులిన్‌ని ఉత్పత్తి చేస్తుంది. క్రమేణా ఇన్సులిన్ రెసిస్టెన్సీ మరింత దిగజారితే, అది రక్తంలో అధిక చక్కెర స్థాయిలకు దారితీస్తుంది. ఫలితంగా టైప్ 2 మధుమేహం, ఊబకాయం, జీవక్రియ రుగ్మత ప్రమాదాన్ని పెంచుతుంది.



ఇన్సులిన్ రెసిస్టెన్సీ సంభవించినప్పుడు ఇన్సులిన్‌ని ఉపయోగించగల శరీర సామర్థ్యం తగ్గిపోతుంది. సాధారణంగా శక్తి కోసం చక్కెరను గ్రహించడంలో సహాయపడే ఇన్సులిన్, తక్కువ ప్రభావవంతంగా ఉండిపోతుంది. క్రమంగా ఇది కొవ్వు క్షీణతకి బదులుగా నిల్వకి ప్రోత్సహిస్తుంది. కాబట్టి 35 సంవత్సరాలు దాటిన మహిళలు ప్రతి సంవత్సరం హార్మోన్ స్థాయిలు తనిఖీ చేసుకోవాలి."

గట్ పనితీరు ముఖ్యం


'నోటి నుండి పెద్ద ప్రేగు వరకు జీర్ణక్రియని కలిగివున్న గట్ సరిగ్గా పనిచేయకపోతే లెప్టిన్, గ్రెలిన్ వంటి ఆకలిని నియంత్రించే హార్మోన్లు దెబ్బతింటాయి. ఫలితంగా ఆకలి పెరగడం, ఎంత తిన్నా వెలితిగా అనిపించడం జరుగుతుంది. ఈ పరిస్థితి ఇన్సులిన్ రెసిస్టెన్సీకి దారితీస్తుంది. గట్ ఆరోగ్యం దెబ్బతినడం, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల పేగు పొర దెబ్బతిని హానికర పదార్థాలు రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తాయి. హైపోథైరాయిడిజం వంటి ఆటో ఇమ్యూన్ పరిస్థితులు ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ పరిస్థితి బరువు పెరగడానికి ముడిపడి ఉంటుంద'ని శివదాసాని చెబుతున్నారు.

ఉపవాసం మంచిదా?

'30 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న మహిళలు అడపాదడపా ఉపవాసాలు చేయడం మంచిదే. అయితే వారి ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసుకుని ఉపవాసం ఉండాలి. పునరుత్పత్తి వయసులోని మహిళలు ఎక్కువగా ఉపవాసాలు చేస్తే అది సంతానోత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపొచ్చు. థైరాయిడ్ ఉన్న వ్యక్తులు ఉపవాసం చేయకపోవడమే మంచిద'ని శివదాసాని అంటున్నారు.

బరువు నియంత్రణ ఎలా?

- బరువు నియంత్రణ సాధించాలంటే మంచి జీవనశైలిని పాటించాలి. ఉదయం పూట ఆహారంలో గింజలు, గుడ్లు, చికెన్, పెరుగు, పెసర మొలకలు వంటి ప్రోటీన్ చేర్చాలి. ఇవి ఇన్సులిన్ ఉత్పత్తిని సక్రమంగా ఉంచి, జీవక్రియను పెంచుతాయి.
- ఒమేగా-3 ఉండే మంచి కొవ్వు ఆహారాలు తీసుకోవాలి. కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే బిస్కెట్లు, ప్యాక్‌చేసిన ఆహారాల్లో ఉండే కొవ్వు మంచి కంటే చెడు ఎక్కువ చేస్తుంది.
- ఉదయం పూట కాఫీ, చాక్లెట్లు తీసుకుంటే అందులో ఉండే కెఫిన్ వల్ల కార్టిసాల్ స్థాయిలు పెరిగి ఇన్సులిన్ నిరోధకతకి దారితీస్తుంది. ఫలితంగా జీవక్రియ దెబ్బతినొచ్చు. కూల్‌డ్రింక్స్, తియ్యని ఇతర ద్రవాలను దూరం పెట్టాలి. సహజ చక్కెర అని తేనె, మాపుల్ సిరప్ వంటివి తీసుకోవడం కూడా అంత మంచిది కాదు.
- విపరీత వ్యాయామం చేయకూడదు. పరిమితికి మించి నడక, మెట్లు ఎక్కడం వంటివి కండరాల శక్తిని తగ్గిస్తాయి.
- నిద్రపోవడంలో ఎప్పుడూ రాజీపడొద్దు. తగినంత విశ్రాంతి లేకపోతే హార్మోన్ల పనితీరు దెబ్బతింటుంది.
- ఒత్తిడిని అధిగమించడం అన్నింటిలోకెల్లా ముఖ్యం. హార్మోన్ల అసమతుల్యత లేదా ఇన్సులిన్ రెసిస్టెన్సీ ఉందో లేదో తెలుసుకోవడానికి సాధారణ రక్త పరీక్ష సహాయపడుతుంది.



అఖిల్ 'లెనిన్' షూటింగ్ అప్‌డేట్



అఖిల్ అక్కినేని కొత్త ప్రాజెక్టు 'లెనిన్' మార్చి 14 నుంచి అంటే ఈ రోజు నుండి సెట్స్‌పైకి వెళ్లనుంది. తొలి షెడ్యూల్‌ను ఏకధాటిగా 20 రోజుల పాటు చిత్రీకరించనున్నారు. మొదటి షెడ్యూల్ లోనే చాలా వరకు షూటింగ్ పూర్తవుతుందని వార్తలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్‌లోనే 50 శాతం షూటింగ్ పూర్తి చేస్తారని తెలుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని ఫారిన్ లొకేషన్లకు ప్రాధాన్యత లేకుండా లోకల్‌లోనే రూపొందించనున్నారు. రాయల సీమ బ్యాక్‌డ్రాప్‌తో నందు దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కు తోంది. శ్రీలీల హీరోయిన్‌గా కనిపించనున్నారని తెలుస్తోంది.

చందూతో రామ్




చందూ మొండేటి, రామ్ కలిసి ఓ సినిమా చేయబోతున్నారని తెలుస్తోంది. ఈ సినిమాని గీతా ఆర్ట్స్ నిర్మించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం రామ్ 'ఆంధ్రా కింగ్ తాలుకా' (వర్కింగ్ టైటిల్) అనే సినిమాలో నటిస్తున్నారు. ఇది పూర్తయ్యాక చందూతో సినిమా పట్టాలెక్కించే ఛాన్స్ వుంది. త్వరలో పూర్తి వివరాలు బయటకు రానున్నాయి.

సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్నా : జాన్ అబ్రహం


'ఈ రోజుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పెద్ద సమస్యల్లో గుర్తింపు ఒకటి. తెలియని వ్యక్తుల నుంచి గుర్తింపు కోరుకుంటున్నారు. అది చాలా భయంకరంగా మారింది. రోజూ మనం ఏమి చేసినా వాటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. దాని ఆధారంగా ఎదుటివారు మన గురించి ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నారు. నా దృష్టిలో అది అంత అవసరమైన విషయం కాదు. ఏది ముఖ్యమో, ఏది కాదో..అందరూ అర్థం చేసుకోవాలి. సినీ పరిశ్రమలోని వారికి కూడా ఇదే వర్తిస్తుంది. నేను ఎన్నో సంవత్సరాలుగా ఇలానే ఉంటున్నాను. సోషల్‌మీడియాలో ఎక్కువగా యాక్టివ్‌గా ఉండటం లేదు' అని బాలీవుడ్ కథానాయకుడు జాన్ అబ్రహం అన్నారు. ఆయన నటించిన చిత్రం 'ది డిప్లమాట్' శుక్రవారం విడుదల కానుంది.

భద్రకాళి టీజర్ విడుదల



తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోని నటిస్తున్న కొత్త సినిమాకు తెలుగులో 'భద్రకాళి' అని టైటిల్ పెట్టారు. ఈ సినిమా టీజర్‌ను మేకర్లు విడుదల చేశారు. ఆయన నటిస్తున్న 25వ సినిమా ఇది. అరువి, వాళ్ లాంటి వైవిధ్యమైన సినిమాలు తీసిన అరుణ్‌ప్రభు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. టీజర్‌లో కథని పెద్దగా బయట పెట్టలేదు. కానీ విజువల్స్‌ను చూస్తుంటే మాత్రం ఆసక్తికరంగా ఉన్నాయి. రాజకీయ నేపథ్యంలో రూ.197 కోట్ల స్కామ్ చుట్టూ తిరిగేలా కథలా అన్పించింది. విజయ్ ఆంటోని వివిధ గెటప్‌లలో కనిపించారు. వేసవి కానుకగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.

రోషన్ 'ఛాంపియన్' టీజర్ విడుదల



శ్రీకాంత్ వారసుడిగా 'పెళ్లి సందడి' మూవీతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోషన్ ఈ ఏడాది రెండు సినిమాలతో రాబోతున్నాడు. వాటిలో మొదటిది 'ఛాంపియన్'. ప్రముఖ నిర్మాణ సంస్థ స్వప్న సినిమా బ్యానర్‌పై ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. స్పోర్ట్స్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ మూవీలో రోషన్ ఫుట్ బాల్ ప్లేయర్‌గా కనిపించబోతున్నాడు. గురువారం రోషన్ బర్త్ డే సందర్భంగా చిత్రబృందం టీజర్ విడుదల చేసింది. ఈ మూవీకి మిక్కీ జె మేయర్ సంగీతం సమకూర్చారు. టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. క్యాస్టింగ్ తదితర వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నాయి. ఈ సినిమాను 2023లోనే ప్రకటించారు. కానీ అనివార్య కారణాల వల్ల సకాలంలో పూర్తి కాలేదు.



'1000 వాలా' అలరిస్తుంది : అమిత్

'నేను నటించిన '1000 వాలా' సినిమా అన్ని తరగతుల ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ సినిమాలో అన్ని క్లాస్, మాస్ ఎలిమెంట్లు ఉన్నాయి. సగటు ప్రేక్షకుడి ఆలోచనలను అంచనా వేసి ఈ సినిమాను దర్శకుడు షేక్ అఫ్జల్ ఎంతో శ్రమకోర్చి చాలా బాగా తెరకెక్కించారు. హీరో కావాలనే నా కల ఈ సినిమాతో నెరవేరింది. దీనికోసం ఎన్నో కష్టాలు పడ్డాను. ఇబ్బందులను ఎదుర్కొన్నాను. తిండి తినకుండా ప్రయత్నాలు చేసిన రోజులు కూడా ఉన్నాయి. ఎలాంటి సపోర్ట్ లేకుండా సినిమా పరిశ్రమలోకి వచ్చాను. అఫ్జల్, నిర్మాత షారుఖ్ వల్ల ఈ సినిమా తీశాం. చాలా బాగా వచ్చింది. శుక్రవారంనాడు ఈ సినిమా విడుదల కానుంది. అన్ని తరగతుల ప్రేక్షకులు థియేటర్లలో మా సినిమా చూసి ఆనందించాలని కోరుతున్నా' అని కథానాయకుడు అమిత్ అన్నారు. సూపర్‌హిట్ మూవీ మేకర్స్ పతాకంపై షారుఖ్ నిర్మాణంలో అమిత్ కథానాయకుడిగా '1000 వాలా' సినిమా తెరకెక్కింది. షారుఖ్, నవిత, కీర్తి, సుమన్, పిల్లా ప్రసాద్, ముఖ్తార్‌ఖాన్ ప్రధాన పాత్రల్లో నటించారు. శుక్రవారం ఈ సినిమా విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమంలో పాల్గొంది.

ఫైనల్‌కు ముంబయి

- ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై 47 పరుగుల తేడాతో గెలుపు
- మాథ్యూస్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- స్కీవర్ బ్రంట్ అర్ధసెంచరీ

ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) కీలక పోరులో ముంబయి ఇండియన్స్ మహిళలు సత్తా చాటారు. ఫైనల్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ముంబయి జట్టు 47 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్‌ను చిత్తుచేసింది. గురువారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 213పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. అనంతరం గుజరాత్ జెయింట్‌ను 19.2 ఓవర్లలో 166పరుగులకే ఆలౌట్ చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ బ్యాటర్లలో గిబ్సన్(34), లిచ్‌ఫీల్డ్(31), ఫుల్మాలీ(30) మాత్రమే రాణించారు. ముంబయి బౌలర్లు మాథ్యూస్(3/31), అమేలియా కెర్(2/28), ఇస్మాయిల్, స్కీవర్ బ్రంట్ ఒక్కో వికెట్‌తో సత్తా చాటారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మాథ్యూస్‌కు దక్కింది. దీంతో హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబయి ఇండియన్స్ మరోసారి టైటిల్ సమరానికి సిద్ధమైంది.

అంతకుముందు ముంబయి బ్యాటర్లు హీలీ మాథ్యూస్, స్కీవర్ బ్రంట్ అర్ధసెంచరీలతో మెరిసారు. మరోవైపు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కూడా ధనా ధన్ ఇన్నింగ్స్‌తో రాణించింది. దీంతో టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 213పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. తొలుత ముంబయి ధాటిగానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఓపెనర్ యాస్టికా భాటియా



అర్ధసెంచరీలతో రాణించిన స్కీవర్-మాథ్యూస్

15పరుగులకే ఔటైనా.. ఆ తర్వాత మాథ్యూస్(77; 50బంతుల్లో 10ఫోర్లు, 2సిక్సర్లు), స్కీవర్ బ్రంట్(77; 41బంతుల్లో 10ఫోర్లు, 2సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వీరిద్దరూ 2 వికెట్‌కు ఏకంగా 133పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

చివర్లో హర్మన్(36; 12బంతుల్లో 2ఫోర్లు, 4సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. దీంతో ముంబయి ఇండియన్స్ నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 213పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో గిబ్సన్‌కు రెండు, కశ్వీ గౌతమ్‌కు ఒక వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ముంబయి ఇండియన్స్ మహిళల ఇన్నింగ్స్: యాస్టికా భాటియా (సి)భార్తి ఫుల్మాలీ (బి)గిబ్సన్ 15, మాథ్యూస్ (సి)బెత్ మూనీ (బి)కశ్వీ గౌతమ్ 77, హర్మన్‌ప్రీత్ కౌర్ (రనౌట్)భార్తి ఫుల్మాలీ (బి)మేఘ్నా సింగ్ 36, సజీవన్ సజన (నాటౌట్) 1, అదనం 7, (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 213పరుగులు. **బౌలింగ్:** కశ్వీ 4-0-30-1, గార్డినర్ 2-0-15-0, తనూజ 4-0-49-0, గిబ్సన్ 4-0-40-2, ప్రియా మిశ్రా 3-0-30-0, మేఘ్నా సింగ్ 3-0-35-0.

గుజరాత్ జెయింట్స్ మహిళల ఇన్నింగ్స్: బెత్ మూనీ (సి)మాథ్యూస్ (బి)ఇస్మాయిల్ 6, గిబ్సన్ (రనౌట్)అమన్‌జ్యోత్ కౌర్/యాస్టికా భాటియా 34, హర్లీన్ డియోల్ (రనౌట్)సంస్కృతి గుప్తా/యాస్టికా భాటియా 8, గార్డినర్ (బి)మాథ్యూస్ 8, లిచ్‌ఫీల్డ్ (స్టంప్)యాస్టికా భాటియా (బి)అమేలియా కెర్ 31, భార్తి ఫుల్మాలీ (బి)మాథ్యూస్ 30, కశ్వీ గౌతమ్ (రనౌట్) హర్మన్‌ప్రీత్/యాస్టికా భాటియా 4, సిమ్రన్ షేక్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)అమేలియా కెర్ 17, తనూజ కన్వార్ (సి)అమన్‌జ్యోత్ కౌర్ (బి)స్కీవర్ బ్రంట్ 16, మేఘ్నా సింగ్ (సి)స్కీవర్ బ్రంట్ (బి)మాథ్యూస్ 5, ప్రియా మిశ్రా 0, అదనం 7. (19.2ఓవర్లలో ఆలౌట్) 166పరుగులు. **బౌలింగ్:** ఇస్మాయిల్ 4-0-35-1, స్కీవర్ బ్రంట్ 4-0-31-1, శిఖా 1-0-8-0, మాథ్యూస్ 3.2-0-31-3, అమన్‌జ్యోత్ 3-0-32-0, కెర్ 4-0-28-2.

ఛాంపియన్స్ ట్రోఫీ వీక్షణలో నయా రికార్డు

11 వేల కోట్ల నిమిషాలుగా నమోదు

దుబాయ్: ఇటీవల ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీ వ్యూయర్‌షిప్‌నకు సంబంధించిన వివరాలు ఐసిసి విడుదల చేసింది. ఈ టోర్నమెంట్‌కు 540.3 కోట్లకు పైగా వ్యూస్ వచ్చినట్లు... వాచ్ టైమ్ ఏకంగా 11వేల కోట్ల నిమిషాలకు పైగా నమోదయినట్లు వెల్లడించింది. అంతేకాదు.. ఓవరాల్‌గా 6.2 కోట్ల మంది వ్యూయర్స్ ఈ మెగా ఈవెంట్‌ను వీక్షించినట్లు బ్రాడ్‌కాస్టర్ వెల్లడించింది. కాగా పాకిస్తాన్‌లో 1996 తర్వాత ఓ ఐసిసి టోర్నీ జరగడం ఇదే తొలిసారి. ఇక ఫిబ్రవరి 19న పాకిస్తాన్‌లో మొదలైన ఈ వన్డే ఈవెంట్ మార్చి 9న భారత్-న్యూజిలాండ్ మధ్య దుబాయ్ వేదికగా ఫైనల్‌తో ముగిసింది. 2025 చాంపియన్స్ ట్రోఫీని కోట్లాది మంది వీక్షించడంలో ఆశ్చర్యమేమీ లేకపోయినా.. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 540 కోట్లకు పైగా వ్యూస్ రావడం ఇదే తొలిసారి. స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్' 18 నెట్‌వర్క్‌లో టీవీలో ప్రసారాలు జరుగగా.. జియో హాట్‌స్టార్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం చేశారు.

ఫైనల్‌కు అత్యధిక వ్యూస్...

కాగా మిగతా మ్యాచ్‌లతో పోలిస్తే టీమిండియా-న్యూజిలాండ్ మధ్య ఫైనల్‌కు అత్యధిక వ్యూస్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ టైటిల్ పోరుకు ఏకంగా 124.2 కోట్ల వీక్షణలు వచ్చాయి. కాగా మొత్తంగా చాంపియన్స్ ట్రోఫీకి వచ్చిన వ్యూయర్‌షిప్‌లో ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, గోవా, పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి 38 శాతం మేర వ్యూస్ వచ్చినట్లు సమాచారం. ఇక వైఫై సాయంతో మ్యాచ్ వీక్షించిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర ముందు ఉంది. కాగా 16 మాధ్యమాల్లో చాంపియన్స్ ట్రోఫీని ప్రసారం చేశారు. తొమ్మిది భాషల్లో కామెంట్రీ ఇచ్చారు.

టీమిండియా గెలిచిన ఐసిసి టైటిళ్లు...

1983 : వన్డే వరల్డ్‌కప్
2002 : భారత్-శ్రీలంక చాంపియన్స్ ట్రోఫీ
2007 : టి20 ప్రపంచకప్
2011 : వన్డే వరల్డ్‌కప్
2013 : చాంపియన్స్ ట్రోఫీ
2024 : టి20 ప్రపంచకప్
2025 : చాంపియన్స్ ట్రోఫీ

క్వార్టర్స్‌కు లక్ష్యసేన్

అల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ



లండన్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి లక్ష్యసేన్ దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 21-13, 21-10తో వరుససెట్లలో జొనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా)ను చిత్తుచేశాడు. ఇక మహిళల సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ప్రి క్వార్టర్స్‌కు చేరిన మాల్వికటాప్‌సీడ్, జపాన్‌కు చెందిన యమగుచి చేతిలో వరుససెట్లలో ఓటమిపాలైంది. యమగుచి 21-16, 21-13తో మల్వికను చిత్తుచేసి క్వార్టర్స్‌కు చేరింది. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట ప్రి క్వార్టర్స్‌కు చేరింది. ప్రి క్వార్టర్స్‌లో ఈ జోడీ గాయపడి టోర్నీనుంచి వైదొలిగింది.

ఎనిమిది జట్లతో పిసిఎల్ ?

లాహోర్: 2025 పాకిస్తాన్ సూపర్ లీగ్‌ను ఎనిమిది జట్ల నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటివరకు ఆరుజట్ల మధ్య జరిగిన ఈ లీగ్ మరింత ప్రజాదరణ పొందేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. పిఎస్‌ఎల్ సిఇవో సాల్మన్ నసీజర్ గురువారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. 2016లో యుఎఇ వేదికగా పిఎస్‌ఎల్ తొలి సీజన్ ఆరంభమైందని, ఆ తర్వాత పాకిస్తాన్ వేదికగా లీగ్ జరుగుతున్నట్లు వాణిజ్యం, మీడియా, స్పాన్సర్‌షిప్ హక్కులు అమ్మకానికి ఉన్నాయని ఆయన ఆ ప్రకటనలో వెల్లడించారు.

అంగన్‌వాడీ పిల్లల్లో కుంగుబాటు

- 17.1 శాతం మందికి వయసుకు తగిన బరువు లేదు
- కేంద్ర ప్రభుత్వ పోషణ్ ట్రాకర్ ప్రకారం నివేదిక

న్యూఢిల్లీ : దేశంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న చిన్నారుల్లో 37.7 శాతం మంది కుంగుబాటుకు గురవుతున్నారు. 17.1 శాతం మందికి వయసుకు తగిన బరువు లేదు. కేంద్ర ప్రభుత్వ 'పోషణ్ ట్రాకర్' ప్రకారం ఫిబ్రవరి నాటికి అంగన్‌వాడీల్లో 8.8 కోట్ల మంది పిల్లలు (0-6 సంవత్సరాల మధ్య వయస్కులు) ఉన్నారు. వీరిలో 8.5 కోట్ల మంది బరువు, ఎత్తును పరీక్షించి వారిలో ఎదుగుదల ఎలా ఉన్నదో పరిశీలించారు. బాలబాలికల్లో పోషకాహార లోపాన్ని ఎలా నివారిస్తారంటూ రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖితపూర్వక సమాధానమిస్తూ ఈ సమాచారాన్ని అందించారు. దేశవ్యాప్తంగా పిల్లల్లో పోషకలోపాల సూచికలు మెరుగుపడుతున్నాయని ఆమె తెలిపారు. 2021 నాటికి దేశంలో ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలు 13.7 కోట్లు ఉన్నారని, 0-6 సంవత్సరాల గ్రూపులో 16.1 కోట్ల మంది ఉన్నారని వివరించారు.

రోబోలతో తవ్వకాలు

- ఎస్ఎల్‌బిసి టన్నెల్లో కొనసాగుతున్న సహాయక చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి సొరంగంలో రోబోలతో తవ్వకాలు చేపట్టారు. పైకప్పు పడిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పనులను చేపడుతున్నారు. గంటకు ఐదు క్యూబిక్ మీటర్ల మట్టిని బయటకు పంపుతున్నప్పటికీ అంతకుమించి మట్టి వచ్చి చేరుతుంది. అటానమస్ హైడ్రాలిక్ పవర్ రోబోలు, కేరళ నుంచి వచ్చిన కడావర్ డాగ్స్ సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. డి-1, డి-2, డి -3 ప్రదేశాలలో తవ్వకాలకు ఉబికి వస్తున్న నీరు ఆటంకంగా మారింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండుసార్లు రోబోలను సొరంగంలోకి పంపారు. మనుషులు వెళ్లలేని ప్రదేశాల్లో రోబోలు మట్టిని తవ్వి బెల్ట్‌పైకి వేస్తుండటంతో మరో రెండ్రోజుల్లో కార్మికుల ఆచూకీ తెలిసే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కట్టర్స్, థర్మల్ కట్టర్స్ బృందాలు టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫామ్‌ను కత్తిరించే పనిలో నిమగ్నమయ్యాయి. డి-1, డి-2 ప్రదేశాలకు మరోసారి కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్‌లను పంపారు. సహాయక చర్యల్లో ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, ర్యాట్ మైనర్స్, కడావర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్ బృందాలు పాల్గొంటున్నాయి.

దౌత్య పరిష్కారం అవసరం !

- ఇరాన్ అణు కార్యక్రమంపై బీజింగ్‌లో నేడు త్రైపాక్షిక చర్చలు

బీజింగ్ : ఇరాన్ అణు సమస్యకు దౌత్య పరిష్కారం అవసరమని చైనా పేర్కొంది. ఇరాన్ అణు కార్యక్రమంపై బీజింగ్‌లో శుక్రవారం జరగనున్న త్రైపాక్షిక చర్చలకు చైనా ఆతిథ్యమిస్తోంది. ఈ సమావేశంలో ఇరాన్, రష్యా దౌత్యవేత్తలు పాల్గొననున్నారు. ఇరాన్ అణు సమస్యను మరింత పెచ్చరిల్లకుండా నివారించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో, అన్ని పక్షాలు ప్రశాంతతను, సంయమనాన్ని పాటించాలి. లేదా మరింత ఘర్షణల దిశగా జారిపోతామని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ పత్రికా సమావేశంలో వ్యాఖ్యానించారు. అణు అంశానికి సంబంధించి తలెత్తిన పరిణామాలపై సమావేశం దృష్టి సారిస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. చర్చలు సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడానికి గానూ సమాచార మార్పిడిని, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ చర్చలు ఉద్దేశించబడ్డాయని చైనా పేర్కొంది. పరస్పర విశ్వాసాన్ని పెంచుకుంటూ, అపోహలను తోసిపుచ్చుతూ అన్ని పక్షాలు కలిసికట్టుగా, నిజాయితీగా కృషి చేయగలవని చైనా ఆశిస్తోందని మావో చెప్పారు. జనవరిలో ట్రంప్ అధికారం చేపట్టిన నాటి నుండి ఇరాన్‌తో కొత్త అణు ఒప్పందానికి కుదుర్చుకోవాలని భావిస్తున్నారు. లేదా ఆంక్షలను మళ్ళీ విధిస్తామని గరిష్టంగా ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. కాగా ఆంక్షలు అమల్లో వున్నంత వరకు ప్రత్యక్ష చర్చలకు తావే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. తమ దేశం ఎవరికీ తలవంచదని అధ్యక్షుడు మసూద్ పెజెషికాన్ స్పష్టం చేశారు.

సంతకాలు పెట్టాం... వెనక్కి తీసుకోం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఫ్యూయల్ ఛార్జీల పేరుతో రూ.5,886 కోట్లు, టారిఫ్ పేరుతో రూ.3,977 కోట్లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో రూ.5,604 కోట్లు భారం వేశారని తెలిపారు. 2019-24 మధ్య రూ.32,166 కోట్ల భారం మోపడంతోపాటు రూ.2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.6,073 కోట్లు, రూ.2023-24లో రూ.6,544 కోట్లు ఎఫ్‌పిపిఎస్ఎ ఛార్జీల వసూలుకు ఎపిఇఆర్‌సిలో పిటీషన్ వేశారని అన్నారు. గత ప్రభుత్వం పెంచిన భారమే గతేడాది అక్టోబర్, నవంబరు నెలల్లో ప్రజలపై పడిందని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేస్తామన్నారు.

దేవనాగరి రూపాయి గుర్తుకు బదులుగా తమిళ అక్షరం

- బడ్జెట్ లోగోను మార్చిన తమిళనాడు
- 'ఎల్లోర్‌కుమ్ ఎల్లమ్' పేరుతో కొత్త ముద్ర ఆవిష్కరించిన స్టాలిన్



దేవనాగిరి లిపిలో ఉన్న రూపాయి ముద్ర స్థానంలో తీసుకొచ్చిన తమిళ 'రు' అక్షరం. ఇన్‌సెట్‌లో ఎకనామిక్ సర్వే ఆవిష్కరిస్తున్న స్టాలిన్ తదితరులు

చెన్నై : తమపై బలవంతంగా హిందీని రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తమిళనాడు ప్రభుత్వం తాజాగా బడ్జెట్ లోగోను కూడా మార్చేసింది. ఆ లోగోలో దేవనాగరి లిపిలో ఉండే రూపాయి చిహ్నం స్థానంలో తమిళ రూపాయి అక్షరాన్ని ఉంచింది. 'ఎల్లోర్‌కుమ్ ఎల్లమ్' (అందరి కోసం అన్నీ) అని రాసి ఉన్న లోగోను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కార్యాలయం గురువారం మధ్యాహ్నం విడుదల చేసింది. గత సంవత్సరం లోగోలో రూపాయి చిహ్నం దేవనాగరి లిపిలోనే ఉంది. 'ఈ సంవత్సరం దేవనాగరి లిపి కంటే తమిళానికే మేము ప్రాధాన్యత ఇచ్చాం' అని సిఎంఒ పేర్కొంది. కాగా ఈ ఏడాది తమిళానికి ప్రాధాన్యత ఇవ్వాలని అనుకుంటున్నామని డిఎంకె ప్రతినిధి సవరణన్ అన్నాదురై చెప్పారు.

త్రిభాషా సూత్రంపై కేంద్రం, తమిళనాడు ప్రభుత్వాల మధ్య వివాదం తీవ్రమవుతున్న తరుణంలో డిఎంకె ప్రభుత్వం ఈ చర్య తీసుకోవడం గమనార్హం. ద్విభాషా సూత్రాన్ని (తమిళం, ఆంగ్లం) అనుసరిస్తున్న తమిళనాడు త్రిభాషా సూత్రాన్ని గట్టిగా వ్యతిరేకిస్తోంది. అంతేకాక త్రిభాషా విధానాన్ని సూచిస్తున్న జాతీయ విద్యా విధానాన్ని కూడా నిరసిస్తోంది. తమిళనాడు బడ్జెట్‌ను శుక్రవారం రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టబోతున్నారు. ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు నేతృత్వంలోని బడ్జెట్ కమిటీ లోగో మార్పుపై నిర్ణయం తీసుకున్నదని సంబంధిత అధికారులు తెలిపారు. 'మా భాషను, మా నాగరికతను పార్లమెంటులో కూడా అపహాస్యం చేస్తుంటే మేము దానిని రక్షించుకోవద్దా?' అని డిఎంకె నేత ఒకరు ప్రశ్నించారు. కాగా లోగోను మార్చాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి స్టాలిన్ ఆమోదముద్ర వేశారు. తమిళనాడు ప్రభుత్వం మార్చిన రూపాయి చిహ్నానికి డిఎంకె ఎమ్మెల్యే కుమారుడు రూపకల్పన చేశారు. ఆయన ప్రస్తుతం ఐఐటి గౌహతి డిజైన్ విభాగానికి అధిపతిగా కొనసాగుతున్నారు.



సిపిఎం మహాసభకు వెల్లువెత్తుతున్న ప్రజా మద్దతు

చెన్నై : తమిళనాడులోని మధురైలో జరగనున్న సిపిఎం అఖిల భారత మహాసభకు ప్రజా మద్దతు వెల్లువెత్తుతోంది. ఈరోడ్‌తో సహా అన్ని జిల్లాల్లోనూ సిపిఎం బృందాలు ఇంటింటికి తిరిగి మహాసభ ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. అలాగే విరాళాలు సేకరిస్తున్నాయి. ఇప్పటి వరకూ దాదాపు 40 వేలకు పైగా నివాసాలను ఈ బృందాలు సందర్శించాయి. మహాసభ విజయవంతానికి తమ వంతుగా ప్రజలు ఇచ్చిన విరాళాలు రూ.27 లక్షలకు చేరాయి. ఇది సేకరించాలనుకున్న లక్ష్యం రూ.13 లక్షల కంటే రెండింతలు కావడం విశేషం. పర్వత ప్రాంతాల్లో ఉండే ఆదివాసీలు సైతం మహాసభ విజయవంతానికి విరాళాలు అందజేసి జేజేలు పలికారు. కార్పొరేట్ కంపెనీలు, బడా పెట్టుబడిదారుల నుంచి విరాళాలను స్వీకరించకుండా శ్రమజీవులు అందించే చిరు విరాళాలతోనే సిపిఎం తన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

బీహార్ ఎన్నికల కోసం సీతమ్మ జపం

- ఆలయ పునరుద్ధరణ పేరిట బిజెపి మతతత్వ అజెండా


పాట్నా : బీహార్‌లో ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ బిజెపి అప్పుడే మత రాజకీయాలకు తెర లేపుతోంది. హిందూ ఓట్లను తనకు అనుకూలంగా సంఘటితం చేసేందుకు సీతాదేవి ఆలయ పునరుద్ధరణ నినాదాన్ని అందుకుంది. మిథిల ప్రాంతంలోని సీతామర్హిలో ఈ ఆలయం ఉంది. దీనిని పునరుద్ధరించి, పూర్వ వైభవం తీసుకురావడం ద్వారా దానిని ఎన్నికల అంశంగా మార్చేయాలని కమలదళం ప్రయత్నిస్తోంది. గత ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ సీతాదేవి ఆలయ ంపై మాట్లాడుతూ.. 'మేము ఇప్పటికే అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించాము. ఇప్పుడు బీహార్‌లో అతి గొప్ప సీతామాత దేవాలయాన్ని నిర్మించడానికి సమయం ఆసన్నమైంది. సీతామాత తన జీవితంలో ఏ విలువలకు కట్టుబడి ఉన్నదో ఆ సందేశాన్ని ఈ ఆలయం సమాజానికి అందిస్తుంది. బీహార్‌లో జానకీ మాత ఆలయాన్ని నిర్మించి తీరతాం. అంటూ తమతో చేతులు కలపాల్సిందిగా మిథిల ప్రజలకు పిలుపునిచ్చారు. శాసనసభ ఎన్నికలకు ముందు బీహార్‌లో మకాం వేసి ఆలయ నిర్మాణాన్ని చేపడతాం' అని ఆయన అన్నారు. అమిత్ వ్యాఖ్యలపై ప్రధాన ప్రతిపక్షమైన ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ నిప్పులు చెరిగారు. శిబిరాలు నిర్వహించడానికి ఇక్కడ అమిత్‌కు చోటే లేదని చెప్పారు. సీతాదేవి ఆలయ పునరుద్ధరణ ద్వారా బిజెపి రాజకీయ లబ్ది పొందకుండా చూడాలని ఆర్‌జెడి పట్టుదలగా ఉంది. సీతాదేవి పేరు చెప్పి ఓట్లు దండుకుందామంటే బీహార్‌లో కుదరని పని అని ఆర్‌జెడి ప్రతినిధి సారికా పాశ్వాన్ తెలిపారు.

ట్రంప్ దయ పొందేందుకే స్టార్‌లింక్‌తో భాగస్వామ్యం : జైరాం రమేష్

న్యూఢిల్లీ : ఎయిర్‌టెల్, జియో రెండూ స్టార్‌లింక్‌తో భాగస్వామ్యాన్ని ప్రకటించాయని, దీంతో దేశంలోకి స్టార్‌లింక్ సులభంగా ప్రవేశిస్తుందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. స్టార్‌లింక్ యజమాని ఎలమన్ మస్క్ ద్వారా ట్రంప్ దయ పొందేందుకు ప్రధాని మోడీ స్వయంగా ఈ భాగస్వామ్యాలను ఏర్పాటు చేశారనేది స్పష్టంగా తెలుస్తుందని విమర్శించారు. కానీ చాలా ప్రశ్నలకు ప్రధాని మోడీ సమాధానమివ్వాల్సి వుందని స్పష్టంచేశారు. ఈ ఒప్పందంతో జాతీయ భద్రత పరిస్థితి ఏమిటని ప్రధానిని ప్రశ్నించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో కనెక్టివిటీని స్టార్ లింక్ లేదా భారతీయ భాగస్వామ్యులైన ఎయిర్‌టెల్, జియో సంస్థలు నియంత్రిస్తాయా ? ఇతర ఉపగ్రహ ఆధారిత కనెక్టివిటీ ప్రొవైడర్లు భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతిస్తారా అయితే ఏ నిబంధనలపై అనే దానిపై ఆందోళన లేవనెత్తారు. స్టార్‌లింక్ ప్రవేశంతో భారతదేశంలో టెస్లా తయారీ ప్రణాళికలకు మధ్య ఏదైనా సంబంధం ఉందా? అని ప్రధాని మోడీని నిలదీశారు.

రష్యాకు ఒనగూడేది ఏముంది!

- ఉక్రెయిన్ కాల్పుల విరమణ ప్రతిపాదనపై క్రెమ్లిన్ స్పందన
- ప్రతిపాదనపై ఇంకా కసరత్తు అవసరమని వ్యాఖ్య



కీవ్ : ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ ప్రతిపాదన వల్ల రష్యాకు ఒనగూడేదేమీ వుండదని, దానిపై తిరిగి కసరత్తు చేయాల్సిన అవసరం వుందని పుతిన్ సన్నిహిత సహాయకుడు యుష్‌కొవ్ వ్యాఖ్యానించారు. రష్యా స్వప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రతిపాదనను తిరిగి రూపొందించాల్సి వుందని అన్నారు. ఈ ప్రతిపాదన పత్రం చూస్తుంటే చాలా హడావిడిగా రూపొందించినట్లు కనిపిస్తోందని అన్నారు. తమ వైఖరేమిటో కూడా తెలుసుకుని దాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించాల్సిన అవసరం వుందన్నారు. ఈ ప్రతిపాదనలో కేవలం ఉక్రెయిన్ వైఖరి మాత్రమే తెలుస్తోందన్నారు. 30 రోజుల పాటు తాత్కాలికంగా కాల్పులను విరమిస్తాం, బాగుంది, దానివల్ల మాకేమిటి లాభం? ఏమీ లేదు. ఉక్రెయిన్లు మళ్లీ సత్తా సమకూర్చుకోవడానికి కొంత సమయమిచ్చినట్లే అవుతుంది. వారు బలం చేకూర్చుకుని మళ్ళీ దాడులు మొదలెడతారని యుష్‌కొవ్ రష్యన్ మీడియాతో వ్యాఖ్యానించారు. అమెరికా అధికారులు కాల్పుల విరమణ ప్రతిపాదనలను రష్యాకు అందచేయనున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. దీర్ఘకాల శాంతికి ఈ ప్రతిపాదన అనువుగా లేదన్నారు. అమెరికా-ఉక్రెయిన్ హడావిడిగా చేసిన ఈ చర్యల వల్ల దీర్ఘకాలిక పరిష్కారం లభించదని ఆయన స్పష్టం చేశారు.

ఈ ప్రతిపాదనకు రష్యా నుండి అర్థవంతమైన స్పందన రాలేదంటే ఉక్రెయిన్‌లో వారు సుదీర్ఘ పోరు కొనసాగించాలని కోరుకుంటున్నారని స్పష్టమైందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు.

రైలు హైజాకర్లను మట్టుబెట్టిన పాక్ ఆర్మీ

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ రైలు హైజాక్ ఘటనలో తమ ఆపరేషన్ ముగిసిందని సైన్యం ప్రకటించింది. ఈ సంఘటనలో 300 మందికి పైగా ప్రయాణికులను కమాండోలు కాపాడారని తెలిపింది. ఆత్మాహుతి బాంబర్లతో సహా మొత్తంగా 33 మంది సాయుధ హైజాకర్లను సైనిక బలగాలు హతమార్చాయని ఆర్మీ తెలిపింది. కాగా ఈ ఆపరేషన్‌లో తీవ్రవాదులు 21మంది పౌరులను, నలుగురు సైనికులను చంపేశారు. దీన్నుండి బతికి బయటపడిన వారిని, సైనిక ఆపరేషన్ విజయవంతంగా ముగించిన కమాండోలను పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గురువారం కలుసుకుని వారితో మాట్లాడారు. పాకిస్తాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి షఫ్‌ఖత్ అలీ ఖాన్ విలేకర్లతో మాట్లాడుతూ ఈ దాడి వెనుక ఆఫ్ఘనిస్తాన్‌లో కుట్ర జరిగినట్లు ఆరోపించారు. ఇందుకు కారకులైన వారిని పట్టుకోవడంలో పాక్ ప్రభుతానికి సహకరించాలని ఆయన ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వాన్ని కోరారు. కాగా కాబూల్‌లో ఆఫ్ఘన్ హెూం శాఖ ప్రతినిధి మాట్లాడుతూ, పాక్ చేసిన ఆరోపణలను ఖండించారు. అమాయకులైన ప్రజలు ఈ ఘటనలో మరణించడం పట్ల విచారం వ్యక్తం చేశారు.

పేలవంగా నీటి వనరుల ప్రాజెక్టుల నిధుల వినియోగం

- ఎత్తిచూపిన జల వనరుల స్థాయీ సంఘం

న్యూఢిల్లీ : నీటి వనరుల ప్రాజెక్టులకు, గ్రామీణాభివృద్ధికి, గంగా జలాల పారిశుధ్యానికి కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోయారని పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. 2024-25 సంవత్సరానికి సవరించిన కేటాయింపులు రూ.21,640.88 కోట్లు కాగా అందులో గతేడాది డిసెంబరు చివరి నాటికి దాదాపు 58శాతం మేరా నిధులే వినియోగించారని, ఇంకా మెరుగైన రీతిలో ఖర్చు పెట్టాల్సిందని వ్యాఖ్యానించింది. ఈ ప్రాజెక్టు పనుల అమలు యంత్రాంగాన్ని, పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం వుందని కమిటీ జలశక్తి మంత్రిత్వ శాఖకు సూచించింది. ఈ మేరకు కమిటీ తన నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. కేటాయించిన నిధుల్లో దాదాపు 40శాతం నిధులు అలాగే మిగిలిపోయాయని జల వనరులపై స్థాయీ సంఘం పేర్కొంది. నిధుల పంపిణీ, ప్రాజెక్టు అమల్లో జాప్యాలే ఇందుకు కారణమని పేర్కొంది. సాధారణంగా వర్షాకాలం తర్వాత వ్యయం అనూహ్యంగా పెరుగుతుందని, తక్కువ ఖర్చు పెట్టడానికి ఇదికూడా కారణమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 3వేల కోట్ల రూపాయిల మేరకు ప్రతిపాదనలు పరిశీలన నిమిత్తం పెండింగ్‌లో వున్నాయని కమిటీకి హామీ ఇచ్చింది. జల్ శక్తి మంత్రిత్వ శాఖ పరిధిలో కీలకమైన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో గణనీయమైన పెరుగుదల వుందని నివేదిక పేర్కొంది. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుతో సహా కొన్ని ప్రాజెక్టలకు కేటాయింపులు పెరగగా, నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పి)కు ఏకంగా 98 శాతం కేటాయింపులుతగ్గాయని పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు 2025-26 సంవత్సరానికి రూ.5,936 కోట్లు కేటాయింపులు అందాయి. గతేడాది ఈ మొత్తం రూ.5,512.50కోట్లుగా వున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ చట్టం, 2024 కింద పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. దీన్ని 2026 మార్చినాటికి పూర్తిచేయాలని భావిస్తున్నారు.

కాంటూరుతో సంబంధం లేకుండా ఒకే దశలో పరిహారం

(మొదటి పేజీ తురువాయి)

అంతకు రెట్టింపు వరద ముంపు ప్రభావం గ్రామాల్లో ఉంటోందని తెలిపారు. నిర్వాసితుల తరపున సిపిఎం పోరాటం ప్రారంభించాక మరో 30 గ్రామాలను 41.15 కాంటూరు జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం ప్రకటన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2022 గోదావరి వరద ముంపును ప్రామాణికంగా తీసుకొని పోలవరం ముంపు గ్రామాల జాబితాను తయారు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన జీవన ప్రమాణాలకు అనుగుణంగా నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాల్సి ఉండగా... పది సంవత్సరాల క్రితం ప్రకటించిన పరిహారాన్నే నేటికీ ఇస్తున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన వ్యయాన్ని మాత్రం ఎప్పటికప్పుడు పెంచుకుంటూ కాంట్రాక్టర్లకు ఎటువంటి నష్టమూ కలగకుండా చూసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్లకు పెంచినప్పుడు నిర్వాసితులకు నష్ట పరిహారాన్ని ఎందుకు పెంచరని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం కోసమే ప్రభుత్వం పని చేస్తుందా ? అని ప్రశ్నించారు. అనంతరం కూనవరంలోని గిన్నెల బజార్‌లో పర్యటించారు. పోలవరం వల్ల ప్రతి ఏడాదీ ముంపు బారిన పడి నరక యాతన పడుతున్నామని అక్కడి ప్రజలు ఆవేదన వెలిబుచ్చారు. 2022 గోదావరి వరదల్లో సర్వం కోల్పోయామని తెలిపారు. ఇటీవల తమ గ్రామంలో ఇళ్ల సర్వే చేపట్టి అంచనా వేసి రూ.7.50 లక్షలు వస్తాయని చెప్పారని, కానీ రూ.13 లక్షలు వచ్చినా ఇప్పుడు ఇల్లు కట్టలేమని ఓ మహిళ తన బాధను చెప్పుకొచ్చారు. చింతూరు మండలంలో శ్రీనివాసరావు పర్యటించినప్పుడు ముకునూరు గ్రామస్తులు తమ సమస్యలను విన్నవించారు. గత వరదల్లో గ్రామం మొత్తం ముంపునకు గురైందని, పడవలు కూడా నడిచాయని, అయినప్పటికీ కొన్ని ఇళ్లనే ముంపు జాబితాలో చేర్చారని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఊరంతా మునిగిపోతున్నా గ్రామంలో 121 గృహాలు ముంపులో ఉన్నట్లు జాబితాలో ప్రకటించి, 49 గృహాలను ముంపులో లేనట్లుగా అధికారులు చూపడం దారుణమన్నారు. నిర్వాసిత గ్రామాల్లో జరిగిన ప్రజా చైతన్యయాత్రల్లో పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, పల్లపు వెంకట్, సున్నం రాజులు పాల్గొన్నారు.

బాధితులను ముంచి ప్రాజెక్టు కడతామంటే ఊరుకోం

కూనవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ ఎర్రజెండా పోరాడుతుందని స్పష్టం చేశారు. బాధితులను గోదావరిలో ముంచి పోలవరం ప్రాజెక్టు కడతామంటే సిపిఎం చూస్తూ ఊరుకోదన్నారు. పరిహారం, పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మూడు రెట్లు మొత్తం ఇవ్వాల్సి ఉందన్నారు. మునక మండలాలలో మూడు వేల మందిని జాబితా నుంచి తొలగించారని తెలిపారు. తాజాగా సర్వే జరిపి ప్రతి నిర్వాసితునికీ పెరిగిన ధరలకు అనుగుణంగా పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిర్వాసితుల పక్షాన పోరాటాన్ని తీవ్రతరం చేయనున్నామని హెచ్చరించారు. ముంపు మండలాల ప్రజలు మరో ఉధృత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



క్యూబా ప్రజల జీవితాలను పరిశీలించండి

- పాత్రికేయ బృందంతో ఆ దేశ రాయబారి

న్యూఢిల్లీ : క్యూబా ప్రజల జీవితాలను పరిశీలించి, వారికి సంఘీభావం తెలపాలని భారతదేశంలోని ఆ దేశ రాయబారి జువాన్ కార్లోస్ తనను కలిసిన పాత్రికేయ బృందాన్ని కోరారు. క్యూబన్ ప్రెస్ డే సందర్భంగా ఆ దేశానికి చెందిన యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆఫ్ క్యూబా (యుపిఇసి) 'పాట్రియా ఇంటర్నేషనల్ కొలోక్యూమ్' పేరిట అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తోంది. ఈ నెల 17వ తేది నుండి 19 వ తేది వరకు హవానాలో జరిగే ఈ సదస్సులో పాల్గొనడానికి వెడుతున్న భారతీయ పాత్రికేయ బృందం న్యూఢిల్లీలో గురువారం జువాన్ కార్లోస్ ని మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ భేటీలో పలు అంతర్జాతీయ అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ఆంక్షల కారణంగా క్యూబన్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను, వాటిని అధిగమించి సాగుతున్న ప్రజా ప్రస్థానాన్ని వివరించారు. ఆ ప్రజల జీవితాలను పరిశీలించి, సంఘీభావం తెలపాలని పాత్రికేయ బృందాన్ని కోరారు. ఈ బృందంలో ఆర్ అరుణ్‌కుమార్ (సిపిఎం అంతర్జాతీయ విభాగం), బి. తులసీదాస్ (ఎడిటర్, ప్రజాశక్తి), ఎం.కన్నన్ (తిక్కధీర్, డిజిటల్ ఎడిటర్), కె. శ్రీనివాసరెడ్డి (ప్రెస్ అకడామీ ఛైర్మన్- తెలంగాణ), బాలచంద్ర కాంగో(న్యూఎజ్), రామకృష్ణ పాండ (సిపిఐ) ఉన్నారు.

ఆర్‌టిఐ చట్టాన్ని నీరుగార్చొద్దు

- కేంద్రాన్ని కోరిన మాజీ ప్రభుత్వోద్యోగులు

న్యూఢిల్లీ : సమాచార హక్కు చట్టానికి ప్రతిపాదించిన సవరణలను ఉపసంహరించుకోవాలని మాజీ ప్రభుత్వోద్యోగులు, దౌత్యవేత్తలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2023వ సంవత్సరపు డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టంలోని సెక్షన్ 44 (3) ద్వారా సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 8(1)(జె)ని సవరించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రభుత్వోద్యోగుల వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడాన్ని ఇది అనుమతించదు. దీనిపై తమ వ్యతిరేకత వ్యక్తం చేస్తూ మాజీ ప్రభుత్వోద్యోగులు, దౌత్యవేత్తలు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖలు రాశారు. ఈ సవరణ సమాచార హక్కు చట్టం చేతులు కట్టేస్తుందని వారు అందులో ఆందోళన వ్యక్తం చేశారు. అసలు 'వ్యక్తిగత సమాచారం' అంటే ఏమిటో అందులో నిర్వచించలేదని తెలియజేశారు. సమాచార హక్కు చట్టం ఏ పారదర్శకత, జవాబుదారీతనం కోసం రూపొందించబడిందో వాటికి ప్రతిపాదిత మార్పులు తూట్లు పొడుస్తున్నాయని విమర్శకులు ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) ద్వారా సమాచార హక్కు చట్టం రూపుదిద్దుకున్నదని, అది భావ ప్రకటనా స్వేచ్ఛకు గ్యారంటీ ఇస్తోందని వారు తెలిపారు.

పేపర్ లీకేజీలతో పద్మవ్యూహంలో విద్యార్థులు

- కాంగ్రెస్ నేత రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ : దేశంలో పరీక్షా పత్రాల లీకేజీలు పెరుగుతుండడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది వ్యవస్థ వైఫల్యమేనని, లక్షలాది మంది విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిపోయిందని ఆయన విమర్శించారు. దీనిపై 'ఐక్య రాజకీయ స్పందన' అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తాజాగా ఆరు రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పేపర్ లీకేజీల ఉదంతాలను ఆయన గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రస్తావించారు. 'ఆరు రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం ప్రమాదంలో పడింది. పేపర్ లీకేజీలు మన యువతకు ప్రమాదకరమైన పద్మవ్యూహాలుగా మారాయి' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

పేపర్ లీకేజీలను రాహుల్ మహాభారత యుద్ధంలోని పద్మవ్యూహంతో పోల్చారు. నాటి పద్మవ్యూహంలో అభిమన్యుడు ఎలా చిక్కుకుపోయాడో నేటి పేపర్ లీకేజీల పద్మవ్యూహంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చిక్కుకొని విలవిలలాడుతున్నారని రాహుల్ తెలిపారు. ఇలాంటి లీకేజీలు విద్యార్థుల కఠోర శ్రమకు అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. కష్టపడే విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పేపర్ లీకేజీలు అనిశ్చితిలోకి, ఒత్తిడిలోకి నెడతాయని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం లభించకుండా అడ్డుకుంటాయని రాహుల్ తెలిపారు.

బీమా రంగంలోకి పతంజలి

- రామ్‌దేవ్ బాబా వ్యాపార సామ్రాజ్యం విస్తరణ

న్యూఢిల్లీ : ప్రముఖ కార్పొరేట్, యోగా గురు రామ్‌దేవ్ బాబా తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించారు. తాజాగా మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో పతంజలి అయుర్వేద్ మెజారిటీ వాటాను కొనుగోలు చేసింది. దీంతో ఆ సంస్థలో పతంజలి ప్రధాన ప్రమోటర్‌గా మారనుంది. మాగ్మాలో తమ వాటాను విక్రయించే ప్రధాన విక్రేతల్లో సెనోటి ప్రాపర్టీస్, సెలికా డెవలపర్స్, జాగ్వార్ అడ్వైజరీ సర్వీసెస్, కేకి మిస్త్రీ, అతుల్ డిపి ఫ్యామిలీ ట్రస్ట్, షాహి స్టెర్లింగ్ ఎక్స్‌పోర్ట్స్ వంటి కంపెనీలున్నాయి. 'మాగ్మా'లో అదార్ పూనావాలాకు చెందిన సెనోటి ప్రాపర్టీస్ ఏకంగా 74.5 శాతం వాటాను కలిగి ఉంది. అది ఇప్పుడు పతంజలి గ్రూపునకు బదిలీ కానుంది. అయితే ఎంత మొత్తానికి కొనుగోలు ఒప్పందం జరిగిందనే విషయాన్ని ఆయా సంస్థలు వెల్లడించకపోవడం గమనార్హం. నూతన యాజమాన్యం పతంజలి ఆయుర్వేద్, డిఎస్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ బీమా కంపెనీ మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నానని అదార్ పూనవల్లా పేర్కొన్నారు. తమ సంస్థలో 18 వేల మంది ఏజెంట్లు, 2,000 కార్పొరేట్లు, ఫైనాన్షియల్ రంగంలో 80 సంస్థలతో కార్యకలాపాలను కలిగి ఉందన్నారు. గడిచిన ఐదేళ్లలో సగటున 26 శాతం వృద్ధిని సాధించామన్నారు.

హయగ్రీవ భూములపై యథాతథస్థితి కొనసాగించండి : హైకోర్టు

ప్రజాశక్తి - అమరావతి

విశాఖలోని హయగ్రీవ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే విషయంలో యథాతథస్థితిని కొనసాగించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. భూమి సేల్ డీడ్ రద్దు చేసే అధికారం కలెక్టర్లుకు లేదని వ్యాఖ్యానించింది. అందుకే స్టేటస్‌కో ఆర్డర్ జారీ చేస్తున్నట్లు జస్టిస్ టి.చంద్ర ధనశేఖర్ గురువారం మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చట్ట ప్రకారమే ప్రభుత్వం వ్యవహరించిందని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ తెలిపారు. భూకేటాయింపులను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అధికారులు ఇప్పటికే భూమిని స్వాధీనం చేసుకున్నారని, సమగ్ర వివరాలతో కౌంటర్ వేసేందుకు గడువు ఇవ్వాలని కోరారు. డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు పిటిషనర్‌కు నోటీసులు ఇచ్చాకే భూముల స్వాధీనం జరిగిందన్నారు. వృద్ధాశ్రమం, అనాథాశ్రమం నిర్మిస్తామని ప్రభుత్వం వద్ద నుంచి రాయితీపై హయగ్రీవ సంస్థ భూమి తీసుకుందన్నారు.

'ఉపాధి' వేతనాలు పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపింది. గ్రామీణాభివృద్ధి శాఖ అందించిన సమాచారం ప్రకారం ఫిబ్రవరి 15వ తేదీ నాటికి వేతనాల చెల్లింపు, సామగ్రి కొనుగోలు కింద కేంద్రం తన వంతు వాటాగా రూ.23,446.27 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఇది 27.26 శాతం. 'కేటాయించిన నిధుల్లో నాలుగో వంతు మొత్తాన్ని గత సంవత్సరపు బకాయిల చెల్లింపులకే ఉపయోగిస్తున్నారు. అంటే ప్రస్తుత సంవత్సరపు వాస్తవ బడ్జెట్‌ను రూ.62,553.73 కోట్లకు కుదించారు. దీనివల్ల పథకం లక్ష్యాలు నెరవేరే పరిస్థితి లేదు. కాబట్టి కేంద్రం తన వంతు వాటా మొత్తాన్ని సకాలంలో విడుదల చేయాల్సిన అవసరం ఉంది. చెల్లింపుల్లో జాప్యం జరగకుండా రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవాలి' అని కమిటీ సూచించింది.

ఇతర అంశాలపై...

పథకం అమలులో అవకతవకలు జరుగుతున్నాయన్న కారణంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2021 నుండి పశ్చిమ బెంగాల్‌కు నిధుల విడుదలను నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను అందజేయాలని కేంద్రానికి కమిటీ సూచించింది. ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని తప్పనిసరి చేయవద్దని కూడా కమిటీ సిఫార్సు చేసింది. ఆధార్ వివరాలు, జాబ్‌కార్డు రికార్డుల్లో తేడాలు ఉన్నాయన్న సాకుతో కార్మికులను తొలగిస్తున్నారని తెలిపింది. దీనివల్ల అసలైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతోందని చెప్పింది. కమిటీ తన నివేదికలో పని దినాల పెంపునూ ప్రస్తావించింది.

విద్యుత్ ఉత్పత్తిలో సుస్థిర ప్రగతి

ఎన్‌టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీర్చడమే కాకుండా అనేక సందర్భాల్లో దేశంలోని కర్నాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల ఎనర్జీ అవసరాలను తీర్చడంలోనూ ఎన్‌టిపిసి (సింహాద్రి) కీలకపాత్ర పోషిస్తూ సుస్థిర ప్రగతి దిశగా ముందుకెళ్లిందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ వెల్లడించారు. గురువారం ఉదయం విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ స్టేషన్ ఎన్‌టిపిసి సముద్రం నుంచి నీటిని తీసుకుని బొగ్గును మండించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడలో సంస్థ అత్యుత్తమ ఉత్పత్తి సామర్థ్యంతో రోజుకు 2 వేల మెగావాట్లను తయారు చేస్తోందన్నారు. ఎన్‌టిపిసి ప్లాంట్‌కు బొగ్గుగాథాతం, ఏలేరు కాలువనే ప్రధాన నీటి వనరు అని చెప్పారు. ఏపికి 36 శాతం, తెలంగాణకు 38.5 శాతం విద్యుత్‌ను ఆయా రాష్ట్రాల అవసరాలకు అందిస్తున్నామన్నారు. వంద శాతం యాష్‌ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. ప్రాచ్య దేశాలకు పైప్‌లైన్ ద్వారా ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. త్వరలో పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను ప్రారంభించబోతున్నామన్నారు. 1200 ఎకరాలు దీనికోసం అవసరం అవుతుందని కేంద్రానికి డిపిఆర్ ప్రతిపాదనలు పంపినట్లు సమీర్ శర్మ తెలిపారు. న్యూక్లియర్ ప్లాంట్ అగ్రిమెంట్‌పై కేంద్ర ప్రభుత్వంతో ఇంకా చర్చలు జరపాల్సి ఉందన్నారు. ఎన్‌టిపిసికి బొగ్గు అవసరాలన్నీ దేశంలో బిగ్ షేర్ అవుతాయని ... అనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ బయట నుంచి బొగ్గును దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఎన్‌టిపిసికి లేదని, అంతర్జాతీయంగానే దేశీయంగా బొగ్గు సరిపడా ఉందని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1150 మెగా యూనిట్ల కరెంట్ ఉత్పత్తి చేశామని, సోలార్ జనరేషన్ 37 మెగా యూనిట్లు చేశామని తెలిపారు.

యాక్సిస్ పవర్‌పై 26న ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యాక్సిస్ ప్రైవేట్ కంపెనీతో డిస్కమ్‌లు చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పిపిఎ)పై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపిఇఆర్‌సి) ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనుంది. ఈ నెల 26న ఉదయం 11 గంటలకు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహిస్తున్నట్లు కమిషన్ కార్యదర్శి కృష్ణ గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీలోపు అభ్యంతరాలు తెలపవచ్చని తెలిపారు.

పోర్టు నిర్వాసితులకు ప్లాట్ల కేటాయింపు

ప్రజాశక్తి - నౌపడ (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసిత గ్రామస్తులకు ప్రభుత్వం ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టింది. టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి ఆధ్వర్యాన నౌపడలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో విష్ణుచక్రం గ్రామ పెద్దలు, నిర్వాసితుల సమక్షంలో లాటరీ తీసి వారి ప్లాట్ల నంబరు ప్రకారం స్థలాన్ని ప్రకటించారు. నౌపడలో నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో బిసి, ఎస్‌సి క్లస్టర్ వారీగా 28 క్లస్టర్లుగా ప్లాట్లను డిజైన్ చేశారు. అందులోని ఒక క్లస్టర్‌లో లాటరీ పద్ధతిలో 80 మంది నిర్వాసితులకు ప్లాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎటువంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా ప్లాట్లను కేటాయించామన్నారు. ఆరు నెల్లలో ప్రస్తుత నివాసం ఉంటున్న గ్రామాన్ని ఖాళీ చేసి కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని నిర్వాసితులను కోరారు. ప్రభుత్వం నిర్వాసితులకు కొరుకున్నట్లుగానే నౌపడలో రూ.35 కోట్లతో 55 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం చేపడుతుందని చెప్పారు. ఇందులో భాగంగా సిసి రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీలు, ఇంటింటికీ తాగునీటి కనెక్షన్లు, ఆటస్థలం, పాఠశాలలు, ఆలయాలతో పాటు గ్రామానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మొదటి విడతలో 80 మంది ఎంపిక

మూలపేట నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రంలో మొత్తం 598 మంది నిర్వాసిత కుటుంబాలకు పిడిఎఫ్‌లుగా గుర్తించారు. వీరి కోసం నౌపడ నిర్వాసిత కాలనీ నిర్మించి బిసి, ఎస్‌సి వారీగా 28 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. తొలి విడతలో భాగంగా విష్ణుచక్రం గ్రామంలోని 80 మంది నిర్వాసితులకు ప్లాట్లను పంపిణీ చేశారు. లాటరీ ద్వారా ఎంపికైన నంబర్ల ప్రకారం త్వరలోనే వీరికి ఇవి సెంట్లు చొప్పున స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నారు. పత్రాలు అందుకున్న వారు నెల్లలోగా ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని అధికారులు సూచించారు. దీనిపై నిర్వాసితులు ఇళ్ల నిర్మాణానికి సమయం పొడిగించాలని కోరారు. పోర్టు నిర్మాణంలో కీలక విభాగానికి ప్రస్తుత ఉన్న విష్ణుచక్రంలోనే నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండటంతో తొలి విడతగా ఆ గ్రామాన్ని ఖాళీ చేయాలని అధికారులు చెప్పారు. మరోవైపు మూలపేట గ్రామంలో 510 పిడిఎఫ్ కుటుంబాలకు ప్లాట్ల కేటాయింపు ఉండగా, ప్రస్తుతానికి విష్ణుచక్రం గ్రామస్తుల కే సరించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్‌డిఒ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్.డిఓ, ఆర్‌ఐ, ... తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ జయంతి ప్రసాద్, రెవెన్యూ సర్వే అధికారులు, నౌపడ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తనఖా పెట్టిన నగలు లూటీ

- యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ అరెస్టు

ప్రజాశక్తి - నాగలాపురం, సత్యవేడు

నాగలాపురంలో ఖాతాదారుల బంగారు నగలను తనఖా పెట్టి రూ.2 కోట్ల 80 లక్షలు లూటీ చేసిన ఘటనలో యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌ను అరెస్టు చేశారు. నిందితుడు ఆరవ సూర్యతేజను బుధవారం సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీ ఆధ్వర్యంలో అరెస్టు చేసి, గురువారం కోర్టులో హాజరుపరిచారు. సిఐ మురళి ఆధ్వర్యంలో నిందితుణ్ని మీడియా ముందు ప్రవేశపెట్టారు.

ఇఇఎఫ్‌ఐ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎలమరం కరీం, సుదీప్ దత్తా
- ఘనంగా ఇఇఎఫ్‌ఐ 10వ మహాసభ


రాజేంద్రన్, ఎలమరం కరీం, సుదీప్ దత్తా

తిరువనంతపురం : ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్‌ఐ) నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎలమరం కరీం, సుదీప్ దత్తా ఎన్నికయ్యారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో సోమవారం నుంచి బుధవారం వరకూ జరిగిన ఫెడరేషన్ 10వ మహాసభకు వివిధ రాష్ట్రాల నుండి 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత ఇఇఎఫ్‌ఐ అధ్యక్షులు ఎలిమరం కరీం జెండా ఆవిష్కరించారు. సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రారంభోపన్యాసం చేశారు. దక్షిణాఫ్రికాకు చెందిన ట్రేడ్ యూనియన్ అంతర్జాతీయ విద్యుత్ రంగం నాయకులు, ఎంపిహెచ్ఒ ఫకేడీ అడ్విన్, ఎఐఎఫ్ఇఇ ప్రధాన కార్యదర్శి మోహన్ శర్మ మహాసభలో సౌహార్ద సందేశం ఇచ్చారు. ఫెడరేషన్ జాతీయ నాయకులు స్వదేశ్ దేవరాయి, రాజేంద్రన్, లంబా, గోవర్ధన్, దీపా తదితరులు పాల్గొన్నారు మొదటి రోజు సాయంత్రం 4 గంటలకు తిరువనంతపురంలో బహిరంగ సభ జరిగింది. ఇఇఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి ప్రశాంత నంద చౌదురి, సుదీప్ దత్తా, సురేష్ లంబా ప్రవేశపెట్టిన నివేదికపై పలు రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. అనంతరం మహాసభ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎలమరం కరీం, సుదీప్ దత్తా, కోశాధికారిగా రాజేంద్రన్‌ను ఎన్నుకుంది.

ఆంధ్ర ప్రదేశ్ నుండి ఎన్నికైన ప్రతినిధులు

జాతీయ ఉపాధ్యక్షులుగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (రిజిస్ట్రేషన్ నెంబర్ బి-1829) నుండి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు, వర్కింగ్ కమిటీ సభ్యులుగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన రెడ్డి, కౌన్సిల్ సభ్యులుగా యూనియన్ కోశాధికారి ఎల్.రాజు ఎన్నికయ్యారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నుండి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె.రాజశేఖర్, వర్కింగ్ కమిటీ సభ్యులు బి.సుమన్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

సిఎం చంద్రబాబుతో డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం చంద్రబాబునాయుడుతో డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ జి.సతీష్‌రెడ్డి గురువారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలను, ముఖ్యంగా డిఫెన్స్ రంగంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు సంబంధించి సిఎంకు ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు. ప్రస్తుతం 50మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేలా సహకారం అందిస్తానని, అందుకు రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు కావాలని కోరిన నేపథ్యంలో సిఎం సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు ముందుకు వచ్చినా స్వాగతం పలుకుతామని, సత్వర అనుమతులతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, భూకేటాయింపులు చేస్తామని సతీష్‌రెడ్డికి సిఎం వివరించారు. ఈ భేటీలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), అమలాపురం ఎంపి హరీష్ ఉన్నారు.

ఉత్తరాఖండ్‌లో 52 మదర్సాలకు తాళం

- బిజెపి ప్రభుత్వ మరో విద్వేష చర్య
- అధికార దుర్వినియోగం అంటున్న ముస్లిం సంస్థలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో ఈ నెలలో ఇప్పటి వరకూ 52 మదర్సాలను అధికారులు మూసివేశారు. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మదర్సాల గుర్తింపు డ్రైవ్‌లో భాగంగా వీటిని మూసివేసినట్లు అధికారులు చెప్పారు. మూసివేసిన మదర్సాలు అక్రమం, చట్టపరమైన అనుమతి లేవనిగా వెల్లడయిందని తెలిపారు. కొన్ని మదర్సాలకు రిజిస్ట్రేషన్ కూడా లేదని అధికారులు అన్నారు. అయితే గత నెలల నుంచి మదర్సాలపై చర్యలు తీసుకుంటామని రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం చెబుతూవస్తుంది. అందుకు అనుగణంగా వీటిని మూసివేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమాచారం ప్రకారం ఈ నెల 1 నుంచి రాజధాని డెహ్రాడూన్‌లో 42 మదర్సాలను మూసివేశారు. నేపాల్‌కు సమీపంలో ఉన్న ఉధమ్ సింగ్ నగర్ జిల్లాలోని ఖాతిమాలో 10 మదర్సాలను మూసివేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మదర్సాలను మూసివేయడాన్ని ముస్లిం సంస్థలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. బిజెపి ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి నిదర్శనంగా విమరిస్తున్నాయి. రాష్ట్రంలోని నిజమైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే బిజెపి ప్రభుత్వం మైనార్టీలపై దాడి చేస్తుందని ముస్లిం సేవా సంఘటన్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి విమర్శించారు. ముస్లిం విద్యా సంస్థలకు ఎలాంటి అనుబంధ గుర్తింపు అవసరం లేదని తెలిపారు. 2 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్న మదర్సాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మూసివేయడంతో వారి భవిష్యత్ అంధకారంలో పడిందని, ఈ విద్యార్థులను పాఠశాలల్లో చేర్చడానికి ప్రభుత్వానికి ఏదైనా ప్రణాళికా ఉందా అని ప్రశ్నించారు. మూసివేసిన ఏ మదర్సాకు కూడా తమ వివరణ ఇవ్వడానికి సమయం, అవకాశం ఇవ్వలేదని తెలిపారు. 'రాష్ట్రం ప్రతీ ఏడాది అనేక ప్రకృతి, మానవ నిర్మిత విపత్తులను ఎదుర్కొంటుంది. ఇసుక అక్రమ తవ్వకాలు, చెట్ల అక్రమ నరికివేత, అవినీతి, నేరాలు-నిరుద్యోగం పెరుగుతున్నాయి. వీటి నుంచి ప్రభుత్వం తమను తాము కాపాడ్డుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికి మైనారిటీ సంస్థలపై దాడి చేస్తుంది' అని నయీమ్ ఖురేషి తెలిపారు.

కాగా, మైనార్టీ సంస్థలపై చర్యలు తీసుకోవడం పుష్కర్ సింగ్ ధామి ప్రభుత్వానికి కొత్త కాదు. అటవీ భూముల్లో అక్రమంగా నిర్మించారని ఆరోపిస్తూ గత ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 450 మజార్లు (మైనార్టీ కమ్యూనిటీకి చెందిన మతపరమైన నిర్మాణాలు), 50 ప్రార్థనాస్థలాలను కూల్చివేసింది.

రూ.46లక్షల విలువైన సీడ్స్ సీజ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం వ్యవసాయశాఖ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి, మండల వ్యవసాయ అధికారిని జె.శశికళ గురువారం అనంతపురం ఆర్‌టిసి బస్టాండ్ రోడ్డులోని బిఎఎస్‌ఎఫ్ కంపెనీకి సంబంధించిన కళింగర విత్తనాలను అమ్ముతున్న శ్రీ భవానీ ఏజెన్సీస్, శ్రీ సాయి బాలాజీ ట్రేడర్స్, శ్రీ రేవతి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, అవని సీడ్స్ అండ్ పెస్టిసీడ్స్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మీనల రవి మాట్లాడుతూ బుధవారం నాడు సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన మురళి అనే రైతు నాశిరకం కళింగర విత్తనాలను శ్రావణి సీడ్స్ దుకాణంలో కొనుగోలు చేసి నష్టపోయానని ఆరోపిస్తూ ఆత్మహత్యకు యత్నించాడన్నారు. అందులో భాగంగా శ్రావణి సీడ్స్ దుకాణంలో తనిఖీ నిర్వహించి రూ. 26 లక్షల విలువ గల విత్తన అమ్మకాలను నిలుపదల చేశామన్నారు. సీడ్ యాక్ట్ ప్రకారం బత్తలపల్లి ఉద్యానశాఖ అధికారి సిఫార్సుల మేరకు విత్తనాలను శాంపిల్ తీసి, ఫలితాల్లో నాసిరకం అని తేలితే శ్రావణి ఎంటర్ ప్రైజస్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీ భవాని ఏజెన్సీస్, శ్రీ సాయి బాలాజీ ట్రేడర్స్, శ్రీ రేవతి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, అవని సీడ్స్ అండ్ పెస్టిసీడ్స్ షాపుల్లోనూ రూ.20 లక్షల విలువజేసే కళింగర విత్తనాలు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లోగా పునరావాస కాలనీలకు తరలించాలి

- అధికారులకు పోలవరం ప్రాజెక్టు పరిశీలనాధికారి అభిషేక్ ఆదేశం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

వచ్చే జూన్‌లోగా పునరావాస పరిహారం అందించిన నిర్వాసితులను వారికి నిర్దేశించిన పునరావాస కాలనీలకు తరలించాలని పోలవరం ప్రాజెక్టు పరిశీలనాధికారి అభిషేక్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని నిర్వాసితులకు పునరావాసం, పురిహారానికి సంబంధించి సంబంధిత అధికారులతో స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. గోదావరి వరదలు వచ్చేలోపు గ్రామాల్లోని నిర్వాసితులకు పునరావాసం, పరిహారం అందజేతకు ముందస్తు చర్యలు చేపట్టాలని అభిషేక్ ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపును గురయ్యే 15 హేబిటేషన్లలో ఆర్అండ్ఆర్ పూర్తికి కార్యాచరణ ప్రణాళికను ఈ నెల 20లోగా అందజేయాలని ఆదేశించారు.

అశ్రునివాళి



జననం:
15-06-1948

మరణం:
13-03-2025

కీ॥శే॥ డా॥ అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజీ) గారు

ప్రముఖ పారిశ్రామికవేత్త

చెన్నైలో పుట్టి, గుంటూరులో క్రమశిక్షణ కలిగిన పారిశ్రామికవేత్తగా ఎదిగి,
కార్మికులతో పాటు, తోటి పారిశ్రామికవేత్తలలోనూ పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుని,
సామాజిక, దైవ సేవ కార్యక్రమాలలో ప్రముఖ పాత్ర పోషించిన మీ జీవితం మా అందరికి ఆదర్శం..

సేవా రత్న, విద్యాదాత, అన్నదాత, స్ఫూర్తిప్రదాత

కీ॥శే॥ డా॥ అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజీ) గారు

అకాల మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కుటుంబసభ్యులు

భార్య:
పరిమళ మాణిక్యవేల్

కుమారుడు:
పర్విన్‌రాజ్ మాణిక్యవేల్

కుమార్తె:
దివ్యభారతి మాణిక్యవేల్

BHARATHI CONSUMER CARE PRODUCT Pvt. Ltd.
Guntur

అంతిమయాత్ర: ఈ రోజు (ది.14-03-2025) శుక్రవారం మధ్యాహ్నం 10/2, అరండల్‌పేట, గుంటూరులో అన్నాజీ గారి స్వగృహం నుండి అంతిమయాత్ర బయలుదేరును.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68